సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 344

సోమవారం 6-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'



### సొంతగడ్డపై భావోద్వేగం

అంతర్జాతీయ టెన్నిస్ నుంచి వీడ్కోలు తీసుకున్న భారత దిగ్గజం సానియా మీర్జా ఆదివారం సొంతగడ్డపై చివరి మ్యాచ్ ఆడింది. మ్యాచ్ అనంతరం సానియాను తెలంగాణ రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్ సన్మానించారు. -12లో



### ఉత్తర కొరియాలో ఆకలి కేకలు

ఉత్తర కొరియా కనీవినీ ఎరుగని కరువు కోరల్లో చిక్కి అల్లాడుతోంది. తిండి లేక జనం అలమటిస్తున్నారు.

వివరాలు 6లో ▸



### ప్రజాస్వామ్యంపై దారుణ దాడి

దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే భారత్ జోడో యాత్ర చేశామని లండన్‌లో మీడియాతో మాట్లాడుతూ రాహుల్ అన్నారు.

వివరాలు 6లో ▸



### మరింత శక్తివంతంగా చైనా సైన్యం

సైనిక శక్తిని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకున్న చైనా రక్షణ బడ్జెట్‌ను 1.55 ట్రిలియన్ యువాన్‌లకు పెంచుకుంది.

వివరాలు 6లో ▸



### అధిక పెన్షన్.. అంత ఈజీ కాదు

వేతన జీవుల పెన్షన్‌పై ఈపీఎఫ్‌వోలోనూ స్పష్టతకొరవడిన నేపథ్యంలో దీనిపై అందుబాటులో ఉన్న వివరాలతో కథనం.

వివరాలు 13లో ▸

# ఇది నిరంకుశత్వం

## విపక్షమే లేకుండా అంతం చేసే ప్రయత్నాలు

### ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసిన కేసీఆర్, ఇతర విపక్ష నేతలు

లేఖ రాసిన నేతల్లో మమత, కేజ్రీవాల్, శరద్ పవార్, అఖిలేశ్, ఉద్ధవ్, తేజస్వీ, ఫరూక్ అబ్దుల్లా, భగవంత్ మాన్

- ప్రతిపక్షాల ముఖ్య నేతలు టార్గెట్‌గా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు..
- మనీశ్ సిసోడియా అరెస్టుతో ఈ పరిస్థితి ప్రపంచానికీ తెలిసింది
- అత్యధిక కేసులు, అరెస్టులు ఎన్నికల సమయాల్లోనే..
- అదే బీజేపీలో చేరినవారి కేసుల దర్యాప్తు గాలికి..
- విపక్షాల పాలనలోని రాష్ట్రాలపై గవర్నర్లను ఉసిగొల్పారు
- ఎన్నికల్లో ప్రజల తీర్పును గౌరవించాలని ప్రధానికి హితవు



సాక్షి, హైదరాబాద్

''మన దేశం ఇంకా ప్రజాస్వామికమేనని మీరూ అంగీకరిస్తారని భావిస్తున్నాం. కానీ ప్రతిపక్షాల నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను తీవ్రస్థాయిలో ఉసిగొల్పి దుర్వినియోగపర్చడాన్ని చూస్తుంటే.. మనం ప్రజాస్వామ్యం నుంచి నిరంకుశత్వం వైపు పరిణామం చెందినట్టు అనిపిస్తోంది..'' అని ప్రధాని నరేంద్ర మోదీపై దేశంలోని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. విపక్షాల ముఖ్య నేతలను లక్ష్యంగా చేసుకుంటున్న తీరును పరిశీలిస్తే.. విపక్షమనేదే లేకుండా అంతం చేయడానికి దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారన్న ఆరోపణలకు బలం చేకూరుతోందని పేర్కొన్నాయి. ఎన్నికల క్షేత్రం వెలుపల ప్రతీకారం తీర్చుకోవడానికి

మిగతా 2వ పేజీలో ▶

### ప్రైవేటు పీహెచ్‌డీలకు రెడ్ కార్పెట్

- కాలేజీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు మార్గదర్శకాలు విడుదల చేసిన జేఎన్‌టీయూహెచ్.. - 14లో▶

### ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల 'ఆసరా'పై దెబ్బ

- సీసీఎస్ నుంచి నిలిచిపోయిన వడ్డీ
- మూడు నెలలుగా అందక విశ్రాంత ఉద్యోగులు ఆగమాగం - 3లో▶

### గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతి

- వేర్వేరు ప్రాంతాల్లో మరో ఐదుగురు కూడా గుండెపోటుతో మరణం - 3లో▶



### అప్పుడు నిద్రపోయి ఇప్పుడు మేల్కొంది



- వైద్య కాలేజీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ ట్వీట్
- సకాలంలో దరఖాస్తు చేసుకోలేదన్న కేంద్ర మంత్రి వ్యాఖ్యలనూ ప్రస్తావించిన తమిళిసై

2లో

### కేంద్రం వివక్షపై రాజ్‌భవన్ దృష్టి పెట్టాలి

#### గవర్నర్‌ను ఉద్దేశించి మంత్రి హరీశ్ ట్వీట్



- మెడికల్ కాలేజీల విషయంలో రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం
- ఎన్నిసార్లు అడిగినా ఒక్కటి కూడా ఇవ్వలేదు
- రాష్ట్ర సొంత నిధులతో 12 వైద్య కళాశాలలు ప్రారంభించాం
- నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలకూ కౌంటర్!

- వివరాలు 2లో▶

## క్లుప్తంగా...

### కర్ణాటక ఎన్నికల్లో మజ్లిస్

**మూడు స్థానాలకు అభ్యర్థుల ఖరారు**




సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందే ముందస్తుగా ఏఐఎంఐఎం పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం ప్రకటించారు. బెలగావి నార్త్ కు లతీఫ్ ఖాన్ పఠాన్, హుబ్లీ ధర్వాడ్ ఈస్ట్‌కు దుర్గప్ప కాశప్ప బిజావాడ్, బసవన భాగేవాడికు అల్లాబక్ష్ మోహబూబ్ సాబ్ బీజాపూర్ అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్లు వెల్లడించా రు.

### ఢిల్లీ మంత్రిని అరెస్ట్ చేస్తే కేసీఆర్‌కు సంబంధమేంటి?

**బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్**



ఉండవెల్లి: ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా లిక్కర్ స్కాంలో అరెస్టయితే సీఎం కేసీఆర్ ప్రధానికి ఎందుకు లేఖ రాశారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర ఆదివారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఉండవెల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ కుమార్తె కవిత రూ.వంద కోట్లను ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించి కేజ్రీవాల్‌కు ఇచ్చిందని ఈడీ చెప్పినప్పుడు, 11 ఫోన్లను రాత్రి రాత్రికి ధ్వంసం చేసినప్పుడు కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. ఖదీర్‌ఖాన్ గురించి, అలంపూర్ రైతులు, ఆర్డీఎస్ కెనాల్, తుంగభద్ర నదీ జలాలపై ప్రధానికి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు.

### మెడికల్ కాలేజీలపై ఢిల్లీ నుంచి నిఘా

**ఫ్యాకల్టీకి బయోమెట్రిక్ విధానం తప్పనిసరి**



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాలలతో పాటు ఇప్పటికే నడుస్తున్న కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామనీ, బయోమెట్రిక్ హాజరు పద్ధతి లేని పక్షంలో ఎప్పుడైనా కళాశాల అనుమతిని రద్దు చేస్తామని జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) హెచ్చరించింది. ఈ మేరకు డీఎంఈలకు లేఖ రాసింది. అలాగే, మెడికల్ కాలేజీలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఢిల్లీలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయబోయే కళాశాలల్లో ఫ్యాకల్టీ హాజరుకు సంబంధించి ఆధార్ నంబర్లతో కూడిన బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరి చేసింది. కొత్తగా ఏర్పాటుచేసే మెడికల్ కళాశాలలకు అనుమతులు జారీచేసే విషయంలో కఠిన నిబంధనలు విధించింది. నిబంధనలు పాటించని కళాశాలలకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేసింది. అలాగే గత ఏడాది అనుమతులు జారీ చేసిన కళాశాలలు సైతం కొత్త నిబంధనలు అమలు చేయాలని సూచించింది. గతంలో కొత్త మెడికల్ కళాశాలల అనుమతులకు సంబంధించి ఎన్‌ఎంసీ బృందం తనిఖీలు చేసిన సమయంలో ఇతర కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బందిని తమ కళాశాలల్లో పని చేస్తున్నట్లు చూపినట్లుగా గుర్తించింది. అలాగే, ఎన్‌ఎంసీ బృందం తనిఖీలలో సంబంధిత కళాశాలకు శాశ్వత భవనం లేనప్పటికీ ఉన్నట్లుగా చూపించడం, ఆ తరువాత ఇరుకు భవనాలలోనే కొనసాగించిన సంఘటనలు సైతం వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో తక్షణమే మెడికల్ కళాశాలలు అనుబంధ ఆస్పత్రులలో సీసీ టీవీలతో పాటు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కొత్త మెడికల్ కళాశాలల్లో అన్ని నిబంధనలు అమలవుతున్నాయో లేదో పరిశీలించిన తరువాతనే అనుమతుల కోసం రిఫర్ చేయాలని సూచించింది. ఇప్పటికే మహబూబ్‌నగర్, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, మంచిర్యాల, రామగుండం, జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి, నాగర్‌కర్నూలు, మహబూబాబాద్, సంగారెడ్డిలో కళాశాలలు ఏర్పాటు కాగా తరగతులు కొనసాగుతున్నాయి. తాజాగా మరో 8 కళాశాలలను ఈ ఏడాది ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది.



.. గేట్‌పాస్ మీ చేతుల్లోనే ఉంది.. మీ ఇష్టం సార్!

# వాటమ్మా.. వాట్సాప్ 'స్పామ్'మ్మా

- చిర్రెత్తిస్తున్న స్పామ్ మెసేజ్‌లు
- ఈ సమస్య ఎదుర్కొంటున్న వారు 95 శాతం మంది
- లోకల్ సర్కిల్ సంస్థ సర్వేలో వెల్లడి



సాక్షి, అమరావతి: ఆఫీస్‌లోనో.. ఇంట్లోనో పనిలో నిమగ్నమై ఉండగా వాట్సాప్ నోటిఫికేషన్ వస్తుంది. ఎవరు మెసేజ్ పంపారో.. ఏంటోనని పని ఆపేసి మరీ చూస్తే.. 'ఫలానా షోరూమ్‌లో పండుగ ఆఫర్ ఉంది. త్వరగా షాపింగ్ చేయండి. ఆఫర్ వివరాల కోసం ఈ లింక్‌పై క్లిక్ చేయండి' అనే మెసేజ్ కనిపిస్తుంది. అలాంటివి చూడగానే చిర్రెత్తుకొస్తుంది. ఇలాంటి మెసేజ్‌లు దేశంలోని వాట్సాప్ వినియోగదారుల్లో 95 శాతం మందిని విసిగిస్తున్నాయి. రోజుకు కనీసం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లు వాట్సాప్ వస్తున్నాయి. 'లోకల్ సర్కిల్' నిర్వహించిన ఓ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. తెలియని నంబర్ల నుంచి వస్తున్న ఇలాంటి మెసేజ్‌లపై దేశవ్యాప్తంగా 351 జిల్లాల్లో 51 వేల మంది వాట్సాప్ వినియోగదారులను వివిధ అంశాలపై ప్రశ్నించారు. వీటిల్లో ఎక్కువగా రియల్ ఎస్టేట్, వాణిజ్య ప్రకటనలు, ఉద్యోగ అవకాశాలు, వైద్య సేవలు వంటివి ఉంటున్నట్లు తేలింది.




**ఇలా చేయండి**

ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు మన వాట్సాప్‌కు అభ్యంతరకర, అసభ్యమైన మెసేజ్‌లు పంపినా.. పదేపదే స్పామ్ మెసేజ్‌లతో ఇబ్బంది పెడుతున్నా సంబంధిత కాంటాక్ట్‌లను బ్లాక్ చేసే అవకాశం వాట్సాప్‌లో ఉంది. ఇలా చేస్తే వాట్సాప్ ఫిర్యాదుల బృందానికి రిపోర్ట్ ఫార్వర్డ్ చేయబడుతుంది. ఒకే కాంటాక్ట్‌పై ఎక్కువ రిపోర్ట్‌లు నమోదైతే ఆ కాంటాక్ట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తారు.

# కేంద్రం వివక్షపై రాజ్‌భవన్ దృష్టి పెట్టాలి

- గవర్నర్‌ను ఉద్దేశించి మంత్రి హరీశ్‌రావు ట్వీట్
- నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలకూ కౌంటర్!



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విషయంలో కేంద్రం చూపిస్తున్న వివక్షపై రాజ్‌భవన్ దృష్టి పెడితే రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీల విషయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేసిందని ఆరోపించారు. మెడికల్ కాలేజీలకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం ఉదయం చేసిన ట్వీట్‌పై ఆయన ట్విట్టర్‌లో స్పందించారు. వైద్య కళాశాలలపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కూడా హరీశ్ కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు.

**మెడికల్ కాలేజీలపై మోసం**

'రాష్ట్రానికి కొత్త మెడికల్ కాలేజీలు మంజూరు చేయాలని అనేకసార్లు కేంద్రాన్ని కోరితే 157 మెడికల్ కాలేజీల్లో ఒక్కటంటే ఒక్క మెడికల్ కాలేజీని తెలంగాణకు ఇవ్వకుండా కేంద్రం మొండిచేయి చూపింది. ఒకటో ఫేజ్‌లో ఇస్తారనుకుంటే రెండో ఫేజ్‌లో కూడా ఇవ్వలేదు, మూడో ఫేజ్‌లో ఇస్తామని చెప్పి చివరకు మోసం చేసింది. ఇప్పుడు నర్సింగ్ కాలేజీల విషయంలో కూడా అదే వివక్షను ప్రదర్శించింది. పైగా మెడికల్ కాలేజీల విషయంలో ఒక్కో మంత్రి ఒక్కో విధంగా మాట్లాడటం బాధాకరం. ఒకరు రాష్ట్ర ప్రభుత్వం అడగలేదు అంటే.. మరొకరు కరీంనగర్, ఖమ్మంలో మెడికల్ కాలేజీ కోసం తెలంగాణ అడిగిందనీ, అక్కడ ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉండటం వల్ల మంజూరు చేయలేక పోయామని అంటారు. ఎవరు ఎవర్ని మోసం చేస్తున్నారు, ఎవరు తప్పుదారి పట్టిస్తున్నారు..?' అని హరీశ్ నిలదీశారు.

**దేశంలోనే నం.1గా రాష్ట్రం**

'కేంద్రం మెడికల్ కాలేజీలు ఇవ్వకున్నా, పైసా నిధులివ్వకున్నా..సీఎం కేసీఆర్ రాష్ట్ర సొంత నిధులతో 12 మెడికల్ కాలేజీలు ప్రారంభించారు. ఈ ఏడాది 9, మరో ఏడాది 8 ఇలా.. జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ 1గా ఉండటం వాస్తవం కాదా? ఒకే ఏడాది, ఒకే రోజున తెలంగాణ ప్రభుత్వం 8 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే, ప్రశంసించేందుకు మనస్సు రానివాళ్లు పసలేని విమర్శలు, ఆరోపణలు చేయడం సమంజసమా?..' అని ప్రశ్నించారు.

**బీబీనగర్ ఎయిమ్స్‌కు ఎందుకింత దుస్థితి?**

'గతంలో బీబీనగర్ ఎయిమ్స్‌కు తెలంగాణ ప్రభుత్వం భూమి కేటాయించలేదు అని ఒక కేంద్ర మంత్రి అన్నారు. ఆధారాలు చూపిస్తే నోట మాట లేదు. ఇప్పుడు మెడికల్ కాలేజీల విషయంలోనూ అలాంటి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీ ఎయిమ్స్ స్థాయిలో ఉండాల్సిన బీబీనగర్ ఎయిమ్స్, ఎందుకని గల్లీలోని మా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో కూడా లేదు? ఎందుకు అధ్వాన్నంగా ఉంది? రూ.1,365 కోట్ల నిధులు మంజూరు చేయాల్సి ఉన్నా, ఎందుకు రూ.156 కోట్లు (11.4%) మాత్రమే మంజూరు చేశారు? ఇదే సమయంలో అంటే 2018లో మంజూరు అయిన గుజరాత్ ఎయిమ్స్‌కు 52% నిధులు ఇచ్చింది వాస్తవం కాదా?..'అని హరీశ్ నిలదీశారు.

**గిరిజన వర్సిటీ, కోచ్ ఫ్యాక్టరీపై దృష్టి పెట్టండి**

తెలంగాణకు జరిగిన అన్యాయాల గురించి ఎవరూ ఎందుకు మాట్లాడటం లేదని, తెలంగాణ ప్రయోజనాల గురించి ఎందుకు నిలదీయడం లేదని మంత్రి ప్రశ్నించారు. ఏపీ పునర్ విభజన చట్టం -2014 లో ఇచ్చిన హామీల మేరకు గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి వాటిని మంజూరు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవడంపై రాజ్‌భవన్ దృష్టి పెడితే తెలంగాణ ప్రజలకు గొప్ప మేలు చేసినట్టవుతుందని పేర్కొన్నారు.

# అప్పుడు నిద్రపోయి ఇప్పుడు మేల్కొంది

**వైద్య కళాశాలల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ విమర్శ**



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన (పీఎంఎస్‌ఎస్‌వై) కింద కేరళలోని కోజికోడ్‌లో నిర్మించిన వైద్య కళాశాలను ప్రశంసిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం ట్వీట్లు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణకు ఎన్ని వైద్య కళాశాలలు ఇచ్చారని ఓ నెటిజన్ ప్రశ్నించగా ఆమె ఘాటుగా స్పందించారు. అప్పుడు నిద్రపోయిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు ఆలస్యంగా మేల్కొని వైద్య కళాశాలలు అడుగుతోందని వ్యాఖ్యానించారు. పీఎంఎస్‌ఎస్‌వై కింద కొత్త వైద్య కళాశాలల కోసం ఇతర రాష్ట్రాలన్నీ దరఖాస్తు చేసుకోగా, సకాలంలో దరఖాస్తు చేసుకోవడంలో తెలంగాణ విఫలమైందని కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి మన్‌సుక్ మాండవియా పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రస్తావించారు. తమిళనాడు కేవలం ఒకే ఏడాదిలో 11 వైద్య కళాశాలలను పొందిందని పేర్కొన్నారు.

# ఇది నిరంకుశత్వం

▶ మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగబద్ధ గవర్నర్ కార్యాలయాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం సరికాదని మండిపడ్డాయి. ఈ మేరకు కాంగ్రెసేతర విపక్షాలైన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్ రావు, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, శివసేన యూబీటీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలోని ముఖ్యాంశాలు వారి మాటల్లోనే..

**ఎన్నికల సమయాల్లోనే దాడులు అధికం**

"2014 నుంచి ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తుండటంతో వాటి ప్రతిష్ట మసకబారింది. వాటి స్వయం ప్రతిపత్తి, నిష్పాక్షికతపై ప్రశ్నలను లేవనెత్తింది. వీటిపై దేశ ప్రజలు నానాటికి విశ్వాసాన్ని కోల్పోతున్నారు. చాలా సందర్భాల్లో ఎన్నికల సమయంలో నమోదవుతున్న కేసులు, జరుగుతున్న అరెస్టులను పరిశీలిస్తే.. అవి పక్కాగా రాజకీయ ప్రేరేపితమైనవని స్పష్టంగా అర్థమవుతోంది. మీ పార్టీ (బీజేపీ)తో విరుద్ధ భావజాలాన్ని కలిగిన పార్టీకి అనుకూలంగా ప్రజలు తీర్పునిచ్చినా గౌరవించి తీరాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయం. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ తమ ప్రాధాన్యతను కోల్పోయాయి.

**దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు**

దర్యాప్తు, విచారణల పేరుతో సుదీర్ఘకాలం ఉద్దేశపూర్వకంగా వేటాడి, వెంటాడి ఎలాంటి ఆధారాలు లేకున్నా కూడా ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేసింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారం. రాజకీయ కుట్రతో కూడినవి. ఆయన అక్రమ అరెస్టు దేశవ్యాప్తంగా ప్రజలను ఆగ్రహానికి గురి చేసింది. పాఠశాల విద్యలో గొప్ప సంస్కరణలను తీసుకొచ్చి ప్రపంచవ్యాప్త గుర్తింపును మనీశ్ సిసోడియా పొందారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలన్న లక్ష్యంతో చేపట్టిన దురుద్దేశపూర్వక దర్యాప్తుకు ఈ అరెస్టు తార్కాణంగా నిలిచింది. నిరంకుశ బీజేపీ పాలనలో దేశంలో ప్రజాస్వామిక విలువలకు ముప్పు వాటిల్లిందన్న ప్రపంచం అనుమానాలను నిజం చేసింది.

**విపక్ష నేతలపై వేధింపులు**

2014 నుంచి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం, కేసులు పెట్టడం, అరెస్టు చేయడం వంటివి గణనీయంగా పెరిగాయి. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌యాదవ్, శివసేన నేత సంజయ్ రౌత్, ఎస్పీ నేత ఆజంఖాన్, ఎన్సీపీ నేతలు నవాబ్ మాలిక్, అనిల్ దేశ్‌ముఖ్, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ వంటి ప్రముఖ ప్రతిపక్ష నేతలు కేంద్ర దర్యాప్తు సంస్థల చేతిలో వేధింపులను ఎదుర్కొన్నారు. కేంద్రంలోని పాలక పార్టీకి అనుబంధ విభాగాలుగా కేంద్ర దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయనే అనుమానాలకు ఈ కేసులు బలం చేకూరుస్తున్నాయి.

**గవర్నర్లను ఉసిగొల్పి..**

సమాఖ్య వ్యవస్థపై యుద్ధానికి కేంద్రం ఇంకో వ్యవస్థను ఉసిగొల్పుతోంది. దేశవ్యాప్తంగా గవర్నర్ కార్యాలయాలు రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ, రాష్ట్రాల పాలనకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లు, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అంతా కేంద్రం, రాష్ట్రాల మధ్య విభేదాలను పెంచుతూ సహకార సమాఖ్య స్ఫూర్తికి ప్రమాదకారులుగా తయారయ్యారు. సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించడంలో కేంద్రం పూర్తిగా విఫలంకాగా.. రాష్ట్రాలు రాజ్యాంగ విలువలతో సమాఖ్య స్ఫూర్తిని పాటిస్తున్నాయి. గవర్నర్ల వైఖరి పర్యవసానంగా దేశ ప్రజలు ప్రజాస్వామ్యంలో గవర్నర్ల పాత్ర ఏమిటని ప్రశ్నించడం ప్రారంభించారు.'' అని లేఖలో విపక్షాల నేతలు పేర్కొన్నారు.

**ఆ సంస్థపై దర్యాప్తు చేయరా?**

రూ.78,000 కోట్లకుపైగా ఒక నిర్దిష్ట సంస్థ (అదానీ గ్రూపు)లో పెట్టుబడిగా పెట్టడంతోనే ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ భారీగా నష్టపోయినట్టు ఓ అంతర్జాతీయ ఫోరెన్సిక్ ఆర్థిక పరిశోధన సంస్థ నివేదిక ప్రచురించింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఈ సంస్థల అవకతవకలపై కేంద్ర ఏజెన్సీలు ఎందుకు దర్యాప్తు చేయడం లేదు?

**బీజేపీలో చేరితే కేసుల నుంచి ఉపశమనం**

మీ పరిపాలనలో 2014 నుంచి దర్యాప్తు సంస్థల కేసులు, అరెస్టులు, దాడులు, విచారణలను ఎదుర్కొన్న ప్రముఖ రాజకీయ నాయకుల్లో అత్యధికులు ప్రతిపక్ష నేతలే. బీజేపీలో చేరిన ప్రతిపక్ష నాయకుల కేసులపై విచారణలను దర్యాప్తు సంస్థలు నెమ్మదిగా చేస్తున్నాయి. 2014, 2015 సంవత్సరాల్లో శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో కాంగ్రెస్ మాజీ నేత, ప్రస్తుత అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మపై సీబీఐ, ఈడీ విచారణ జరిపాయి. ఆయన బీజేపీలో చేరాక కేసు దర్యాప్తు నీరుగారిపోయింది. నారద స్టింగ్ ఆపరేషన్ కేసులో టీఎంసీ మాజీ నేతలు సువేందు అధికారి, ముకుల్ రాయ్‌లను సీబీఐ, ఈడీ వెంటాడి వేధించాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారు బీజేపీలో చేరడంతో దర్యాప్తు అటకెక్కింది. ఇవేకాదు మహారాష్ట్రకు చెందిన నారాయణ్ రాణే కేసు సహా మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి.

# వైఎస్సార్‌లాంటి పాలన అందిస్తాం

- కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వండి
- వేములవాడ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



వేములవాడ సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

వేములవాడ: 'నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గుర్తించి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వండి. వైఎస్సార్ లాంటి పాలన అందిస్తాం'అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. 2024లో కాంగ్రెస్ అధికారంలోకొస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, యువకులకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, రూ.5 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, రూ.500కే ఇంటికి గ్యాస్ సిలిండర్ అందజేస్తామని హామీనిచ్చారు.

**ఆది శ్రీనివాస్ సూచనతో..**

2005లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో స్థానిక కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ సూచనతో మెట్టప్రాంతమైన వేములవాడకు రూ.1,735 కోట్లతో ఎల్లంపల్లి నీళ్లను ఫాజుల్‌నగర్ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని రేవంత్ చెప్పారు. ఇది తెలుసుకున్న సీపీఐ సీనియర్ నేత సీహెచ్.రాజేశ్వర్‌రావు ఓ సభలో స్వయంగా ఆది శ్రీనివాస్ వయసులో చిన్నవాడైనా వైఎస్సార్‌ను ఒప్పించి ఈ ప్రాంతానికి సాగునీరు తెచ్చి ఎంతో గొప్ప పని చేశారంటూ మెచ్చుకున్న వైనం ఈ ప్రాంతప్రజలు మరచిపోవద్దన్నారు.

**43 వేల ఎకరాలకు సాగునీరు హామీ ప్రగల్భాలే**

స్వరాష్ట్రం సిద్ధించాక అధికారంలోకి వచ్చినపుడు మంత్రి హరీశ్‌రావు ఫాజుల్‌నగర్‌లో 43 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రగల్భాలు పలికారని రేవంత్ విమర్శించారు. ఎన్నికల్లో ఓట్లు దండుకుని ఇప్పటికీ ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రసంగించారు.

**సాగునీటి ప్రాజెక్టులపై కేసీఆర్ వివక్ష**

కథలాపూర్: ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్రుల మాదిరిగానే తెలంగాణలోనూ సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులపై వివక్ష చూపిస్తున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కలిగోట గ్రామ శివారులోని అసంపూర్తిగా మిగిలిన సూరమ్మ రిజర్వాయర్‌ను పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే 18 నెలల్లో సూరమ్మ రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామన్నారు.

# రాష్ట్రంపై విద్యుత్ భారం రూ.3వేల కోట్లు

- అన్నం తినడం నేర్పానని చంద్రబాబు చెప్పడం విడ్డూరం
- ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్/దుబ్బాక టౌన్: వ్యవసాయానికి 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం రూ.3 వేల కోట్ల అదనపు భారాన్ని భరిస్తోందని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆయన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్న గుండవెల్లి, రావురుకుల, రాఘవాపూర్, బుస్సాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బావుల వద్ద మోటార్లకు మీటర్ బిగించాలని కేంద్రం చెబుతున్నా, మీటర్లు పెట్టబోమని సీఎం కేసీఆర్ చెప్పడంతో రాష్ట్రానికి రావాల్సిన రూ.30 వేల కోట్ల విద్యుత్ నిధులను నిలిపివేసిందన్నారు. తెలంగాణ ప్రజలకు అన్నం తినడం తానే నేర్పించానని చంద్రబాబు చెప్పుకోవడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో 54 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంటే, ఆంధ్రప్రదేశ్‌లో 16 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి పండుతోందని.. ఎవరు ఎవరికి అన్నం తినడం నేర్పిస్తున్నారో ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా రుణాల వడ్డీని ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

**అమరవీరుల స్థూపావిష్కరణ**

ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం దుబ్బాక మండలం కొండాపూర్‌లో అమర వీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముంబయి, దుబాయి, బొగ్గుబాయి.. అనే తెలంగాణ బతుకులు.. ఇవాళ భూమికి బరువయ్యేంత పంట పండించాయని చెప్పారు.

# చంపుతమని తిరుగుతున్నరు

- చెరుకు సుధాకర్‌ను చంపుతారంటూ ఆయన కొడుకు సుహాస్‌కు బెదిరింపులు!
- కోమటిరెడ్డి బెదిరించినట్లు ఆడియో లీక్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, ఆయన కుమారుడు డాక్టర్ చెరుకు సుహాస్‌ను తన అభిమానులు చంపుతారంటూ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బెదిరించినట్లుగా ఉన్న ఆడియో లీక్ అయ్యింది. అసభ్యంగా వారిద్దరినీ దూషించినట్లున్న ఆ ఆడియో ఆదివారం కలకలం రేపింది.

**అసలు ఆడియోలో ఏముందంటే..**

'చూసినవా స్టేట్‌మెంట్.. (అంకుల్ అది వాట్సప్‌లో అట్ల ఇచ్చిండు కానీ ఆ వీడియో ఒకసారి మీరు పూర్తిగా చూడండి–ఎదుటి వ్యక్తి వాయిస్) ఏం చూసుడు. వాన్ని చంపుతమని తిరుగుతున్నరు. వంద మంది వెహికిల్ వేసుకొని తిరుగుతున్నరు. ఈ వీడియో కాదు నన్ను వందసార్లు తిట్టిండు. నెలరోజులు ఓపిక పట్టి ఇప్పుడు వంద కార్లలో వాణ్ని చంపుతమని తిరుగుతున్నరు. నిన్ను కూడా చంపుతరు. నీ హాస్పిటల్‌ను కూడా కూలగొడుతరు. లక్షల మందిని బతికించిన నేను. వానికెంత ధైర్యం నిన్న మొన్న పార్టీలకొచ్చి.. వాణ్ని వదిలిపెట్టర్రా.. నేను చెబుతున్న నీకు, వార్నింగ్ ఇస్తున్న. నేను ఆపలేను ... క్షమించమని చెప్పి, నా పేరు తీసుకొని మొన్న స్టేట్మెంట్లు ఇచ్చిండు ఓపిక పట్టిండ్రు. సార్ మాతోని కాదిగ, నువ్వేమో ఏమనొద్దంటున్నవ్ సార్.. మేము వెళ్లినం బయటికి, యాడ దొరికితే ఆడ చంపేస్తం అంటుండ్రు వాళ్లు. నా తోని కాదు.. వాడు క్షమాపణ చెప్పకపోతే మాత్రం చంపేస్తరు... అసోంటి వంద వీడియోలు, డైరెక్టు పేరు పెట్టి వందసార్లు తిట్టిండు వాడు. ఇప్పుడొక బ్యాచ్ వెళ్లింది. నిన్ను కూడా చంపుతరు చెబుతున్న అరేయ్... నీ హాస్పిటల్ నడువదు. 25 ఏళ్లలో లక్షల మందిని బతికించిన నేను. వారందరిని కంట్రోల్ చేస్తానా నేను. అతనికి ఫోన్ చేసి చెప్పు.. అరేయ్ నీకు పార్టీ ఉన్నదారా.. ఇంటిపార్టీ ఏందిరా.. నువ్వు కౌన్సిలర్‌గా గెలవవు.. ఆయన అంతపెద్ద లీడరు అని చెప్పు. వాడు జైళ్ల పడితే నేను ఒక్కడినే పోయిన. ఎవరూ పోలే అప్పుడు. చెప్పు.. వారంకంటే ఎక్కువుండడాడు'.

**కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం**

డాక్టర్ చెరుకు సుధాకర్‌ను, ఆయన కుమారుడిని చంపుతామంటూ బెదిరించినట్లుగా ఆడియో లీక్ నేపథ్యంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ గడియారం సెంటర్‌లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాగా, ఎంపీ కోమటిరెడ్డిపై క్రిమినల్ కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలని బీసీ యువజన సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది.

**దరిద్రుడు, చీడపురుగంటూ నన్ను తిట్టుడేంది: కోమటిరెడ్డి**



కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి చెరుకు సుధాకర్ నాపై కామెంట్స్ చేస్తుండు. ఒకసారి దరిద్రుడని, మరోసారి చీడ పురుగని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నడు. సోషల్ మీడియాలో పోస్టులు ఎందుకు పెడుతున్నరని ఆయన కొడుకును అడిగితే పెడితేఏంది అంటూ వంకర టింకర మాట్లాడుతుండు. ఇది ఎంతవరకు కరెక్టు. పార్టీకి పని చేయాలి. నన్ను తిట్టుడేంది?

**నా కొడుకుకు ఫోన్ చేసి నన్ను తిట్టడం ఆశ్చర్యం కలిగించింది: చెరుకు సుధాకర్**



వెంకట్‌రెడ్డి అసభ్యంగా నన్ను తిట్టడం ఆశ్చర్యం కలిగించింది. నేను కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా, అతను స్టార్ క్యాంపెయినర్‌గా ఉండి ఒకే పార్టీలో పని చేస్తున్నా నాపై అత్యంత నేరపూరితమైన, టెర్రరిస్టు భాష మాట్లాడారు. ఆయనకు మతి ఉండి మాట్లాడుతుండో.. మతి లేక మాట్లాడుతుండో అర్థం కావడంలేదు. ఆడియో టేపును తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్ రావు ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి పంపించా. కోమటిరెడ్డిని నేను వ్యక్తిగతంగా తిట్టిన సందర్భాలు లేవు. నయీం లాంటి కరుడు గట్టిన తీవ్రవాదే నన్నేమీ చేయలేకయాడు. కోమటిరెడ్డి ఏం చేస్తాడు? ఈ వ్యాఖ్యలపై అధిష్టానం నిర్ణయం తీసుకోవాలి.

# బీసీలు ఎందుకు ఐక్యం కావడం లేదు?

**ఒక శాతానికన్నా తక్కువున్న వారి గుప్పిట్లో రాష్ట్రం: ఈటల రాజేందర్**

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాలు ఐక్యమై కొట్లాడితేనే హక్కులు సాధించుకోవచ్చని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. అడుక్కుంటే వచ్చేవి హక్కులు కావని వ్యాఖ్యానించారు. బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో 'ఫ్యూచరిస్టిక్ డెవలప్‌మెంట్ ఆఫ్ బ్యాక్ వర్డ్ క్లాసెస్' అనే అంశంపై జరిగిన సదస్సులో ఈటల ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చైతన్యవంతమైన తెలంగాణ గడ్డ మీద బీసీ వర్గాలు ఎందుకు ఐక్యం కావడం లేదని ప్రశ్నించారు. ఒక్క శాతం కన్నా తక్కువ ఉన్న వారు రాష్ట్రాన్ని గుప్పిటో పెట్టుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**బోడుప్పల్ భూ బాధితులకు న్యాయం చేయాలి**



కవాడిగూడ: ఎన్నో ఏళ్ల క్రితం కష్టార్జితంతో బోడుప్పల్‌లో 7 వేల కుటుంబాలు పట్టా భూములను కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటే ఇప్పుడు ప్రభుత్వం ఆ భూములను వక్ఫ్ భూములుగా మార్చడం దుర్మార్గమని ఈటల రాజేందర్ అన్నారు. బోడుప్పల్‌లో స్థానికులు చేపట్టిన నిరసన దీక్షలో మాట్లాడారు.

# దైవదర్శనానికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- మృతుల్లో ఒకరు కేసీఆర్ సమీప బంధువు

కామారెడ్డి క్రైం: వెనుకనుంచి వేగంగా వచ్చిన కంటైనర్ ఓ కారును ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన రామారెడ్డి బైపాస్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. కరీంనగర్‌కు చెందిన పుల్లూరి మహోదర్‌రావు (55), లక్కోడి మధుసూదన్‌రెడ్డి (58), ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారావు కామారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల దేవస్థానానికి వచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో రామారెడ్డి బైపాస్‌కు కొద్ది దూరంలో వీరి కారును.. వెనుక నుంచి వేగంగా వస్తున్న ఓ కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదంలో కారు వెనక సీట్లో కూర్చున్న మహోదర్‌రావు, మధుసూదన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవింగ్ చేస్తున్న రామకృష్ణారావు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కంటైనర్‌తో డ్రైవర్ అక్కడ నుంచి పరారు కాగా.. తూప్రాన్ ప్రాంతంలో పోలీసులు పట్టుకున్నారు. మహోదర్‌రావు సీఎం కేసీఆర్ బావమరిది శ్రీనివాస్‌రావు సమీప బంధువని తెలిసింది.

## క్లుప్తంగా...

### రెండ్రోజుల్లో ఎన్టీపీసీ మొదటి యూనిట్ లైటప్



తెలంగాణ స్టేజీ-1 ప్రాజెక్టు

**జ్యోతినగర్:** పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నిర్మిస్తున్న తెలంగాణ స్టేజీ-1లోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల మొదటి యూనిట్ రెండ్రోజుల్లో లైటప్ కానుంది. రాష్ట్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం ఎన్టీపీసీ 4,000 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకుంది. స్టేజ్-1లో భాగంగా 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల 2 యూనిట్లను నిర్మించింది. మొదటి యూనిట్ (800 మెగావాట్లు) పనులు పూర్తి చేశారు. 2022 డిసెంబర్ ఒకటిన లైటప్ చేశారు. మరోసారి జనవరి 5న లైటప్ చేయాల్సి ఉండగా.. సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. తాజాగా రెండురోజుల్లో లైటప్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లైటప్ చేస్తే మూడ్రోజుల్లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రానుంది. మరోవైపు మరో 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను జూన్‌లో లైటప్ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

### మహిళా కానిస్టేబుల్ మృతిపై అనుమానాలు



మౌనిక మృతదేహం

**రామన్నపేట:** మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నాంపల్లి మౌనిక(26) అనుమానాస్పద మృతి ఘటన వివాదం రేపింది. మౌనిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె భర్త చెబుతుండగా తమ కూతురిని హత్య చేశారని మౌనిక తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పూర్వాపరాలిలా.. హనుమకొండ వడ్డేపల్లికి చెందిన రాజేందర్, నర్సమ్మ దంపతుల కూతురు మౌనికకు వరంగల్ వేణురావు కాలనీలో ఉండే శ్రీధర్‌తో 2015లో వివాహమైంది. వీరికి ఐదేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. భర్త శ్రీధర్ ఆమెకు వచ్చే వేతనాన్ని ఇవ్వాలంటూ నిత్యం చిత్రహింసలకు గురి చేసేవాడని మౌనిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఉదయం తమ కూతురు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడిందని సమాచారం ఇచ్చారని, కానీ తమ బిడ్డను భర్త శ్రీధర్, అత్త వీరలక్ష్మి, బావ కృష్ణమూర్తి అదనపు కట్నం కోసం తీవ్ర వేధింపులకు గురిచేసి చంపారని మౌనిక తండ్రి రాజేందర్ ఫిర్యాదు చేశారు. మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీధర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ కుటుంబసభ్యులు ఎంజీఎం మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు.


### టీ-వ్యాలెట్‌తో విప్లవాత్మక మార్పులు

- ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్



**సాక్షి, హైదరాబాద్:** డిజిటల్ చెల్లింపుల రంగంలో తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ చెప్పారు. జీ-20 సదస్సులో భాగంగా ఆదివారం హెచ్ఐసీసీలో 'గ్లోబల్ పార్టనర్‌షిప్ ఫర్ ఫైనాన్షియల్ ఇంక్లుసివ్'అనే అంశంపై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన టీ-వ్యాలెట్‌తో గ్రామీణ ప్రాంతాల ఆర్థిక లావాదేవీల్లో సమూల మార్పులు వచ్చాయని, దీనిద్వారా 1.39 మిలియన్ల లావాదేవీలు జరిగాయని వెల్లడించారు. 3.5 కోట్ల మంది టీ వ్యాలెట్ వాడుతున్నారని వివరించారు. రైతులతో పాటు సామాన్యులు దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నా రు. రైతుబంధు, విద్యార్థులకు ఉపకార వేతనాల చెల్లింపులకు టీ వ్యాలెట్‌ను ప్రభుత్వం ఉపయోగిస్తోందని ఆయన తెలిపారు.

### విద్యను జాతీయం చేయాలి




జాజుల శ్రీనివాస్‌గౌడ్

**నాంపల్లి:** విద్యను జాతీయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో జరిగింది. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఓయూ విద్యార్థి గిడుగు మహేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా సాయితేజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. విద్య వ్యాపారం కావడంతోనే బీసీలు ఉన్నత విద్యను పొందలేక, కుల వృత్తులకే పరిమితమవుతున్నారని వాపోయారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే నాణ్యమైన విద్య, ఉచిత విద్య, ఉపాధి, ఉద్యోగం లభిస్తాయనుకుంటే గొర్రెలు, బర్రెలు, చేపలు ఇచ్చారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు, పిచికారీ ▸ డ్యూటీ డ్రోన్లదే..

### త్వరలో రైతులకు అద్దెకు డ్రోన్లు

- వీటితో విత్తనాలు చల్లడంలో కచ్చితత్వం
- రైతులు పురుగుమందుల దుష్ప్రభావాలకు గురికాకుండా చేయొచ్చంటున్న ఆగ్రోస్ అధికారులు
- సాగు ఖర్చూ తగ్గుతుందని వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి కేంద్రాల్లో అందుబాటులో.. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా





**సాక్షి, హైదరాబాద్:** వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. సంప్రదాయ సాగు నుంచి ఆధునిక పద్ధతిలో పంటలు పండించే విధానాలు పెరుగుతున్నాయి. విత్తనాలు వేయడం నుంచి ఎరువులు చల్లడం వరకు అన్ని ప్రక్రియల్లో డ్రోన్లు గణనీయమైన పాత్ర పోషించనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెయ్యి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో వాటిని అందుబాటులో ఉంచి రైతులకు అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆగ్రోస్ వర్గాలు వెల్లడించాయి. సేవా కేంద్రాల నిర్వాహకులు డ్రోన్లు కొనుగోలు చేసుకునేందుకు అవసరమైన బ్యాంకు రుణాలను ఆగ్రోస్ ఏర్పాటు చేస్తుంది. వారికి శిక్షణతో పాటు లైసెన్స్ ఇచ్చేందుకు విమానయాన సంస్థతో ఆగ్రోస్ ఒప్పందం చేసుకుంది.

#### డ్రోన్లు ఏం చేస్తాయంటే..

ప్రధానంగా డ్రోన్లను విత్తనాలు చల్లడానికి, పురుగు మందులను స్ప్రే చేయడానికి వాడతారు. కొన్ని పంటలకు పైపైన స్ప్రే చేస్తే సరిపోతుంది. కొన్నింటికి కాండం మొదళ్లో చల్లాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో పంటలకు ఒక్కో రకంగా ఉంటుంది. ఆ మేరకు డ్రోన్లకు పరికరాలు అమర్చుతారు. అలాగే పంటకు చీడపీడలు ఏమైనా ఆశించాయో తెలుసుకునేందుకు ఫొటోలు కూడా తీస్తాయి. వాటిని వ్యవసాయాధికారికి పంపేలా ఏర్పాటు చేయనున్నారు. అలాగే కాత ఎలా ఉంది? దిగుబడి ఏ మేరకు వచ్చే అవకాశముంది. ఇలా పంటకు సంబంధించిన ప్రతీ అంశాన్ని సూక్ష్మంగా పర్యవేక్షించేలా డ్రోన్లను అందుబాటులోకి తెస్తారు. ఈ మేరకు పలు కంపెనీలతో చర్చించినట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో గ్రామాల్లో డ్రోన్లతో సాగు సులభంగా జరుగుతుందని అంటున్నారు. డ్రోన్లతో సాగు ఖర్చు తగ్గడంతోపాటు సమయం కూడా ఆదా అవుతుంది.

ఇప్పటివరకు వ్యవసాయ యాంత్రీకరణలో ట్రాక్టర్లు, స్ప్రేలు, దుక్కిదున్నే యంత్రాలు, వరి కోత మెషీన్లు తదితరాలను ఇచ్చిన వ్యవసాయశాఖ ఇప్పుడు డ్రోన్లను ఇచ్చేందుకు సన్నాహాలు ప్రారంభించింది. డ్రోన్ ద్వారా స్ప్రే చల్లడం వల్ల తక్కువ మొత్తంలో నీరు, పురుగుమందులు అవసరమవుతాయి. విత్తనాలు చల్లడంలో డ్రోన్లను వినియోగించడం వల్ల కచ్చితత్వం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే యూరియా వంటి ఎరువులను డ్రోన్ల ద్వారా చల్లితే ప్రతీ మొక్కకు చేరతాయని అంటున్నారు. అదీగాక, డ్రోన్లతో పిచికారీ వల్ల రైతులు పురుగు మందుల దుష్ప్రభావాలకు గురికాకుండా, అనారోగ్యం బారినపడకుండా ఉండొచ్చని

#### డ్రోన్ పైలట్ శిక్షణ తప్పనిసరి

ఆగ్రోస్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్కో డ్రోన్ ధర రూ. 10 లక్షల వరకు ఉంటుందని అంచనా. వాటిని ఆగ్రోస్ కేంద్రాల నిర్వాహకులకు సబ్సిడీపై ఇస్తారు. అలాగే కొంతమంది రైతులకు కలిపి గ్రూప్‌గా కూడా డ్రోన్ ఇచ్చే అవకాశముంది. ఒకవేళ రైతులు డ్రోన్లను కొనుగోలు చేయాలనుకుంటే సబ్సిడీ కూడా ఇవ్వనున్నారు. సబ్సిడీ మొత్తాన్ని త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిసింది. కాగా, డ్రోన్‌ను తీసుకోవాలంటే కనీసం పదో తరగతి పాసై ఉండాలి. అలాగే డ్రోన్ పైలట్ శిక్షణ తీసుకొని ఉండాలి. అందుకు సంబంధించిన సర్టిఫికెట్ ఉండాలి. ఏవియేషన్ సర్టిఫికెట్ కూడా ఉండాలి.

#### రైతులకు ఆదాయం పెరుగుతుంది



విజయసింహారెడ్డి, ఆగ్రోస్ చైర్మన్

ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ద్వారా డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాం. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు అద్దెకు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. డ్రోన్ల వినియోగంతో సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. పెద్దసంఖ్యలో కూలీలు చేసే పనిని ఒక డ్రోన్ కొన్ని నిమిషాల్లో చేస్తుంది. కాబట్టి సాగు ఖర్చు తగ్గి రైతులకు ఆదాయం పెరుగుతుంది.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల 'ఆసరా'పై దెబ్బ

### సీసీఎస్ నుంచి నిలిచిపోయిన వడ్డీ

- మూడు నెలలుగా అందక విశ్రాంత ఉద్యోగులు ఆగమాగం
- అధిక వడ్డీ ఆశతో రిటైర్మెంట్ బెనిఫిట్ మొత్తం సీసీఎస్‌లో డిపాజిట్
- దాని మీద వచ్చే వడ్డీపై ఆధారపడ్డ వేల మంది
- సీసీఎస్ నిధులను ఆర్టీసీ ఖాళీ చేయటంతో గందరగోళం
- సీసీఎస్‌లో 5 వేల మంది రిటైర్డ్ ఉద్యోగుల డిపాజిట్లు

హైదరాబాద్‌లోని సీతాఫల్‌మండికి చెందిన ఆయన వయసు 73 సంవత్సరాలు.. ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. రిటైర్మెంట్ బెనిఫిట్ డబ్బులను ఆర్టీసీ సహకార పరపతి సంఘం(సీసీఎస్)లో డిపాజిట్ చేయగా దానిపై నెలకు రూ.15 వేల వడ్డీ వస్తోంది. ఇప్పుడు ఆయన పూర్తిగా ఈ వడ్డీపైనే ఆధారపడి ఉన్నారు. కానీ మూడు నెలలుగా రాకపోతుండటంతో ఆయనకు దిక్కుతోచని దుస్థితి ఎదురైంది.

వరంగల్ జిల్లాకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ రిటైర్ అయి పదేళ్లయింది. తన రిటైర్మెంట్ బెనిఫిట్‌ను సీసీఎస్‌లో దాచుకోగా నెలకు రూ.9 వేల వడ్డీ వస్తోంది. చిన్నచిన్న పనులు చేసుకుంటూ తనకు వచ్చే వడ్డీ ఆసరాగా భార్యతో కలిసి బతుకీడుస్తున్నాడు. కానీ ఇప్పుడు వడ్డీ నిలిచిపోవటంతో ఆయన పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇలా వీరిద్దరిదే కాదు.. చాలామంది ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల వేదన ఇది.



**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ ఉద్యోగులు ఏర్పాటు చేసుకున్న సీసీఎస్ నిధులను ఆర్టీసీ వాడేసుకుని ఖాళీ చేయటంతో ఇప్పుడు ఆ సంస్థ విశ్రాంత ఉద్యోగులకు దిక్కు తోచని పరిస్థితి ఎదురైంది. ఉద్యోగం చేస్తున్న కాలంలో నెలవారీ వాటాగా నమోదైన మొత్తం, పదవీ విరమణ సమయంలో వచ్చిన బెనిఫిట్ మొత్తాలను చాలా మంది సీసీఎస్‌లో పొదుపు చేసుకున్నారు. బ్యాంకు కంటే మెరుగైన వడ్డీ పొందే వీలుండటమే దీనికి కారణం. ఆర్థికంగా మెరుగ్గా ఉన్న వారి సంగతి పక్కన పెడితే, పేదరికంలో మగ్గుతున్నవారు మాత్రం ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీపైనే ఆధారపడుతున్నారు. కానీ సీసీఎస్ నిధులను ఆర్టీసీ వాడేసుకుని ప్రస్తుతం రూ.932 కోట్లు బకాయిపడింది. నెలవారీగా ప్రస్తుతం సీసీఎస్ కోసం ఉద్యోగుల జీతాల నుంచి మినహాయిస్తున్న రూ.19 కోట్లను ఆర్టీసీ సీసీఎస్‌కు పూర్తిగా చెల్లించటం లేదు. గత నెల కేవలం రూ.కోటి మాత్రమే ఇచ్చింది. దీంతో డిసెంబరు నుంచి విశ్రాంత ఉద్యోగులకు చెల్లించే వడ్డీ పంపిణీ నిలిచిపోయింది. దీంతో చాలా మంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీఎస్ కార్యాలయం చుట్టూ తిరిగి ఫలితం లేక ఉసూరుమంటున్నారు.

#### రూ.కోటి కూడా కష్టమేనా..

సీసీఎస్‌లో ప్రస్తుతం ఐదున్నర వేల మంది విశ్రాంత ఉద్యోగులు డిపాజిట్లు పెట్టుకున్నారు. వారి డిపాజిట్ల మొత్తం దాదాపు రూ. 150 కోట్లు. దీనిపై ప్రతినెలా రూ.కోటి వరకు వడ్డీని చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు ఆ రూ.150 కోట్లు లేవు. నెలవారీ వడ్డీకి సరిపడా రూ.కోటి కూడా అందుబాటులో లేదు. దీంతో మూడు నెలలుగా వడ్డీ చెల్లింపు ఆపేశారు. గతంలో పది వేల మంది విశ్రాంత ఉద్యోగుల డిపాజిట్లు ఉండగా, సీసీఎస్ పరిస్థితి గందరగోళంగా మారటంతో సగం మంది డిపాజిట్లు వెనక్కు తీసుకున్నారు. తాజా గందరగోళంతో ఇప్పుడు కొత్తగా 150 మంది సభ్యత్వం రద్దుకు దరఖాస్తు చేసుకున్నారు.

#### మందులకు కూడా డబ్బుల్లేవు

"సీసీఎస్‌లో దాచుకున్న రిటైర్మెంట్ బెనిఫిట్ మొత్తం సహా ఇతర డిపాజిట్ల నుంచి నాకు నెలకు రూ.15 వేలు వస్తాయి. నాకు, హృద్రోగ బాధితురాలైన నా భార్యకు నెలకు మందులకే రూ.20 వేల ఖర్చవుతుంది. సీసీఎస్ వడ్డీ మమ్మల్ని ఆదుకుంటోంది. కానీ గత మూడు నెలలుగా వడ్డీ అందటం లేదు. ఒకప్పుడు ఆసియాలోనే గొప్ప పొదుపు సంస్థగా వెలిగిన సీసీఎస్‌కు మళ్లీ పూర్వవైభవం తెప్పించి నాలాంటి వారిని ఆదుకోవాలి."

– ప్రభాకరరావు, రిటైర్డ్ ఏడీసీ

## అక్టోబర్ 1న ఢిల్లీలో 'పెన్షన్ శంఖానాథ్' సభ

**సాక్షి, హైదరాబాద్:** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దు... జాతీయ పెన్షన్ విధానం అమలు డిమాండ్‌తో అక్టోబర్ 1న ఢిల్లీలో పెన్షన్ శంఖానాథ్ పేరిట బహిరంగ సభ నిర్వహించాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ తీర్మానించింది. ఆదివారం ఢిల్లీలోని ఎన్డీ తివారీ భవన్‌లో నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ అధ్యక్షతన జాతీయ సమావేశం జరిగింది. సమావేశానికి దేశంలోని 22 రాష్ట్రాల నుంచి ఉద్యమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రైల్వే. పోస్టల్, సీపీడబ్ల్యూడీ తదితర శాఖల కేంద్ర ఉద్యోగుల ప్రతినిధులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి సీపీఎస్ యూనియన్ నేతలు కల్వల శ్రీకాంత్, నరేశ్‌గౌడ్ హాజరయ్యారు. స్థితప్రజ్ఞ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఏప్రిల్ 16న పెన్షన్ రాజ్యాంగ మార్చ్‌ను నిర్వహించాలని, జూన్ 1 నుంచి పాత పెన్షన్ స్కీమ్ కోసం ఉద్యమ రథయాత్రను దేశమంతటా నిర్వహించాలని తీర్మానించారు. ఆగస్టు 1 నుంచి 9 వరకు పాత పెన్షన్ పునరుద్ధరణకు ఘంటి బజావో-పెన్షన్ దిలావో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అక్టోబర్ 1న ఢిల్లీ రాం లీల మైదానంలో పెన్షన్ శంఖనాధ్ భారీ బహిరంగసభ జరపాలని తీర్మానించారు.

## పిచ్చికుక్క దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు



గాయపడిన కృతిక

**కాగజ్‌నగర్ రూరల్:** పిచ్చికుక్క దాడిలో నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్ 12 గ్రామానికి చెందిన జయదేవ్ బరాగి–కృష్ణా బరాగి దంపతుల కుమార్తె కృతిక బరాగి ఆదివారం ఇంటిముందు ఆడుకుంటోంది. అదే సమయంలో అటు వచ్చిన పిచ్చికుక్క కృతికపై దాడిచేసింది. చిన్నారి అరవడంతో అప్రమత్తమైన కుటుంబీకులు వెంటనే వచ్చి కుక్కను తరిమివేశారు. చెంపపై తీవ్ర గాయంతో విలవిల్లాడిన చిన్నారి కృతికను బంధువులు చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

## మహిళలు ఏదైనా సాధించగలరు

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ



కళాకారులతో డీకే అరుణ తదితరులు

**గచ్చిబౌలి/మియాపూర్:** ఆడవారు తలచుకుంటే ఏమైనా సాధించగలరని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నేత రవికుమార్‌యాదవ్ సహకారంతో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి మోసం చేసే కేసీఆర్, కేటీఆర్ లాంటి వారిని ఆడవారు నమ్మరాదని కోరారు. ఇళ్లకు వచ్చే బీఆర్ఎస్ నేతలను దిశా చట్టం ఏమైందని, షీటీమ్స్ ఏమైపోయాయని అడగాలని మహిళలకు సూచించారు. చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, వారిని మరింత ప్రోత్సహించాలని కోరారు. బీజేపీ రాష్ట్ర నేత రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం శేరిలింగంపల్లిలో తానెప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. అంతకుముందు అతిథులు పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. అనంతరం కళాకారిణులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు గీతారెడ్డి, సైనా జైస్వాల్, డాక్టర్ ప్రజ్ఞ, శ్యామల మాధవి ప్రసంగించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు నవతారెడ్డి, పద్మ, సింధూజారెడ్డి, రేణుక, అరుణ, మహేశ్వరి, లలితారెడ్డి, లలితా, మమత, కృష్ణప్రియ, ఇందిర, వరలక్ష్మి పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతి

- హెడ్మాస్టర్ సహా మరో ఐదుగురు కూడా..



రాకేశ్ (ఫైల్)

**సాక్షి, నెట్‌వర్క్:** ఖమ్మం జిల్లా బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి మరీదు రాకేశ్(18) గుండెపోటుతో మృతి చెందాడు. అలాగే రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఓ ప్రధానోపాధ్యాయుడు సహా మరో ఐదుగురు కూడా గుండెపోటుతో మరణించారు. స్థానికులు, కుటుంబీకులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి.. బ్రాహ్మణపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు లక్ష్మయ్య, నాగలక్ష్మమ్మ దంపతుల కుమారుడైన రాకేశ్ మధిరలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. వార్షిక పరీక్షలకు సిద్ధమవుతుండగా.. రెండురోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించారు. ఈ క్రమంలో శనివారం గుండెనొప్పి వస్తోందని చెప్పడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అయితే సమయానికి డబ్బులు లేకపోవడంతో తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. కాగా శనివారం రాత్రి గుండెపోటు ఎక్కువ కావడంతో మంచంలో పడుకున్న రాకేష్ అలాగే ప్రాణాలొదిలాడు. డబ్బు లేక సకాలంలో వైద్యం చేయించలేకపోయామని, చేతికందివచ్చిన కొడుకును బతికించుకోలేక పోయామని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

**ప్రధానోపాధ్యాయుడు, అంగన్‌వాడీ ఆయా..**


నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని ఓలా ఉన్నత పాఠశాలలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న సూర్యపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంగ లాలన్న (50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సారంగపూర్ మండలం కొట్టు(బి)లోని ఇంట్లో ఉదయం గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించారు. కాగా, కామారెడ్డి జిల్లా జాన్కంపల్లి ఖుర్దు గ్రామానికి చెందిన జైతుల్ (54) అనే అంగన్‌వాడీ ఆయా ఆదివారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటుకు గురై మృతి చెందింది.

**ఇద్దరు యువకుల మృతి**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన షేక్ అహ్మద్ (36) ఆదివారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పాడు. వారు స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యుడు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అహ్మద్ ఇటీవలే దుబాయి నుంచి స్వగ్రామానికి వచ్చాడు. వేరొక ఘటనలో.. సిద్దిపేట జిల్లా కడవేర్గు గ్రామానికి చెందిన ప్లంబర్ గర్నెపల్లి పెద్ద శ్రీనివాస్ (36) ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. రోజువారీ పనుల్లో భాగంగా నగరంలో పనికి వెళ్లిన శ్రీనివాస్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి, భోజనం చేసిన తర్వాత గుండెపోటు రావడంతో మరణించాడు.

**బస్టాండ్‌లో వ్యక్తి మృతదేహం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాదరావుపేటకు చెందిన చింతకింది సంజీవ్ (40) కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్‌లో శవమై కన్పించాడు. ఇతను గుండెపోటుతో మరణించి ఉంటాడని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు.



తన భయాలను అధిగమించినవాడే
నిజమైన స్వేచ్ఛాజీవి.
– అరిస్టాటిల్



సాక్షి
సోమవారం, మార్చి, 6

# ఎవరి 'గోడ' వారిదే!

మనం శబ్దాన్ని గుర్తిస్తాం, శబ్దానికి చెవినిస్తాం, ఫెళఫెళార్భాటంగా సాగే శబ్దవిప్లవాలకు స్పందిస్తాం. నీటిని గుర్తిస్తాం కానీ చాపకింద నీటిని చటుక్కున గుర్తించలేకపోతాం. వాస్తవం ఏమిటంటే, మనం వెంటనే పోల్చుకోలేని నిశ్శబ్దాలూ, నిశ్శబ్ద విప్లవాలూ; చాప కింద నీరు లాంటి నిరంతర పరిణామాలూ కూడా ఉంటాయి. సాధారణంగా అవే మనిషి జీవితాన్ని, అతని నమ్మకాల్ని తలకిందులు చేస్తాయి. అతనికి తెలియకుండానే అతని కరచరణాలను కట్టడి చేసి శాసిస్తాయి.

సాంకేతికత అలాంటి ఒక నిశ్శబ్ద విప్లవం. ఎప్పుడో చరిత్రపూర్వయుగంలో మనిషి కనిపెట్టిన చక్రం, ఆ తర్వాత కొన్ని వేల సంవత్సరాలపాటు అతని భవిష్యత్తును నిర్దేశించింది; అతని జీవనాన్ని, అతను కూడా ఊహించలేనన్ని కొత్త కొత్త మలుపులు తిప్పింది. చక్రం తిప్పనిదేముంది?

ఉన్న సాంకేతికత పోయి కొత్త సాంకేతికత రావడానికీ, అది కొత్త కొత్త మార్పులు కొనితేవడానికీ నిన్నమొన్నటివరకూ ఎక్కువ సమయం పట్టేది. ఆ లోపల 'పాత' అనేది సంప్రదాయంగా ఘనీభవించిపోయి కొత్తను అడ్డుకునేది; కాలగమనాన్ని తన అరచేతులతో ఆపడానికి ప్రయత్నించేది. అలాంటి సంప్రదాయ శాసనం నుంచి బయటపడి తన ఉనికిని స్థాపించుకోవడానికి 'కొత్త' ఎంతో పెనుగులాడేది, ఆ ఘర్షణలో సంప్రదాయానిదే పై చేయి అయేది. కానీ ఆధునికకాలం దగ్గరికి వచ్చేసరికి సాంకేతికత ఒక మహావిజృంభణగా మారిపోయింది. ఒక మహావిప్లవరూపం ధరించింది. అప్పటికి కొత్త అనుకున్న సాంకేతికతకు అలవాటు పడే లోపలే దానిని పాతగా మార్చివేస్తూ అంతకన్నా కొత్తదైన సాంకేతికత అడుగుపెట్టడం ప్రారంభించింది. అందువల్ల పాతకు సంప్రదాయంగా ఘనీభవించే వ్యవధి బాగా తగ్గిపోయి, కొత్త సాంకేతికత ముందు అది కూడా తలవంచి దారినివ్వడం అనివార్యమైంది.

ఆ విధంగా సంప్రదాయ, సాంకేతికతల బలాబలాలు తారుమారైపోయాయి. కొత్త సాంకేతికత రెండు మూడు తరాల కాలవ్యవధిలో అడుగుపెట్టడం కూడా పోయి ఒకే తరంలో, కళ్ళు మూసి తెరచే లోగానే ప్రత్యక్షం కావడం ఇప్పుడు సర్వసాధారణమైంది. ఏదైనా సమాచారాన్ని 'రియల్ టైమ్'లో ప్రపంచవ్యాప్తం చేయడమూ; పుటలకు పుటలు మనం రాసినదానిని మనం కోరుకున్న భాషలోకి తక్షణం తర్జుమా చేసి ఇవ్వడమే కాదు; కీబోర్డుమీద చిటికెనవేలితో నొక్కితే చాలు, మన గురించిన మొత్తం సమాచారాన్ని మన కళ్ళముందు నిలిపే స్థాయికి సాంకేతికత చేరుకుంది. రోబోను సృష్టించిన మనిషి, సాంకేతికత చేతిలో తనే రోబోగా మారాడు.


సమాచారమాధ్యమాల రంగానికే వస్తే ఈ సాంకేతిక మహావిప్లవం తెచ్చిన మార్పు ఎన్నో ఆసక్తికరమైన పరిస్థితులను సృష్టించింది. సామాజిక మాధ్యమాల పేరిట ఫేస్‌బుక్, వాట్సప్, బ్లాగ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వగైరాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావడంతో అంతవరకూ ఆధిపత్యం చలాయించిన ప్రింటు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలు సాంప్రదాయిక మాధ్యమాలుగా మారాయి. సామాజిక, సాంప్రదాయిక మాధ్యమాల సహజీవనం వినూత్న పరిణామాలకు దారి తీసింది. అంతవరకు స్థలకాలాల నిర్ణయాధికారం సాంప్రదాయిక మాధ్యమాల నిర్వాహకుల చేతుల్లో ఉండేది. ఇప్పుడా అధికారం స్మార్ట్ ఫోన్, లేదా ల్యాప్ టాప్ దగ్గరున్న ప్రతి వ్యక్తికీ బదిలీ అయింది. అతను తాను కోరుకున్నంత స్థలంలో, తను ఎప్పుడనుకుంటే అప్పుడు తన అభిప్రాయాన్ని ప్రచురించుకునే వెసులుబాటు వచ్చింది. ఫేస్‌బుక్ పరిభాషలో చెప్పాలంటే 'గోడ' రూపంలో తను సృష్టించుకున్న తన పత్రికకు, తన ఛానెల్‌కు తనే సంపాదకుడు. తన వాల్ మీద ఏది పోస్టు చేయాలో నిర్ణయించుకునే అధికారం తనదే. 'వెనకటి మహాభారతం పద్దెనిమిది పర్వాలు కావచ్చు, ఆధునిక మహాకావ్యం పద్దెనిమిది పేజీలే' అనే అర్థంలో మహాకవి శ్రీశ్రీ చేసిన వ్యాఖ్య ఒకటి ప్రసిద్ధమే. ఇప్పుడు మన ఫేస్‌బుక్ వాల్ మీద, లేదా మన బ్లాగులో ఏకకాలంలో పద్దెనిమిది పంక్తుల్లో ఒక మినీ వ్యాసాన్ని, పద్దెనిమిది పుటల్లో ఒక కావ్యాన్నే కాదు, పద్దెనిమిది పర్వాల మహేతిహాసాన్ని కూడా రాయగలిగినంత జాగా అందుబాటులోకి వచ్చింది.

సాంకేతికవిప్లవం ఆవిష్కరించే వింతలకు అంతే ఉండదు. కొత్త సాంకేతికత ఒక్కొక్కసారి సుదూరగతానికి చెందిన పాతపద్ధతులను కూడా కొత్త మెరుపుతో ముందుకు తేగలదు. పూర్వం, అచ్చుయంత్రం కాదు సరికదా, లిఖితసంప్రదాయం కూడా వేళ్లూనుకొనని రోజుల్లో పురాణశ్రవణం ఉండేది. పౌరాణికుడు, శ్రోతలు ఎదురెదురుగా ఉండేవారు. శ్రోతల అభిరుచులు, అభిప్రాయాలూ, అనుకూల, వ్యతిరేకస్పందనలు తక్షణమే పౌరాణికుని దృష్టికి వచ్చేవి. అవి కూడా పురాణ శ్రవణాన్ని, కథానిర్మాణాన్ని ప్రభావితం చేసేవి. ఆ విధంగా పురాణకథనం ద్వికర్తృకంగా, లేదా జంట నిర్మాణంగా రూపుదాల్చేది. ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో మళ్ళీ అదే పద్ధతి పునరావృతమైంది. తను చదివిన, లేదా విన్న వాటిపై పాఠకుడు, శ్రోత అప్పటికప్పుడు స్పందించగలుగుతున్నాడు. ఆ విధంగా అది ఒక రచనను 'రియల్ టైమ్'లో ప్రభావితం చేసి అవసరమైతే మార్చుకునే అవకాశాన్నిస్తున్నది. ప్రజాస్వామికమైన చర్చను కొత్త పుంతలు తొక్కిస్తున్నది.

సంపాదకుడనే అంకుశం లోపించినప్పుడు సామాజిక మాధ్యమాలు మదపుటేనుగుల స్వైర విహారానికి ఆటపట్టులవుతాయి. ఉచితానుచితాలు, సభ్యతా సంస్కారాల హద్దులు చెరిగిపోవడమూ సంభవిస్తుంది. అయితే స్థలకాలాలు, శాస్త్రసాంకేతిక నూతనావిష్కారాలకు అతీతంగా ఎల్ల కాలాలకూ, ఎల్ల ప్రాంతాలకూ వర్తించే మన్నికైన మానవ విలువలు; విజ్ఞతావివేకాల కొలమానాలు ఎప్పుడూ సజీవంగా ఉంటూనే ఉంటాయి. సాంప్రదాయిక, సామాజిక మాధ్యమాల తేడా లేకుండా సంపాదక స్థానంలో ఉన్న ప్రతి ఒకరిపై జనాభిప్రాయమనే పెద్ద అంకుశం అజ్ఞాతంగా ఉండి నియంత్రిస్తూనే ఉంటుంది. ఆ జనాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించే పాఠకుడు అతిని ఒక కంట కనిపెట్టి చూస్తూ అవసరమనిపించిన సమయంలో కత్తెర ప్రయోగిస్తూనే ఉంటాడు. నిత్యజాగృతుడైన పాఠకుడు, లేదా శ్రోత, లేదా ప్రేక్షకుడే అంతిమంగా ఏ మాధ్యమానికైనా ఎడిటర్- ఇన్- చీఫ్!

# కుదిరి చెదిరిన ఒప్పందం

కామెంట్



కరణ్ థాపర్

**దీర్ఘకాల సరిహద్దు ఘర్షణలను పరిష్కరించే ఒక ఒప్పందం భారత్, పాకిస్తాన్ మధ్య దాదాపుగా కుదిరినట్లు కనిపించిందని సతీందర్ లాంబా పుస్తకం 'ఇన్ పర్స్యూట్ ఆఫ్ పీస్' వెల్లడిస్తోంది. ఈ ఒప్పందం కోసం ఇరుదేశాలు తెరవెనుక చర్చలను విస్తారంగా కొనసాగించాయనీ, దాదాపు సంతకాల దాకా వచ్చాయనీ ఈ పుస్తకం చెబుతోంది. 2014 సార్వత్రిక ఎన్నికలపై భారత్ దృష్టి పెట్టిన తర్వాత ఈ ప్రక్రియ నత్తనడక నడిచి ఆగిపోయింది. ఈ ఒప్పందం కుదిరివుంటే, చరిత్రే మారిపోయేది. ఈ ఒప్పంద ప్రక్రియను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఇరుపక్షాలూ భావిస్తే దానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలు సిద్ధంగా ఉన్నాయని ఈ పుస్తకం గట్టిగా చెబుతోంది.**

మాజీ రాయబారి సతీందర్ లాంబా రచించిన పుస్తకం 'ఇన్ పర్స్యూట్ ఆఫ్ పీస్' విషాదకరంగా ఆయన మరణానంతరం ప్రచురితమైంది. అయితే భారత్, పాకిస్తాన్ బ్యాక్ చానెల్‌కు (గుప్త లేదా ద్వితీయ శ్రేణి సమాచార బదిలీ మార్గం) సంబంధించిన అద్భుతమైన వివరాలను ఈ పుస్తకం వెల్లడించింది. అలాగే రెండు దేశాలు ఒప్పందానికి ఎంత సమీపానికి వచ్చాయో కూడా ఇది చక్కగా వివరించింది. యూపీఏ ప్రభుత్వ రెండో పాలనా కాలంలో, ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ పదేళ్ల పాలన చివరలో ఈ ముసాయిదా ఒప్పందంపై సంతకాలు చేయడానికి కూడా అంగీ కారం కుదిరిందని ఈ పుస్తకం నిర్ధారిస్తోంది.

'2003 మే నుంచి 2014 మార్చి వరకు బ్యాక్ చానెల్ సమావేశాలు 36 జరిగాయి' అని నాకు తెలిసిన సతీ (సతీందర్) రాశారు. ఈ ఒప్పందంలో చాలావరకు జనరల్ ముషారఫ్ హయాంలో ముగింపునకు వచ్చింది. ఆయన అధికారం కోల్పోయిన తర్వాత ఏమీ జరగలేదు. కానీ నవాజ్ షరీఫ్ 'ఈ ప్రక్రియకు కొత్త ఊపును, వేగాన్ని తీసుకొచ్చారు'. దురదృష్టవశాత్తూ, ఆ తర్వాత 'భారత్ దృష్టి 2014 సార్వత్రిక ఎన్నికల వైపు మళ్లింది.'

నేను అనుకునేది సరైనదే అయితే, రెండు సందర్భాల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరే పరిస్థితులు ఏర్పడ్డాయి. మొదట 2007లో అది సాధ్యపడేట్టు కనిపించింది కానీ ముషారఫ్‌కు ఉన్న 'అంతర్గత సమస్యల' వల్ల వీగిపోయింది. ఇక రెండోది– ఇది నా వ్యాఖ్యానం – ఎన్నికల వైపు దృష్టిని భారత్ మరల్చడానికి ముందుగా నవాజ్ షరీఫ్ కాలంలో!


**అనూహ్య ఘటన**

అయితే, మోదీ గెలుపుతో ఆశలేమీ పోలేదు. 'బ్యాక్ చానెల్ ప్రక్రియను కొనసాగించాలనే ఉద్దేశం ఉన్నట్లు కనిపించింది' అని సతీ పేర్కొన్నారు. 'ఈ అంశంపై ఫైల్‌ని సమీక్షించారు. ఈ ఒప్పందంలో ఎలాంటి ముఖ్యమైన మార్పూ ఉండబోదని కూడా నాకోసారి చెప్పారు. ప్రత్యేక దూతగా ఒక విశిష్ట రాయబారిని నియమించాలని కూడా ప్రధానమంత్రి మోదీ భావించారు. నన్ను ఆయన్ని కలవాలని కోరారు.' కానీ ఆ రాయబారిని నియమించనేలేదు.

మోదీ ప్రభుత్వం 2017 ఏప్రిల్‌లో మరోసారి ఆ ఒప్పందం కోసం ప్రయత్నించింది. 'ప్రధాని కార్యాలయంలోని సీనియర్ అధికారి ఒకరు నన్ను కలవడానికి మా ఇంటికొచ్చారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్‌తో భేటీ కావడానికి మీరు పాకిస్తాన్ వెళ్లాలని ప్రధాని కోరుకుంటున్నారని ఆయన నాతో చెప్పారు'. అయ్యో! అయితే, భారత్ తరఫు ఒక పరిణామం దీన్ని మొగ్గలోనే తుంచేసింది. షరీఫ్‌తో చర్చించాల్సిన అంశాల వివరాలతో పాటు పాకిస్తాన్‌కు ప్రయాణించడానికి అవసరమైన ట్రావెల్ డాక్యుమెంట్లను ఇవ్వాలని సతీందర్ కోరి, వాటికోసం వేచి ఉన్నారు. కానీ ఆ తరుణంలోనే విచిత్రమైన ఘటన జరిగింది. 'దూతగా వ్యవహరిస్తున్న ఒక ప్రముఖ భారతీయ వ్యాపారవేత్త తన వ్యక్తిగత విమానంలో పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో భేటీ కావడానికి పాకిస్తాన్ వెళ్లారనే వార్తను నేను చూశాను. అలాంటి పరిస్థితుల్లో ఒకే ఉద్దేశం కోసం పాక్ ప్రధాని వద్దకు వెళ్లడానికి ఇద్దరు వ్యక్తులు ప్రాతినిధ్యం వహించడం సరైంది కాదు.' ఆ వ్యాపారవేత్త పేరు సతీందర్ బయటపెట్టలేదు. అయితే ఆయన సజ్జన్ జిందాల్ కావచ్చునని పాకిస్తాన్ హైకమిషనర్‌గా పనిచేసిన అబ్దుల్ బాసిత్ అన్నారు. 'ఈ అంశం మీద నేను జరిపిన చివరి సంభాషణ ఇదే' అని సతీందర్ రాశారు.



పర్వేజ్ ముషారఫ్, మన్మోహన్ సింగ్







సతీందర్ లాంబా

మన్మోహన్ సింగ్ పాలనలో ఇరుదేశాల మధ్య ఒప్పందం దాదాపుగా ఫలవంతమయ్యేటట్టు కనిపించిందని సతీందర్ చెప్పిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. 'ప్రధాని మన్మోహన్‌తో నేను 68 సార్లు కలిసినట్లు నా డైరీ గుర్తుచేసింది'. పైగా 'ఈ పరిణామాల గురించిన మొత్తం సమాచారం ప్రణబ్ ముఖర్జీకి తెలియజేయడమైంది'. 2006 నవంబర్‌లో సోనియాగాంధీకి ఈ ఒప్పంద వివరాలు తెలపడం జరిగింది. అంతకుముందు 2005లో ఆర్మీ చీఫ్ ఈ విషయంలో పాలు పంచుకున్నారు. పైగా అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్కే అద్వాణీ, బ్రజేశ్ మిశ్రా, ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, ముఫ్తీ మహమ్మద్ సయీద్, కరణ్ సింగ్, గులామ్ నబీ ఆజాద్‌లకు కూడా ఈ సమాచారం అందించడం జరిగింది. ఈ ఒప్పందం ఫలితం భారత రాజ్యాంగానికీ, జమ్ము–కశ్మీర్ రాజ్యాంగానికీ, పార్లమెంటరీ తీర్మానాలకూ అనుగుణంగా ఉండేలా ప్రయత్నాలు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి ఆనంద్‌తో 2006 మార్చి నుంచి 2007 మార్చి మధ్యలో సతీందర్ ఆరుసార్లు సమావేశమయ్యారు. ప్రఖ్యాత న్యాయవాది ఫాలీ నారిమన్‌ను కూడా కలిశారు.

**సరిహద్దులు మారవు**

ముషారఫ్ నాలుగు సూత్రాల(ఫోర్–పాయింట్ ఫార్ములా)పై, మన్మోహన్ సింగ్ అమృత్‌సర్‌లో చేసిన ప్రసంగంలోని మూడు ఆలోచనలపై ఈ ఒప్పందం ఆధారపడింది. ఈ చర్చలకు పెట్టుకున్న 14 మార్గదర్శక సూత్రాలను సతీందర్ పేర్కొన్నారు. వాటిల్లో కొన్ని: 'సరిహద్దులను తిరగరాసే ప్రసక్తి లేదు.' 'ఎల్‌ఓసీ(నియంత్రణ రేఖ)కి ఇరువైపులా, ముఖ్యంగా జనం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సైనిక కదలికలను కనిష్ఠ స్థాయిలో ఉంచాలి.' 'నియంత్రణ రేఖకు ఇరువైపులా అంతర్గత నిర్వహణ కోసం స్వయంపాలనను ఏర్పర్చాలి.' 'నియంత్రణ రేఖకు ఇరువైపులా ఉన్న ప్రజలు ఒక వైపు నుంచి మరొక వైపునకు వెళ్లడానికి స్వేచ్ఛ ఉండాలి.' అలాగే, 'ప్రభుత్వ విధానంగా ఉగ్రవాదాన్ని ఉపయోగించకుండా, తన భూభాగాన్ని రాజ్యేతర శక్తులకు అనుమతించకుండా పాక్ కట్టడి చేయాలి'.

ఈ ఒప్పందం జరిగివుంటే, 'చరిత్ర క్రమాన్ని మార్చివేయడం సాధ్యపడేది'. అయితే ఇప్పటికి కూడా ఇది ముగిసిపోలేదని సతీందర్ సూచిస్తున్నారు. 'ఈ ఒప్పంద సంభావ్యత ఇప్పటికీ ఉనికిలో ఉంది. ముసాయిదా ఒప్పంద సూత్రాలు కానీ, దాని పాఠం కానీ ఇప్పటికీ ఉన్నాయి. ఒప్పంద ప్రక్రియను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందని ఇరుపక్షాలూ భావించినప్పుడు ఎప్పుడైనా దాన్ని మొదలు పెట్టవచ్చు'. నేననుకోవడం ఆశ అనేది నిత్యవసంతం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### జీవితమా, థాంక్యూ!



ఒక్క పరుగు మన రోజును మార్చేస్తుంది. చాలా పరుగులు మన జీవితాన్ని మార్చేస్తాయి. కొండల మీది గాలి, ఎండ పొడ, మంచి పరుగు... నా శరీరంలోని ప్రతి కణంలోనూ జీవితం పట్ల కృతజ్ఞతను అనుభూతిస్తున్నాను. – సెలీనా జైట్లీ, నటి

### మర్యాదలో టాప్



నా చిన్నప్పుడు ఒక లక్నో పిల్లాడు మా బాంబే స్కూల్లో చేరాడు. అందరినీ 'ఆప్' (మీరు), తనను తాను 'హమ్' (మేము) అనేవాడు. ఇతర పిల్లలు అనడం గుర్తుంది: 'ఎంత టాప్ హిందీ మాట్లాడుతాడో!' – జోయ్‌దీప్ పాల్, వ్యాఖ్యాత

### బలమైన అమెరికా కోసం...



సామ్యవాదం వైపు అమెరికా జారడాన్ని ఆపడానికీ, మన దేశాన్ని దెబ్బకొడుతున్న స్వీయనిందను అంతం చేయడానికీ నేను అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను. బలహీనం కాని, మేల్కొలుపువాదం(వోక్) లేని బలమైన, గర్వపడే అమెరికాను పునరుద్ధరించడానికి నేను అధ్యక్ష స్థానం కోసం పోటీచేస్తాను. – నిక్కీ హేలీ, అమెరికా అధ్యక్ష అభ్యర్థి

### మురికి దేశం



అఫ్గానిస్తాన్ వాళ్లం ఎప్పుడూ పాకిస్తాన్‌ను ఒక ముస్లిం దేశంగా పరిగణించలేదు. ఇస్లాం మీద, అందరు ముస్లింల మీద పాకిస్తాన్ ఒక మురికి మరక. పాకిస్తాన్ ఎప్పుడూ ఇస్లాంను తీవ్రవాద వ్యాప్తికీ, అఫ్గాన్లు, బలోచులు, కశ్మీరీల్లాంటి అమాయకులను చంపడానికీ వాడుకుంది. తీవ్రవాదానికి తల్లివేరు పాకిస్తాన్. దానిమీద ఆంక్షలు విధించాలి. – బాసిత్ షా, మాజీ జర్నలిస్ట్

### అందరం ఒక్కటే!



తమిళనాడులో వలస కూలీల మీద దాడులు జరుగుతున్నాయన్న తప్పుడు వార్తలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపించడం బాధాకరం. మేము, తమిళ ప్రజలం 'వసుధైవ కుటుంబం' భావనను నమ్ముతాం. వేర్పాటువాదాన్నీ, ఉత్తర భారత మిత్రుల పట్ల ద్వేషాన్నీ సమ్మతించం. – కె. అన్నామలై, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు

### మళ్లీ అదే తప్పు



ఈ సంవత్సరం బడ్జెట్‌లో కొన్ని మంచి విధానాలున్నాయి. కానీ భారత్ వెలుపలికి పోయే చెల్లింపుల (రెమిటెన్స్) మీద 20 శాతం పన్ను (సోర్సు దగ్గర) విధించడం అనేది తప్పు. ఇది ప్రారంభంలో రూపాయిని బలపరుస్తుంది. కానీ క్రమంగా ఈ పన్ను దేశంలోకి వచ్చే చెల్లింపులను నిరుత్సాహపరుస్తుంది. ఈ రకమైన తప్పులే 1980ల్లో కూడా జరిగాయి. – కౌశిక్ బసు, ఆర్థికవేత్త

### కేసు వేయాలనుంది...



ఆరోగ్యకరమైన శరీర భాగాలను చెడ్డ లోహంతో మార్చిడి చేసి నా జీవితాన్ని నాశనం చేసిన డాక్టర్ మీద కేసు వేయమని కొంతమంది సలహా ఇచ్చారు. నేను ప్రయత్నించాను. కానీ లాయర్లు చాలా ఖరీదుగా ఉన్నారు. ఆ డాక్టర్ లైసెన్సు పోతే అతడి దుర్మార్గాల నుంచి కొంతమంది జీవితాలు అయినా కాపాడినట్టు అవుతుంది కదా అనుకున్నాను. – తస్లీమా నస్రీన్, రచయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

# తొలి ఆదివాసీ ఉపాధ్యాయుడు

అటవీ ప్రాంతాల్లో అమాయకపు చీకట్లను తరిమివేయాలని ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించిన గొప్ప వ్యక్తి మారూ మాస్టారు. స్వాతంత్ర్యానంతరం 1962లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన తొలి ఆదివాసీగా చెబుతారు. రాజ్ గోండ్ తెగకు చెందిన సిడాం మారూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని గడల్‌పల్లి ఏజెన్సీ గూడేనికి చెందిన సిడాం చైతూ, కాసుబాయి దంపతులకు 1925లో జన్మించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తమ జాతిలో వెనుకబాటుతనాన్ని పోగొట్టాలంటే కనీసం అక్షర జ్ఞానం నింపాలని భావించారు. గిరిజన జాతులపై పరిశోధన చేస్తున్న ఆంత్రాపాలజిస్టు ప్రొఫెసర్ హైమండార్ఫ్ అంటే మారూ మాస్టారుకు అమితమైన భక్తిభావం. ఆయనతో ఉన్న సాన్నిహిత్యంతో ఆయన సలహా మేరకే మారూ ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. అభివృద్ధి మాట అటుంచితే, బాహ్య ప్రపంచమే తెలియని ఆదిమ తెగలైన రాజ్ గోండ్, కోలాం, పర్ధాన్, నాయకపోడు, తోటి కోయ గిరిజనులను చేరదీసి వారి మాతృ భాషలోనే విద్యాబోధన చేసేవారు. ఆయనకు పది హేనేళ్ల వయసు ఉన్నప్పుడు 1940లో జరిగిన జోడే ఘాట్ పోరాటంలో క్షతగాత్రులైన తమ వారిని దాచిపెట్టి, అవసరమైన సపర్యలు చేసిన మానవీయుడు, దయా మయుడు మారూ.



సిడాం మారూ

1983 ఫిబ్రవరి 28న ఉపాధ్యాయ వృత్తి నుండి పదవీ విరమణ పొందిన మారూ మాస్టారు వెనువెంటనే ఉట్నూరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) తరఫున నెలకు రూ. 400 కనీస వేతనంపై ఆదివాసీ అభివృద్ధి నిర్వాహకుడిగా నియమితులయ్యారు. ఐటీడీఏ ప్రవేశపెట్టిన పథకాలను, ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని గిరిజను లందరూ అభివృద్ధి చెందేలా చైతన్యం కలిగించిన ఘనత ఆయనకే దక్కుతుంది. గిరిజనులకు అండగా నిలబడి, గిరిజనాభివృద్ధిలో ఆదివాసులను భాగస్వాములుగా చేస్తున్న హైమండార్ఫ్ స్థాపించిన 'రాయ్ సెంటర్ల'ను పునః ప్రారంభించడానికి తగు కృషి చేశారు. తన జీవితాంతం గిరిజనాభి వృద్ధికి పాటుపడిన మారూ మాస్టారు 2000వ సంవత్సరం మార్చి 6న ప్రకృతి ఒడిలోకి చేరిపోయారు. అయినా ఆదివాసీల మదిలో చిరస్థాయిగా నిలిచే ఉంటారు.

– గుమ్మడి లక్ష్మీనారాయణ,
ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి । 94913 18409
(నేడు సిడాం మారూ వర్ధంతి)

# ఛాట్‌జీపీటీని ఎంత నమ్మాలి?

విశ్లేషణ



శ్రీధర్. జె

**ఛాట్‌జీపీటీ అంటే ఏమిటి?**

ఛాట్‌జీపీటీ అనేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ద్వారా నడిచే సహజ భాషా ప్రాసెసింగ్ సాధనం. ఇది 'ఛాట్‌బాట్'తో మానవుల్లాగా సంభాషించడానికీ, ఇటువంటి మరిన్ని ప్రయోజనాలు పొందడానికీ అవకాశం కలిపిస్తుంది. భాషా నమూనా ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలదు.

అలాగే ఈమెయిళ్లు, వ్యాసాలు, కోడ్‌ను కంపోజ్ చేయడం వంటి పనులలో సహాయం చేస్తుంది. ఛాట్ జీపీటీ... ప్రస్తుతం పరిశోధన, అభిప్రాయ సేకరణ దశలో ఉన్నందున దాని వినియోగం ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంది. ఛాట్‌జీపీటీ ప్లస్ అనే చెల్లింపు సబ్‌స్క్రిప్షన్ వెర్షన్ కూడా ఉంది.

**దీన్ని ఎవరు రూపొందించారు?**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–రీసెర్చ్ సంస్థ అయిన ఓపెన్‌ఏఐ అనే సంస్థ ఛాట్‌జీపీటీని సృష్టించింది. కంపెనీ 2022 నవంబర్ 30న దీనిని ప్రారంభించింది.

**ఎలా యాక్సెస్ అవ్వొచ్చు?**

మీరు chat.openai.com సందర్శించి, ఓపెన్‌ఏఐ ఖాతాను సృష్టించడం ద్వారా ఛాట్ జీపీటీని యాక్సెస్ చేయవచ్చు. సైన్ ఇన్ చేసిన తర్వాత, ఛాట్‌జీపీటీతో ఒక ప్రశ్న అడగడం ద్వారా మీ సంభాషణను ప్రారంభించవచ్చు.

**ఎలా పనిచేస్తుంది?**

ఓపెన్‌ఏఐ ప్రకారం, ఓపెన్‌ఏఐ రీఇన్‌ఫోర్స్‌మెంట్ లెర్నింగ్ ఫ్రమ్ హ్యూమన్ ఫీడ్‌బ్యాక్ (ఆర్‌ఎల్‌హెచ్‌ఎఫ్) ద్వారా భాషా నమూనాకు శిక్షణ ఇచ్చింది. మానవ ఏఐ శిక్షకులు సంభాషణలతో మోడల్ అందించారు, దీనిలో వారు వినియోగదారు, ఏఐ సహాయకులు అనే రెండు భాగాలను ప్లే చేశారు.

**ఛాట్‌జీపీటీ, సెర్చ్ ఇంజిన్‌ల మధ్య తేడా ఏమిటి?**

ఛాట్‌జీపీటీ అనేది తుది వినియోగదారుతో సంభాషణను నిర్వహించే ఉద్దేశ్యంతో సృష్టించిన భాషా నమూనా. వినియోగదారు అడిగిన సమాచారాన్ని కనుగొనడంలో సహాయపడటానికి సెర్చ్ ఇంజిన్ ఇంటర్నెట్‌లోని వెబ్ పేజీలను సూచిస్తుంది. సమాచారం కోసం ఇంటర్నెట్‌లో శోధించే సామర్థ్యం ఛాట్ జీపీటీకి లేదు.

**పరిమితులు ఏమిటి?**

చాలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నప్పటికీ, ఛాట్ జీపీటీకి ఇప్పటికీ పరిమితులు ఉన్నాయి. ఇన్‌పుట్ ప్రశ్నను అర్థం చేసుకోవడానికి రీవర్డ్ చేయడం అవసరం కాబట్టి, నిర్దిష్ట మార్గంలో ఉన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోవడం వంటి పరిమితులు ఉంటాయి. ఒక పెద్ద పరిమితి ఏమిటంటే అది అందించే ప్రతిస్పందనలలో నాణ్యత లేకపోవడం. అస్పష్టమైన ప్రశ్నలపై వివరణ కోసం అడగడానికి బదులుగా, మోడల్ ప్రశ్నకు అర్థం ఏమిటో అంచనా వేస్తుంది. ఇది ప్రశ్నలకు అనాలోచిత ప్రతిస్పందనలకు దారి తీస్తుంది. 'ప్రాథమిక సమస్య ఏమిటంటే, ఇవి ఉత్పత్తి చేసే సమాధానాలు చాలా తప్పుగా ఉన్నప్పటికీ, అవి సాధారణంగా మంచివి గానే కనిపిస్తాయి. సమాధానాలు రూపొందించటం చాలా సులభం.



మరో ప్రధాన పరిమితి ఏమిటంటే, ఛాట్‌జీపీటీ డేటా 2021కి పరిమితం చేయబడింది. అప్పటి నుండి జరిగిన సంఘటనలు లేదా వార్తల గురించి ఛాట్‌బాట్‌కు అవగాహన లేదు. అందువల్ల 2022లో ప్రపంచ కప్‌ను ఎవరు గెలుచుకున్నారు వంటి ప్రశ్నలకు అది సరైన సమాధానం చెప్పలేదు.

**ఛాట్‌జీపీటీ గురించి ఆందోళన ఎందుకు?**

ఏఐ ఛాట్‌బాట్‌లు మానవ మేధను భర్తీ చేయడం లేదా క్షీణింపచేయడం గురించి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు, ఛాట్‌బాట్ ఏదైనా అంశంపై ఒక కథనాన్ని క్షణాల్లో సమర్థంగా (అవసరం కానప్పటికీ) రాయగలదు. ఇది మానవ రచయిత అవసరాన్ని గణనీయంగా తొలగిస్తుంది. విద్యార్థులు తాము నేర్చుకోవలసింది నేర్చుకోకుండానే దీని సహాయంతో ఏదైనా క్షణాల్లో రాసే అవకాశం ఉంది. అందువల్ల కొన్ని పాఠశాలలు దీనిని వ్యతి రేకిస్తున్నాయి.

ఏఐ ఛాట్‌బాట్‌కు సంబంధించి మరొక ఆందోళనకరమైన విషయం ఏమిటంటే... తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం! బాట్ ఇంటర్నెట్‌కు కనెక్ట్ కానందున అది సమాచారాన్ని షేర్ చేయడంలో తప్పులు చేయవచ్చు అనేది మరో ఆందోళనకరమైన సంగతి.

బాట్ స్వయంగా ఇలా చెప్పింది, 'నా ప్రతిస్పందనలు వాస్తవం అని అనుకోవాలని నేను అనడంలేదు. నా నుండి లేదా ఏదైనా ఇతర మూలం నుండి స్వీకరించే ఏ సమాచారాన్నయినా ధ్రువీకరించుకోమని నేను ఎల్లప్పుడూ ప్రజలను ప్రోత్సహిస్తాను.' ఓపెన్‌ఏఐ కూడా ఛాట్‌జీపీటీ కొన్నిసార్లు 'అనుకూలంగా ధ్వనిస్తుంది కాని తప్పు లేదా అర్థంలేని సమాధానాలు' రాస్తుందని పేర్కొంది.

**ఇంతకూ ఇది మంచిదా, చెడ్డదా?**

ఛాట్‌జీపీటీ అనేది ఒక అధునాతన ఛాట్‌బాట్. ఇది ప్రజల జీవితాలను సులభతరం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈమెయిల్‌ను రాయడం లేదా సమాధానాల కోసం వెబ్‌ను నావిగేట్ చేయడం వంటి రోజువారీ దుర్భరమైన పనులలో సహాయం చేస్తుంది. ఏది ఏమైనప్పటికీ, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం వంటి ప్రతికూల ఫలితాలను నివారించడానికి, విస్తృతంగా ఉపయోగించే ముందు కొన్ని సాంకేతిక వివరాలు గమనించాలి. సాధారణంగా, ఏఐ, ఎమ్‌ఎల్ మోడళ్లు ఆదర్శవంతమైన పనితీరు స్థాయిని చేరుకోవడానికి చాలా శిక్షణ, ఫైన్–ట్యూనింగ్‌పై ఆధారపడతాయి అనేది గమనార్హం.

వ్యాసకర్త ఎంబీఏ విద్యార్థి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ । 96426 32683

**గ్రహం అనుగ్రహం**

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.చతుర్దశి సా.4.06 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: మఖ రా.12.02 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.10.48 నుండి 12.34 వరకు, దుర్ముహూర్తం: ప.12.33 నుండి 1.20 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.41 వరకు, అమృతఘడియలు: రా.9.23 నుండి 11.10 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.20, సూర్యాస్తమయం: 6.03.

## క్లుప్తంగా...

### కొమురెల్లి మల్లన్న స్వరూపమే కేసీఆర్: తలసాని



గజ్వేల్: యాదవుల ఆరాధ్య దైవం కొమురెల్లి మల్లన్న స్వరూపమే కేసీఆర్ అని.. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశంసించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని ఎస్‌ఫోర్ బ్లాంకెట్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా యాదవుల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. యాదవుల వృత్తిని ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ రూ.11వేల కోట్లతో 75 శాతం రాయితీపై గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారని ప్రశంసించారు. కరీంనగర్ ఎంపీ ఎన్నికల్లో గతంలో పొరపాటు జరిగిందని, భవిష్యత్‌లో అలాంటివి జరగకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఫిష్ ఫెడరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

### గుడాటిపల్లిలో సర్పంచ్ దీక్ష భగ్నం



గుడాటిపల్లి గ్రామ సర్పంచ్ రాజిరెడ్డి ఆమరణ నిరాహార దీక్షను భగ్నం చేసి ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అక్కన్నపేట (హుస్నాబాద్): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను ఆదివారం సాయంత్రం పోలీసులు భగ్నం చేశారు. బలవంతంగా ఆయన్ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న వారిందరికీ 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, వివాహితలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలంటూ శనివారం రాత్రి నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగిన విషయం తెలిసిందే. కాగా, దీక్ష ఆదివారం రెండోరోజు కూడా కొనసాగింది. దీక్ష చేస్తున్న రాజిరెడ్డిని కలిసి సంఘీభావం తెలిపేందుకు కాంగ్రెస్, సీపీఐ నాయకులు వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పలు పార్టీలకు చెందిన వారిని గ్రామంలోకి రావడాన్ని పోలీసులు నిరాకరించారు. కాగా, శుక్రవారం అర్ధరాత్రి నుంచి గుడాటిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు, కట్ట నిర్మాణ పనులు బందోబస్తు, పోలీసుల పర్యవేక్షణలో సాగుతున్నాయి.

### చిన్నారి కృతిక మృతి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో.. గాయపడిన కూతురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కరీంనగర్ జిల్లాకు చెందిన జటల అనూష.. తన భర్త మరణంతో తీవ్రంగా కలత చెంది శనివారం నిజామాబాద్‌లో పెద్దమ్మ అపార్ట్‌మెంట్‌పై నుంచి కూతురు కృతికతో సహా ఆత్మహత్యకు పాల్పడటం తెలిసిందే. తల్లి శనివారమే మృతి చెందగా, పాప కృతిక పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్యం విషమించడంతో ఆదివారం మృతి చెందింది.

### గల్ఫ్‌లోని భారతీయుల సమస్యలపై మౌనం బాధాకరం

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సురేశ్

సాక్షి, హైదరాబాద్: బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లిన భారతీయులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహించడం బాధాకరమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దుబాయ్‌లోని ఓ హోటల్‌లో తెలుగు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ నుంచి భారత్‌కు ఏటా రూ.4 లక్షల కోట్ల ఆదాయం సమకూరుతోందని తెలిపారు. ఇంతటి సంపదను అందిస్తున్న గల్ఫ్ కార్మికుల పట్ల ప్రభుత్వాలు లెక్కలేనితనాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గల్ఫ్ వాసులు గొంతెత్తాల్సిన సమయం వచ్చిందని, అలాగే ఎన్నారై పాలసీ సాధనకై బీసీ రాజ్యాధికార సమితి అండగా ఉంటుందని సురేశ్ హామీ ఇచ్చారు.

### జగిత్యాల జిల్లాలో మూడు రాష్ట్రాల ఎమ్మెల్యేల సర్వే

బీజేపీ అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు?

రాయికల్(జగిత్యాల): దేశంలోని మూడు రాష్ట్రాల ఎమ్మెల్యేలు జగిత్యాల జిల్లాలో ఇటీవల సర్వే చేసినట్లు తెలిసింది. బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు, ఆ పార్టీ అభ్యర్థుల ఎంపిక కోసం రాజస్తాన్, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యేలు వారంరోజులుగా జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్, సారంగపూర్, జగిత్యాల మండలాల్లో నేరుగా ప్రజల వద్దకు వెళ్లారని సమాచారం. నియోజకవర్గంలో బీజేపీ పరిస్థితి ఎలా ఉంది? ఏ అభ్యర్థి పోటీచేస్తే గెలిచే అవకాశం ఉంది? విజయం సాధించేందుకు బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే ప్రశ్నలను ప్రజలకు వేసి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. ఈ నివేదికను బీజేపీ అధిష్టానానికి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. ఏదేమైనా మూడు రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలు గుట్టుచప్పుడు కాకుండా, జిల్లా అధిష్టానానికి కూడా తెలియకుండా సర్వే చేయడం బీజేపీ నేతల్లో టెన్షన్ పుట్టిస్తోంది. అయితే, సర్వే చేసినవారి పేర్లు ఫైనల్ అంటూ చెప్పడంతో కొందమందిలో ఉత్కంఠ నెలకొంది.

# మూలికా వైద్యం.. కేరాఫ్ గంధసిరి

సనాతన వైద్యంతో మొండి రోగాలు సైతం మాయం





వన మూలికల వివరాలు వెల్లడిస్తున్న గురూజీ

**అంతరించిపోతున్న సనాతన వనమూలికా వైద్యానికి ఓ గ్రామం నెలవుగా మారింది. మొండి రోగాలను సైతం ఈ వైద్యం మాయం చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులను సైతం ఆకర్షిస్తూ వారి ప్రశంసలందుకుంటోంది. లక్షలాది మంది సాధారణ ప్రజల జబ్బులు సైతం తగ్గిస్తూ ఈ మూలికా వైద్యం అపర సంజీవనిగా నిలుస్తోంది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని గంధసిరి గ్రామం ఇందుకు వేదికగా మారింది. వనమూలికా వైద్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన, ఈ గ్రామానికి చెందిన పస్తం సహదేవరాజ్ తాను వైద్య సేవలందిస్తూనే, తన తెగకు చెందిన 150 మందికి ఇందులో శిక్షణ ఇచ్చారు. ఈ వైద్యం తనతోనే అంతరించి పోకుండా తన పిల్లలకు సైతం నేర్పించారు.**

**దేశ, విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన వైనం**

- మొత్తం 364 వన మూలికలతో చికిత్స
- మాజీ ప్రధానులు, ప్రముఖుల నుంచి ప్రశంసలు
- సాధారణ ప్రజల మన్ననలూ పొందుతున్న సహదేవరాజ్

#### తాతల కాలం నాటి విద్య..

- సాక్షి ప్రతినిధి, ఖమ్మం

శబరికోయ తెగకు చెందిన కొన్ని కుటుంబాలు ఏళ్ల క్రితం భద్రాచలం ప్రాంతం నుంచి గంధసిరి గ్రామానికి వలస వచ్చాయి. తమ తాతలు, తండ్రులు నేర్పిన మూలికా వైద్యాన్ని వంట బట్టించుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైద్యం చేయడం ప్రారంభించాయి. ఈ కుటుంబాలకు చెందిన సహదేవరాజ్ 1979లో మొదలుపెట్టిన మూలికా వైద్యం దేశ విదేశాలకు విస్తరించింది. దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు తొలిసారిగా 1996లో లండన్ వెళ్లారు. అక్కడ బ్రిటన్ రాణిని కూడా కలిశారు. ఈ క్రమంలోనే నేపాల్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, మలేసియా, ఇండోనేసియా తదితర దేశాల్లోనూ వైద్య సేవలందించారు. మరోవైపు అమెరికా, కెనడా నుంచి కూడా పలువురు ఇక్కడకు వచ్చి మూలికా వైద్యం చేయించుకున్నారు. పక్షవాతం, ఆస్తమా, సోరియాసిస్, కీళ్లవాతం తదితర దీర్ఘకాల రోగాల నుంచి ఉపశమనం పొందుతున్నారు.

**ధన్వంతరి స్ఫూర్తిగా..**

మా ముత్తాతలు, తాతలు, తండ్రులు చేసిన వైద్యాన్నే మేమూ చేస్తున్నాం. కుటుంబంలో ఎవరికి జబ్బుచేసినా అదే కుటుంబంలోని మరొకరు కాపాడటంతోనే ఈ మూలికా వైద్యం పుట్టింది. మాకు ధన్వంతరి భగవాన్ స్ఫూర్తి. దేశ, విదేశాలకు వెళ్లి ప్రముఖులకు చికిత్స చేశాం. ఈ విధానం అంతరించిపోకుండా దీన్ని మా పిల్లలకూ నేర్పించాం. మూలికా వైద్యంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

#### అడవుల్లో సేకరించి అనువుగా మార్చి..

ఈ వైద్య విధానంలో 364 రకాల మూలికలను ఉపయోగిస్తామని సహదేవరాజ్ చెబుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, ఛత్తీస్‌గఢ్‌లోని కుంట, బస్తర్, శ్రీశైలం, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని అడవుల్లో వనమూలికలను సేకరించి గంధసిరి, కోయంబత్తూరులోని సహదేవరాజ్ ఆశ్రమాల్లో వైద్యానికి అనువుగా తయారు చేస్తారు. గ్రామానికి చెందిన 150 మంది ఆయన పర్యవేక్షణలో శిక్షణ పొంది అడవుల నుంచి మూలికలు తీసుకురావడంలో సహకరిస్తున్నారు.



గంధసిరి మూలికా వైద్యం సామాన్యులతో పాటు ప్రముఖుల మన్ననలు కూడా పొందింది. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, చంద్రశేఖర్, మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్, ఉమ్మడి ఏపీలోని పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు ఈ వైద్యం తీసుకున్నారు. ఇక నాటి బ్రిటన్ రాణి

#### ఎలిజబెత్ రాణి ప్రశంసలు..

ఎలిజబెత్–2 కూడా సహదేవ్‌రాజ్ మూలికా వైద్యాన్ని ప్రశంసించారు. ఆయన ఆస్ట్రేలియాలో బ్రాంచ్ ఏర్పాటు చేయగా మరిన్ని దేశాల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. మన దేశం, రాష్ట్రానికి చెందిన ప్రముఖులు కూడా ఆయన వద్ద వైద్యం పొందుతున్నారు. గంధసిరిలో ఈ నెల 6న వైద్య వనమూలిక ట్రస్ట్ ప్రారంభించేందుకు సహదేవ్‌రాజ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన తెగకు చెందిన ఇంకొందరికి ఈ ట్రస్ట్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు.

#### నెలరోజుల్లో సైనస్ తగ్గింది..



నాకు సైనస్, మోకాళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉండేవి. ఇవి తగ్గడానికి గతంలో వేల రూపాయలు ఖర్చు చేశా. ఫలితం లేకపోవడంతో గురూజీ సహదేవరాజ్ వనమూలిక వైద్యం గురించి తెలుసుకుని గత నెల గంధసిరికి వచ్చా. నాతోపాటు నా కుమారుడికి సైనస్, భార్యకు బీపీ, థైరాయిడ్‌కు సంబంధించి కూడా వనమూలికలు తీసుకున్నా. నాకు నెలరోజుల్లో సైనస్ తగ్గింది. వారికి కూడా ఉపశమనం కలిగింది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మూలికా వైద్యం చాలా బాగుంది.

- పసునూరు జయపాల్‌రెడ్డి, ప్రసన్నాంజనేయస్వామి టెంపుల్ చైర్మన్, చంపాపేట, హైదరాబాద్

# హెల్త్ క్యాంపులు, సన్మానాలు

- మహిళల శక్తిని ప్రతిబింబించేలా 8 నుంచి మహిళా వారోత్సవాలు
- స్త్రీలకు వడ్డీ లేని రుణాల పంపిణీ సైతం చేపట్టాలి
- అధికారులకు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8 నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు అధికారులను ఆదేశించారు. సమాజంలో మహిళల శక్తిని, పాత్రను తెలిపేలా ఈ ఉత్సవాలు నిర్వహించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలన్నారు. వారోత్సవాల్లో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వైద్య, ఇతర అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపుల నిర్వహణ, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సన్మానం వంటి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. పురపాలికల్లో డ్రై కంపోస్ట్, కిచెన్ కాంపోస్టింగ్, నీటి సంరక్షణ తదితర రంగాల్లో ఆదర్శప్రాయంగా నిలుస్తున్న పురపాలక సిబ్బంది లేదా పట్టణంలోని మహిళలను ప్రత్యేకంగా గుర్తించి సన్మానించాలన్నారు. పట్టణాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారైన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల క్యాంపులు నిర్వహించాలని, ప్రభుత్వ రుణాలు, సబ్సిడీల వంటి వాటిని వినియోగించుకొని స్వయం సమృద్ధి సాధించిన వీధి వర్తకులు మొదలుకొని వివిధ రంగాలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల వరకు ప్రత్యేకంగా గుర్తించాలని మంత్రి సూచించారు. కంటివెలుగు ద్వారా పురపాలక శాఖలోని మహిళా ఉద్యోగులందరికీ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా రక్షణ, ఆరోగ్య సంరక్షణ, సాధికారికత వంటి అంశాలపై చర్చాగోష్టులు నిర్వహించి అవగాహన పెంచేలా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. వారోత్సవాల్లో మహిళలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసే కార్యక్రమాలను కూడా సిద్ధం చేయాలన్నారు. ఈ సంబరాలకు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మహిళా జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులు, మహిళా జడ్జీలను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాలన్నారు. మంత్రి ఆదేశంతో పురపాలక శాఖ మహిళా వారోత్సవాల కార్యాచరణను ప్రకటించింది.

## నేడు ప్రైవేటు ఇంటర్ కాలేజీ యాజమాన్యాలతో సబిత భేటీ

- విద్యార్థి ఆత్మహత్యలపై సమీక్ష..
- సాత్విక్ మృతిపై మంత్రికి సమగ్ర నివేదిక



సాక్షి, హైదరాబాద్/మణికొండ/ షాద్‌నగర్ రూరల్: ప్రైవేటు ఇంటర్ కాలేజీల యాజమాన్యాలు, అధ్యాపక సంఘాలతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సోమవారం భేటీ అవుతారు. ఇంటర్, పోటీ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె సమీక్షించనున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థుల మానసిక స్థితిగతులు, యాజమాన్యాల నుంచి విద్యార్థులకు మార్కుల కోసం వస్తున్న ఒత్తిడిపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి ఇంటర్ విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ విద్యాశాఖ కార్యదర్శి కరుణ హాజరవుతారు.

**సాత్విక్ ఆత్మహత్యపై సమగ్ర నివేదిక**

ఇటీవల నార్సింగ్ పరిధిలోని ఓ కార్పొరేట్ కాలేజీ విద్యార్థి సాత్విక్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర నివేదికను ఇవ్వాలని ఇంటర్ బోర్డ్ అధికారులను సబిత ఆదేశించారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా ఇంటర్ విద్యాధికారి ప్రాథమిక నివేదిక అందజేశారు. విద్యార్థి తను చదువుతున్న కాలేజీలో కాకుండా, అదే కాలేజీకి చెందిన మరో క్యాంపస్‌లో మృతి చెందినట్లు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. వేరే క్యాంపస్‌కు అతను ఎందుకు వెళ్లాడు? అతని అడ్మిషన్ ఎక్కడ? ఆత్మహత్యకు గల కారణాలపై సోమవారం సమగ్ర నివేదిక ఇవ్వనున్నారు.

**సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి**

సాత్విక్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన ఆస్పత్రిపై అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదిక సమర్పించారని మృతుడి తల్లిదండ్రులు నాగుల రాజు, అలివేలు ఆరోపించారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి పోస్టుమార్టం చేస్తే, గాంధీలో చేసినట్లు తప్పుడు నివేదిక ఇచ్చారని, తమ కుమారుడు అసలు శ్రీ చైతన్య కాలేజీలో చదవడం లేదని రిపోర్టు ఇచ్చి ఇచ్చారని ఆరోపించారు. ఆ నివేదికపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# ప్రీతిది ముమ్మాటికీ హత్యే

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపే వరకూ న్యాయ పోరాటం చేస్తాం: బండి సంజయ్



ప్రీతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

కొడకండ్ల: పీజీ వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతిది ముమ్మాటికీ హత్యేనని, దీనిపై కుటుంబసభ్యులతోపాటు తమ పార్టీ ఆది నుంచి అనుమానం వ్యక్తం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపే వరకు తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిరిని తండాలో ప్రీతి కుటుంబసభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తప్పులేకపోతే ప్రీతి ఘటనపై ఎందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. సీనియర్ విద్యార్థి సైఫ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం డ్రామాలాడుతోందని, కేసును పక్కదారి పట్టించే యత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రీతి మృతికి కారకులైన వారికి కఠినశిక్ష పడే వరకు ఆమె కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే గిరిజన కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, కుటుంబసభ్యులను బెదిరించి మృతదేహాన్ని ఎత్తుకెళ్లే నీచానికి కేసీఆర్ ప్రభుత్వం దిగజారిందని దుయ్యబట్టారు.

**నేడు నిరసన దీక్ష..**

మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలకు నిరసనగా సోమవారం హైదరాబాద్‌లో మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల వరకు దీక్ష చేపడతానని బండి సంజయ్ వెల్లడించారు. కేసీఆర్ సర్కార్ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, రాబోయే రోజుల్లో ప్రజల చేతిలో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

**సంజయ్‌ను అడ్డుకున్న బీఆర్‌ఎస్ నాయకులు**

ప్రీతి కుటుంబ సభ్యులను పరామర్శించి వెళ్తున్న క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బండి సంజయ్‌ను అడ్డుకున్నారు. దీనిపై బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి బండి కాన్వాయ్‌ను పంపించారు. కాగా, ప్రీతి మృతికి సంతాపంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు.

**పీఆర్‌సీ ఏర్పాటు చేయాలంటూ సీఎంకు లేఖ**

సాక్షి, హైదరాబాద్: వెంటనే వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు జూలై 1 నుంచి పెంచిన జీతాలు చెల్లించాలని సీఎం కేసీఆర్‌కు బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ రాశారు. అలాగే బీఆర్‌ఎస్ ఎన్నికల హామీలైన రుణమాఫీ, ఉచిత యూరియా, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూపంపిణీ వంటి వాటి అమలుకు రానున్న కేబినెట్ భేటీలో నిధులు కేటాయించాలన్నారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- ప్రీతి మృతిపై లంబాడీల ఐక్య వేదిక రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

పంజగుట్ట: మెడికో విద్యార్థిని ధరావత్ ప్రీతినాయక్ అనుమానాస్పద మృతిపై సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతో విచారణ జరిపించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లంబాడీల ఐక్య వేదిక (లైవ్) ఆధ్వర్యంలో ప్రీతి అనుమానాస్పద మృతిపై బహుజన నాయకుల హైదరాబాద్ డిక్లరేషన్ పేరు తో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క, ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, సినీనటి కరాటే కల్యాణి, ప్రొఫెసర్ చంద్రునాయక్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఉషాకిరణ్ మాట్లాడారు. ఎట్టిపరిస్థితుల్లో ప్రీతిది ప్రభుత్వ హత్యే అని, ప్రభుత్వ మౌనం చూస్తుంటే ముద్దాయిని రక్షించేలా ఉందని ఆరోపించారు. సైఫ్ ఓ యువతి ఆత్మహత్య చేసుకునేంతలా ఏడిపించాడంటే వాడు వైద్యం చేసేందుకు పనికిరాడని వెంటనే అతని సర్టిఫికెట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసులో ఎన్నో అనుమానాలున్నాయని తెలిపారు. హెచ్‌ఓడీ, ప్రిన్సిపల్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని, రూ.50 లక్షల బాండ్‌ను పీజీ విద్యార్థులకు వెంటనే రద్దుచేయాలన్నారు. ప్రీతి కుటుంబంలో ఒకరికి గ్రూప్–1 స్థాయి ఉద్యోగం, రూ.5 కోట్ల ఎక్స్‌గ్రేషియా, మూడెకరాల భూమి కేటాయించాలన్నారు. ప్రీతి బాబాయ్ రాజ్‌కుమార్, సోదరుడు వంశీ మాట్లాడుతూ నిందితున్ని ఎన్‌కౌంటర్ చేయాలని, అప్పుడే ప్రీతి ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు.

## అసమానతలు లేని సమాజం కావాలి

ఆర్‌ఎస్‌ఎస్ భాగ్యనగర్ సంభాగ్ ప్రధాన కార్యదర్శి ఇందుశేఖర్



పథ సంచలన్‌లో స్వయం సేవకులు

భైంసాటౌన్: భారతదేశం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని, కులాల మధ్య అసమానతలు, ఆధిపత్య పోకడలు, అవినీతి వంటి అవలక్షణాలతో ఉత్తమ సమాజం నిర్మితం కాలేదని ఆర్‌ఎస్‌ఎస్ ఇతిహాస సంకలన సమితి భాగ్యనగర్ సంభాగ్ ప్రధాన కార్యదర్శి ఇందుశేఖర్ అన్నారు. నిర్మల్ జిల్లా భైంసాలో ఆదివారం నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ శారీరక్ ప్రదర్శన్, పథ సంచలన్ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. భారతదేశ చరిత్రను వక్రీకరించారని, దేశప్రజలు వాస్తవ చరిత్రను తెలుసుకోవాలని ఇందుశేఖర్ సూచించారు. అవినీతి, విలువలు లేని సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ తమను తాము మంచి వ్యక్తిగా మలచుకోవాలన్నారు. ఇలాంటి ఆదర్శాల కోసం పని చేసే సమాజం స్థాపించాలన్న ఉద్దేశంతోనే సంఘ్ ప్రారంభమైందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంఘచాలక్ నూకల విజయ్‌కుమార్, నగర సంఘచాలక్ సాదుల కృష్ణదాస్, గాడె మహేశ్ పాల్గొన్నారు. కాగా, ఆర్‌ఎస్‌ఎస్ భైంసా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన శారీరక్ ప్రదర్శన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. హైకోర్టు షరతుల మేరకు కార్యక్రమం కొనసాగింది. ముందుగా మధ్యాహ్నం 2 గంటలకు సుభద్రవాటిక ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకులు సమావేశమై ధ్వజ వందనం చేశారు. అక్కడి నుంచి శారీరక్ ప్రదర్శన్‌లో భాగంగా భగత్‌సింగ్ చౌక్, వివేకానంద చౌరస్తా, కుబీర్ రోడ్డు, పద్మావతి కాలనీ, మున్సిపల్ ఆఫీసు ముందు నుంచి వినాయక్‌నగర్ మీదుగా తిరిగి శివాజీ చౌరస్తా, ఆర్టీసీ డిపో మీదుగా సుభద్రవాటికకు చేరుకున్నారు. అనంతరం ధ్వజారోహణ చేసి, స్వయం సేవకులు పలు ప్రదర్శనలు చేపట్టారు.

## ప్రీతి ఘటనపై సీఎం కేసీఆర్, కేటీఆర్ మౌనం వీడాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- 8న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



మీడియా సమావేశంలో 'సాక్షి' పత్రిక క్లిపింగ్‌లను చూపిస్తున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: మెడికో ప్రీతి ఘటనపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మౌనం వీడాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలో విలేకరుల సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్, గిరిజన సంఘాల నాయకులతో కలిసి మంద కృష్ణమాదిగ మాట్లాడారు. రోజూ ట్విట్టర్‌లో స్పందించే కేటీఆర్‌కు గిరిజన విద్యార్థిని ప్రీతి మృతి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రియాంకరెడ్డి తండ్రి తన కూతురు మృతికి కారకులైన వారికి శిక్ష విధించాలని కోరితే చట్టవిరుద్ధంగా ఎన్‌కౌంటర్ చేసి హతమార్చారన్నారు. అదే ప్రీతి తండ్రి చట్టబద్ధంగా స్వతంత్రంగా సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేసినా.. ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని, సీఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రీతిది హత్యా?, ఆత్మహత్యా? అని చెప్పలేమని ఎంజీఎం సూపరింటెండెంట్ స్వయంగా చెప్పినా ఎందుకు ఆత్మహత్య కేసుగా నమోదు చేశారని నిలదీశారు. ప్రీతి గిరిజనురాలు అయినందుకే ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, హత్య కేసు నమోదు చేయాలని, కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ, ఎంజీఎం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రీతి మృతికి సంబంధించిన కథనాలు 'సాక్షి' దినపత్రిక సమగ్రంగా పూర్తి విశ్లేషణతో 'ప్రీతి ఘటనలో తొలగని అనుమానాలు', 'ప్రీతి ఘటనపై చర్యల్లో వేగమేది' అని ప్రచురించిందని పత్రిక క్లిప్పింగ్‌లు చూపించారు. మహిళా దినోత్సవం సందర్భంగా 8న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు చెప్పారు.

# ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారు
- కల్లబొల్లి మాటలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట
- ఆత్మీయ సమావేశంలో మాజీ ఎంపీ పొంగులేటి



సభలో మాట్లాడుతున్న పొంగులేటి

తిరుమలాయపాలెం: బంగారు తెలంగాణ చేస్తానని మాయమాటలు చెప్పి అప్పుల తెలంగాణగా మార్చిన సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ప్రస్తుతం అందరి ముందూ ఉన్న లక్ష్యమని, జెండా ఏదైనా అజెండా ఒక్కటేనని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆత్మబలిదానాలతో ఏర్పడిన ధనిక తెలంగాణను అప్పులకుప్పగా మార్చారని ఆరోపించారు. నిధులు, నీళ్లు, నియామకాలు అని చెప్పి అధికారంలోకి వచ్చారని, రాష్ట్రంలో నేడు అప్పులు, రైతులు, యువత ఆత్మహత్యలు మాత్రమే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. అమలు సాధ్యంకాని వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేశారని, ఉప ఎన్నికల సమయంలో అర్హులందరికీ దళితబంధు ఇస్తామని ప్రకటించి, నేడు నియోజకవర్గంలో 100 మందికే ఇస్తున్నారని, గిరిజనబంధు ఊసేలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 20కి మించి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించిన గ్రామం ఉంటే చూపించాలని పొంగులేటి సవాల్ విసిరారు. 36.86 లక్షల మంది రైతుల్లో కేవలం 5.86 లక్షల మందికే రుణమాఫీ చేశారని, ఇంకా 31 లక్షల మందికి రుణమాఫీ కాలేదని, బడ్జెట్‌లోనూ దానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదని విమర్శించారు. రూ.19,600 కోట్లతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టుకు ఆరేళ్లలో రూ.6,200 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇంకా రూ.13 వేల కోట్లు ఖర్చుపెట్టాల్సి ఉందని, సీతారామ ప్రాజెక్టు నీళ్లతో పాలేరు ప్రజల కాళ్లు కడుగుతామన్న పెద్దమనిషి దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడంలో కేసీఆర్ దిట్ట అని అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు మువ్వా విజయ్ బాబు, నాయకులు స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, డాక్టర్ కోట రాంబాబు, విజయాబాయి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### 'ఇన్సాఫ్ కె సిపాహి'కి కేజ్రీవాల్ మద్దతు

న్యూఢిల్లీ: రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ దేశంలో జరిగే అన్యాయాలపై పోరాటానికి ఏర్పాటు చేసిన 'ఇన్సాఫ్ కె సిపాహి' వేదికకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మద్దతు ప్రకటించారు. 'సిబల్ ప్రకటించిన ఇన్సాఫ్ సిపాహి చాలా ముఖ్యమైంది. అన్యాయంపై కలిసికట్టుగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ఇందులో చేరాలి' అని ఆదివారం కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. 'ఇన్సాఫ్'కు శివసేన ఉద్ధవ్ వర్గం, ఆర్జేడీ చీఫ్, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ మద్దతు దక్కింది.

### ఆదివాసీల హక్కులపై బీజేపీతో చర్చకు సిద్ధం

అగర్తలా: తిప్రాసా ప్రజల సమస్యలపై రాజ్యాంగబద్ధ పరిష్కారం కనుగొనేందుకు బీజేపీతో ముఖాముఖి చర్చలకు సిద్ధమని తిప్రా మోథా చీఫ్ ప్రద్యోత్ దేవ్ వర్మన్ చెప్పారు. తిప్రా మోథా డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరిస్తామని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ శనివారం చేసిన ప్రకటనపై దేవ్ స్పందించారు. 'ఆర్థికంగా, రాజకీయంగా, భాషాపరంగా మాకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటిపై గౌరవప్రదంగా చర్చలకు పిలిస్తే వెళ్తాం. స్థానిక ఆదివాసీల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడానికి మేం సిద్ధం. అయితే, ఈ చర్చలు కేబినెట్ పోస్టు కోసమో, వ్యక్తిగత లబ్ధి కోసమో మాత్రం కాదు' అని స్పష్టంచేశారు. ఇటీవలి ఎన్నికల్లో రెండో అతిపెద్ద పార్టీగా అవతరించిన తిప్రా మోథా మొత్తం 13 ఎస్టీ రిజర్వుడు స్థానాలనూ గెలుచుకుంది.

### లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్ లేరు.. ఇది రాజ్యాంగ విరుద్ధం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: లోక్‌సభకు గత నాలుగేళ్లుగా డిప్యూటీ స్పీకర్ లేరని, ఇది రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ఆరోపించింది. లోక్‌సభతోపాటు పలు రాష్ట్రాల శాసనసభలకు డిప్యూటీ స్పీకర్లు లేకపోవడంపై దాఖలైన పిల్‌పై సుప్రీంకోర్టు గత నెలలో కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తాజాగా ఇదే విషయాన్ని ప్రస్తావించింది. ప్రతిపక్ష నేతకు దక్కరాదనే ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉంచుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. '1956లో ప్రధాని నెహ్రూ ప్రతిపక్ష నేత, తన విధానాలను తీవ్రంగా విమర్శించే అకాలీదళ్ ఎంపీని సర్దార్ హుకుం సింగ్ పేరును డిప్యూటీ స్పీకర్ పదవికి ప్రతిపాదించారు' అని అప్పటి ఘటనను జైరాం రమేశ్ ఉదహరించారు.

# ఉత్తర కొరియాలో ఆకలి కేకలు



1990ల నాటి ఉత్తర కొరియా కరువు తీవ్రతకు దర్పణంగా నిలిచిందీ ఫొటో. నాటి కరువు తీవ్రతకు సంబంధించి వెలుగులోకి వచ్చిన అతి కొన్ని సాక్ష్యాల్లో ఇదొకటి

**పైన పటారం, లోన లొటారం అన్నట్టుగా తయారైంది ఉత్తర కొరియా పరిస్థితి. అధ్యక్షుడు కిమ్ వరుస క్షిపణి పరీక్షలతో దాయాది దక్షిణ కొరియాకు, దాని మద్దతుదారు అమెరికాకు సవాళ్లు విసురుతుంటే దేశం మాత్రం కనీవినీ ఎరుగని కరువు కోరల్లో చిక్కి అల్లాడుతోంది. తిండికి లేక జనం అలమటిస్తున్నారు. తక్షణం దిద్దుబాటు చర్యలకు దిగకుంటే 1990ల్లో దేశం చవిచూసిన 20 లక్షల పై చిలుకు ఆకలి చావుల రికార్డు చెరిగిపోయేందుకు ఎంతో కాలం పట్టదంటూ ఆందోళన వ్యక్తమవుతోంది...!**

- సాక్షి, నేషనల్ డెస్క్



### తీవ్ర కరువు కోరల్లో దేశం

| క్షిపణి పరీక్షల్లో కిమ్ బిజీ | చుక్కల్లో సరుకుల ధరలు |
|---|---|

**కిలో బియ్యం రూ.220**

అటు కాలం కనికరించడం లేదు. తీవ్ర వరదలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో గతేడాది పంట దిగుబడులు కుదేలయ్యాయి. ఇటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అంతో ఇంతో ఆదుకుంటూ వచ్చిన ప్రజా పంపిణీ వ్యవస్థ చేతులెత్తేసింది. ఇంతకాలం మార్కెట్లో దొరుకుతూ వచ్చిన చైనా తిండి గింజలు, నిత్యావసరాలు కరోనా కట్టడి దెబ్బకు మూడేళ్లుగా అసలే అందుబాటులో లేకుండా పోయాయి. దాంతో ఉత్తర కొరియా అక్షరాలా ఆకలి కేకలు పెడుతోంది. జనాభాలో అధిక శాతం రోజుకు ఒక్క పూట కూడా తిండికి లేక అలమటిస్తున్నారు. నియంతృత్వపు ఇనుప తెరలు దాటుకుని ఏ విషయమూ బయటికి రాదు గనుక అధికారిక గణాంకాలు అందుబాటులో లేవు. కానీ ఇప్పటికే లక్షలాది మంది కరువు బారిన పడ్డట్టు అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. కరువు మరణాల సంఖ్య కూడా నానాటికీ పెరుగుతున్నట్టు చెబుతున్నాయి. అస్తవ్యస్త పాలనకు మారుపేరైన కిమ్ ప్రభుత్వమే ఇందుకు ప్రధాన దోషిగా కనిపిస్తోంది.

**కారణాలెన్నో...**

- కొరియా కరువుకు చాలా కారణాలున్నాయి. కరోనా దెబ్బకు ఆహార కొరత తీవ్రతరమైంది.
- ప్రభుత్వం తీవ్ర ఆంక్షలను విధించి అత్యంత కఠినంగా అమలు చేయడం, సరిహద్దులను పూర్తిగా మూసేయడంతో సమస్య మరింత పెరిగింది.


2.5 కోట్ల జనాభా ఆహార అవసరాలు తీర్చడానికి కనీసం 55 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు అవసరం. కాగా వార్షిక సగటు ఉత్పత్తి 45 లక్షల టన్నులే. మిగతా 10 శాతం లోటు చాలావరకు చైనాతో సాగే అనధికారిక వర్తకం ద్వారా పూడేది. తిండి గింజలు, నిత్యావసరాలతో పాటు పలు ఇతర చైనా సరుకులు 2020 దాకా దేశంలోకి భారీగా వచ్చేవి. ముఖ్యంగా గ్రామీణుల అవసరాలు చాలావరకు వీటిద్వారానే తీరేవి. కానీ మూడేళ్లుగా ఆంక్షల దెబ్బకు ఈ వర్తకం దాదాపుగా పడకేసింది. ఇది సగటు కొరియన్లకు చావుదెబ్బగా మారింది. దీనికి తోడు గతేడాది తిండి గింజల ఉత్పత్తి 35 లక్షల టన్నులకు మించకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది.

- ప్రభుత్వం వద్ద భారీగా ఆహార నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవలే చైనా నుంచి భారీగా బియ్యం, గోధుమ పిండి తదితరాలను దిగుమతి చేసుకుంది కూడా. కానీ 'ముందు జాగ్రత్త' చర్యల్లో భాగంగా వాటిని కావాలనే దాచి ఉంచిందని పరిశీలకులు చెబుతున్నారు. ఫలితంగా నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతున్నాయి. ప్రజల్లో చాలామందికి కొనుగోలు శక్తి క్షీణించడంతో వారికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. కిలో బియ్యం ధర ఏకంగా 220 రూపాయలకు ఎగబాకిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు!
- వ్యవసాయ రంగంలో సమూల మార్పులు తెచ్చి దేశాన్ని స్వయంసమృద్ధంగా మార్చుకుంటామంటూ తాజాగా జరిగిన 4 రోజుల వర్కర్స్ పార్టీ సమావేశాల్లో కిమ్ గంభీరంగా ఉపన్యాసమిచ్చారు. అది ఏ మేరకు వాస్తవ రూపు దాలుస్తుందన్న దానిపైనే కొరియన్ల భవితవ్యం ఆధారపడుతుంది.

### తీవ్ర అసమానతలు

- ఉత్తర కొరియా ప్రపంచంలోని అత్యంత నిరుపేద దేశాల జాబితాలో ఉంది. ప్రజల తలసరి ఆదాయం కేవలం రూ.1.3 లక్షలు!
- దేశంలో సామాజిక అసమానతలు చాలా ఎక్కువ.
- అత్యధికులకు, ముఖ్యంగా గ్రామీణులకు అన్నం, కాయగూరలే ప్రధానాహారం.
- మాంసాహారం, పండ్లు వారికి అందని ద్రాక్షే.
- పట్టణాల్లో పరిస్థితి కాస్త మెరుగు. రాజధాని ప్యాంగ్యాంగ్‌లో స్థోమత ఉంటే అన్నిరకాల ఆహారమూ దొరుకుతుంది.
- దేశంలో ప్రైవేట్‌లో ఆహారం, ఆహార ధాన్యాల అమ్మకం నిషిద్ధం. కానీ కొన్నేళ్లుగా ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా కుదేలైంది. దాంతో ప్రైవేట్ క్రయ విక్రయాలను ప్రభుత్వం చూసీ చూడనట్టు పోతోంది.

### రికార్డు స్థాయిలో క్షిపణి ప్రయోగాలు




1990ల్లో ఉత్తర కొరియా చవిచూసిన భయానక కరువు గురించి ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. 'ఆర్డియస్ మార్చ్'గా పిలిచే ఈ కరువుకు అస్తవ్యస్త పాలన, సోవియట్ నుంచి సాయం ఆగిపోవడంతో పాటు 1995లో వచ్చిన భారీ వరదలు తక్షణ కారణంగా మారాయి. వాటి దెబ్బకు దేశంలో వరి పంట దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. నాలుగో వంతుకు పైగా పొలాలు రోజుల తరబడి అడుగుల లోతు నీటిలో మునిగిపోయాయి! జనమంతా పనీపాటా

#### ఆ కరువుకు 20 లక్షల మంది బలి!

వదిలేసి కేవలం తిండి గింజల కోసం రోజుల తరబడి పొలాల వెంబడి తిరుగుతూ అలమటించిన దృశ్యాలు అప్పట్లో అందరినీ కలచివేశాయి. కనీవినీ ఎరగని ఆ కరువుకు రెండు కోట్ల జనాభాలో పదో వంతుకు పైగా, అంటే 20 లక్షల మందికి పైగా బలైనట్టు చెబుతారు. అంతేగాక ఏకంగా 62 శాతం మందికి పైగా చిన్నారులు పౌష్టికాహార లోపానికి గురై శాశ్వత ఆరోగ్య తదితర సమస్యల బారిన పడ్డారు. రెండు మూడేళ్ల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చినా చిన్నారులు మాత్రం కోలుకోలేకపోయారు. నేటికీ ఉత్తర కొరియాలో 22 శాతం మంది బాలలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్టు అంచనా!

### నిధులన్నీ సైన్యానికే!

- ఉత్తర కొరియా 12 లక్షల మందితో కూడిన ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద సైన్యాన్ని పోషిస్తోంది.
- ఏటా జీడీపీలో ఏకంగా నాలుగో వంతు సైన్యంపైనే వెచ్చిస్తోంది.
- 2022లోనైతే దేశ చరిత్రలోనే అత్యధికంగా దాదాపు 70 ఖండాంతర, క్రూయిజ్ క్షిపణులను పరీక్షించింది!
- తన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు ఇటీవలే భారీ సంఖ్యలో ఖండాంతర క్షిపణులు తదితరాలతో నెల రోజుల క్రితమే అతి పెద్ద సైనిక పరేడ్‌ను నిర్వహించింది!
- ఇలా వనరులన్నీ రక్షణ రంగానికే మళ్లుతుండటంతో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం దక్కకుండా పోతోంది.
- కిమ్ అణు పరీక్షల కారణంగా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు విధించిన ఆంక్షలతో పరిస్థితి మరింత విషమించింది.
- కేవలం గతేడాది క్షిపణి పరీక్షలకు వెచ్చించిన నిధులతో దేశ జనాభా మొత్తానికీ ఏడాది పాటు చాలినన్ని తిండి గింజలు అందించవచ్చని అంచనా.

## ఇమ్రాన్ అరెస్ట్‌కు పోలీసుల యత్నం

**లాహోర్‌లో ఆయన ఇంటి వద్ద ఉద్రిక్తత**



ఇమ్రాన్ ఇంటివద్ద గుమిగూడిన మద్దతుదారులు

లాహోర్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్‌చేసేందుకు ఇస్లామాబాద్ నుంచి పోలీసు బృందం లాహోర్‌లోని ఖాన్ నివాసానికి చేరుకోవడంతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది. వందలాది మంది ఇమ్రాన్ మద్దతుదారులు ఆయన ఇంటికి చేరుకోవడం, నినాదాలు, పోలీసులు వెనుతిరగడం వంటి ఘటనలతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

**అసలేం జరిగింది?**

పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్(పీటీఐ) చీఫ్ ఇమ్రాన్ పాక్ ప్రధానిగా ఉన్న కాలంలో పలు దేశాల పాలకులు, అగ్రనేతలు ఖాన్‌కు ఇచ్చిన విలువైన బహుమతులను కేంద్ర ఖజానా(తోషఖానా)కు అప్పగించకుండా వాటిని తక్కువ ధరకే కొని వేరే వ్యక్తులకు ఎక్కువ ధరకు అమ్మి లాభం గడించాడని కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే మూడు సార్లు ఇస్లామాబాద్ సెషన్స్ కోర్టుకు రాకుండా ఖాన్ ఎగ్గొట్టారు. దీంతో అరెస్ట్ చేసి అయినా కోర్టు ముందు నిలబెట్టాలని ఇస్లామాబాద్ ఎస్పీతో కూడిన పోలీసు బృందం ఆదివారం లాహోర్‌కు చేరుకుని ఆయన ఇంటికెళ్లింది. విషయం తెల్సుకున్న పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు వందలసంఖ్యలో అక్కడి చేరుకున్నారు. ఈ నెల ఏడోతేదీన ఖాన్ కోర్టుకు వస్తారని ఆయన తరఫు లాయర్లు హామీ ఇవ్వడంతో పోలీసులు వెళ్లిపోయారు. అరెస్ట్ సమయంలో ఘర్షణ ఆపేందుకు ఆ వీధిలో కంటైనర్లు అడ్డుపెట్టడం, వాటర్ కేనన్లు, బలగాలను మోహరించడంతో ఆ ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. 'కోర్టుకు తీసుకెళ్లే దారిలో నన్ను చంపాలని కుట్ర పన్నారు. 74 తప్పుడు కేసులపై పాక్ చీఫ్ జస్టిస్‌కు లేఖ రాస్తా' అని ఖాన్ ఆ తర్వాత ఆరోపించారు.

## ప్రజాస్వామ్యంపై దారుణ దాడి

**లండన్‌లో కార్యక్రమంలో మోదీ సర్కార్‌పై రాహుల్ ఆరోపణ**



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

లండన్: నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ సర్కార్.. భారత ప్రజాస్వామ్య మౌలిక స్వరూపంపై దాడికి తెగబడిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే కన్యాకుమారి నుంచి కశ్మీర్‌దాకా భారత్ జోడో యాత్రగా ముందుకు కదిలామని ఆయన వివరించారు. బ్రిటన్ పర్యటనలో ఉన్న రాహుల్ శనివారం సాయంత్రం లండన్‌లోని ఇండియన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్(ఐజేఏ) కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. ' దేశ ప్రజాస్వామ్య మౌలిక స్వరూపం ప్రమాదంలో పడింది. అన్ని రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను మోదీ సర్కార్ ముమ్మరం చేసింది. దేశం గొంతు నొక్కాలని చూస్తున్న బీజేపీ యత్నాన్ని అడ్డుకునేందుకు భారత్ జోడో యాత్రగా ప్రజల వాణిని వినిపించాల్సిన అవసరం వచ్చింది. అందుకే యాత్ర చేపట్టాం. విపక్షాల ఐక్యత కోసం సంప్రతింపులు చురుగ్గా సాగుతున్నాయి. నిరుద్యోగిత, పెరిగిన ధరలు, మహిళలపై హింసతో పెల్లుబికిన ప్రజాగ్రహాన్ని తగ్గించేలా ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటు కోసం కృషి జరుగుతోంది' అని రాహుల్ అన్నారు. 'ఇటీవల ముంబై, ఢిల్లీలో బ్రిటన్‌కు చెందిన బీబీసీ వార్తాసంస్థ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖతో సర్వే పేరిట ఆకస్మిక దాడులు చేయించి భయపెట్టి, కేంద్రం మీడియా గొంతు నొక్కాలని చూస్తోంది. బీబీసీ మోదీ సర్కార్ మాట వింటే సంస్థపై మోపిన తప్పుడు కేసులన్నీ మాయమవుతాయి' అని ఆరోపించారు.

**ప్రతిష్ట దిగజార్చింది ఆయనే**

విదేశీ గడ్డపై భారత ప్రతిష్టను దిగజార్చేలా రాహుల్ మాట్లాడారని శుక్రవారం బీజేపీ చేసిన విమర్శలపై రాహుల్ బదులిచ్చారు. ' నా దేశాన్ని ఏనాడూ తక్కువ చేసి మాట్లాడలేదు. అది నా స్వభావం కూడా కాదు. ప్రధాని హోదాలో విదేశీ పర్యటనకు వెళ్లి మోదీయే ఆ పనిచేశారు. గత దశాబ్దకాలంలో భారత్ అభివృద్ధికి నోచుకోలేదని మోదీ అన్నారు. దేశ పురోగతికి పాటుపడిన ఇక్కడి ప్రజలను ఆయన అవమానించలేదా ? ' అని ప్రశ్నించారు.

### భయం వద్దు..తమిళులు మంచివారు

**వలస కార్మికులనుద్దేశించి తమిళనాడు గవర్నర్**

చెన్నై: తమిళనాడు ప్రజలు ఎంతో మంచివారని, స్నేహభావంతో ప్రవర్తిస్తారని రాష్ట్ర గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉత్తరాది వలసకార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని వారిని కోరారు. అభద్రతా భావానికి, భయాందోళనలకు లోనుకావద్దన్నారు. ఈ మేరకు ఆయన పలు ట్వీట్లు చేశారు. కాగా, వలసకార్మికుల భద్రతపై పుకార్ల నేపథ్యంలో బిహార్ అధికారుల బృందం తిరుపూర్‌లోని దుస్తుల కర్మాగారాలను సందర్శించింది. అక్కడి దుస్తుల కర్మాగారాల్లో పనిచేసే వలస కార్మికుల భద్రతపై అక్కడి అధికారులతో చర్చలు జరిపి, సంతృప్తి వ్యక్తం చేసింది. వదంతులకు కారకులుగా హిందీ వార్తా పత్రికకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై పోలీసులు కేసులు పెట్టారు. బీజేపీ తమిళనాడు చీఫ్ అన్నామలైపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనిపై అన్నామలై స్పందించారు. 'ఉత్తరాది సోదరులకు వ్యతిరేకంగా డీఎంకే 7 దశాబ్దాలుగా సాగిస్తున్న దుష్ప్రచారాన్ని బయట పెట్టినందుకే నాపై కేసు పెట్టారు. చేతనైతే అరెస్ట్ చేయాలి' అని ఆయన ప్రభుత్వానికి సవాల్ విసిరారు. తమిళనాడులో వలసకార్మికులపై దాడులు వార్తలకు కేంద్రంపై కారణమని బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఆరోపించారు. రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

### బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణిని భారతీయ నావికాదళం ఆదివారం విజయవంతంగా పరీక్షించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ– డీఆర్‌డీఓ దేశీయంగా రూపొందించిన ఈ క్షిపణి షిప్ లాంచ్ వెర్షన్‌ను అరేబియా సముద్రంలో పరీక్షించినట్లు సీనియర్ ఆర్మీ అధికారి ఒకరు చెప్పారు. భారత్–రష్యా సంయుక్త భాగస్వామ్య బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జలాంతర్గాములు, విమానాలు, ఓడలతోపాటు నేలపై నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేస్తోంది. బ్రహ్మోస్ క్షిపణులు ధ్వని వేగానికి దాదాపు మూడు రెట్ల వేగంతో ప్రయాణించగలవు. వీటిని భారత్ ఎగుమతి కూడా చేస్తోంది. ఇందుకు సంబంధించి గత ఏడాది ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణి యాంటీ షిప్ వెర్షన్‌ను గత ఏడాది ఏప్రిల్‌లో భారత్ విజయవంతంగా ప్రయోగించింది.

### సిసోడియాను సీబీఐ చిత్రహింసలు పెడుతోంది: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో అరెస్టయిన మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ అధికారులు మానసికంగా చిత్రహింసలు పెడుతున్నారని ఆప్ ఆరోపించింది. తప్పుడు అభియోగాలను ఒప్పుకుని, సంతకాలు చేయాలంటూ ఆయన్ను బలవంతం చేస్తున్నారని పేర్కొంది. ఆప్ జాతీయ ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఆయనపై మోపిన అభియోగాలకు సంబంధించి సీబీఐ వద్ద ఆధారాలు లేవన్నారు. సిసోడియా నివాసంపై జరిపిన దాడుల్లోనూ ఏమీ దొరకలేదని చెప్పారు. సిసోడియా ఫిబ్రవరి 28వ తేదీ నుంచి సీబీఐ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే.

### నానో డీఏపీతో సాగు మరింత సులువు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: నానో లిక్విడ్ డీఏపీ(డై అమ్మోనియం పాస్ఫేట్)కి ఆమోదం తెలపడం రైతుల జీవితాన్ని సులభతరం చేయడంలో కీలక ముందడుగని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. నానో ద్రవీకృత డీఏపీను మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చేసిన ట్వీట్‌కు ప్రధాని ఈ మేరకు స్పందించారు. ఎరువులపై స్వావలంబన దిశగా ఇది పెద్ద ముందడుగుగా ప్రధాని పేర్కొన్నారు. ఎరువుల సహకార సంఘం ఇఫ్కో 2021లో నానో లిక్విడ్ యూరియాను ప్రవేశపెట్టింది.

### మహిళల కోసం 'లాడ్లి బెహనా' యోజన

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా లాడ్లి బెహనా(ప్రియమైన సోదరి) పథకాన్ని ప్రకటించింది. భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రి 'లాడ్లి బెహనా యోజన' ఫలకాన్ని ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. పథకం కింద ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.వెయ్యి అందజేస్తుంది. ఇందుకు అర్హులుగా.. ఆదాయ పన్ను చెల్లించని, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉండే వారు, తదితర కేటగిరీలను నిర్ణయించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ఈ పథకంతో లబ్ధి కలుగనుంది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.8 వేల కోట్లను కేటాయించారు. మార్చి 15–ఏప్రిల్ 30 తేదీల మధ్య దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## విమానం సీట్లోనే మూత్ర విసర్జన

**న్యూయార్క్–ఢిల్లీ ఫ్లైట్‌లో ఘటన**

న్యూఢిల్లీ: న్యూయార్క్–ఢిల్లీ విమానంలో మత్తులో ఉన్న ప్రయాణికుడు నిద్రలోనే మూత్ర విసర్జన చేసిన మరో ఘటన నమోదైంది. ఈసారి ఓ విద్యార్థి తను కూర్చున్న సీట్లోనే మూత్ర విసర్జన చేయగా, తోటి ప్రయాణికుడి దుస్తులు తడిచిపోయాయి. విమానం ఢిల్లీకి చేరుకున్న వెంటనే పోలీసులు సదరు విద్యార్థిని అదుపులోకి తీసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. న్యూయార్క్–ఢిల్లీ విమానంలో ఓ ప్రయాణికుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ అధికారులు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాన్ ఎఫ్ కెన్నడీ ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరిన ఏఏ292 రకం విమానం శనివారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయానికి రాగానే సీఐఎస్ఎఫ్ అధికారులు ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. అమెరికాలో చదువుకుంటున్న సదరు నిందితుడిని ఢిల్లీలోని డిఫెన్స్‌కాలనీ వాసిగా గుర్తించామని ఢిల్లీ ఎయిర్‌పోర్టు డీసీపీ దేవేశ్ చెప్పారు. అనంతరం అతడిని వదిలి పెట్టామన్నారు. 'విచారణ నివేదికను డీజీసీఏకి అందజేశాం. బాధిత ప్రయాణికుడి నుంచి మాకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు' అని చెప్పారు. నిబంధనల మేరకు చర్యలు తప్పవన్నారు. అయితే, ఫిర్యాదు చేస్తే తన భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని సదరు విద్యార్థి బాధిత ప్రయాణికుడిని వేడుకున్నట్లు తెలుస్తోంది.

## త్రిపురలో సీఎం రేసులో ప్రతిమా బౌమిక్!

అగర్తలా: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ మార్కు దాటి ఎక్కువ స్థానాలను గెలుచుకున్న బీజేపీ కూటమిలో కొత్త సమస్య ఎదురయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏడాదికాలంగా ముఖ్యమంత్రిగా ఉన్న మాణిక్ సాహాకు పోటీగా కేంద్ర సహాయ మహిళా మంత్రి ప్రతిమా బౌమిక్‌ను సీఎం రేసులో నిలపాలని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ దేవ్ భావిస్తుండటమే ఇందుకు కారణం. సీఎం అభ్యర్థిగా ఒక్కరినే ఎన్నుకునేలా, ఏకగ్రీవం కోసం ఒప్పించేందుకు ఈశాన్యభారతంలో బీజేపీ సమస్యల పరిష్కర్త, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. బిప్లవ్ వర్గాన్ని శాంతింపజేసేందుకు ప్రతిమా బౌమిక్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు శేఖర్ దత్తా అభిప్రాయపడ్డారు. 60 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ 32 చోట్ల, దాని కూటమి పార్టీ ఐపీఎఫ్‌టీ ఒక చోట విజయం సాధించిన విషయం తెల్సిందే. మరోవైపు మార్చి ఎనిమిదో తేదీన కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరుకానున్నారు. త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాల ఏర్పాటుపై బీజేపీ అగ్రనేత అమిత్ షాతో అస్సాం సీఎం హిమంత భేటీ అయ్యారు. భేటీలో నాగాలాండ్ సీఎం నేపియూ రియో సైతం పాల్గొన్నారు.

## మరింత శక్తివంతంగా చైనా సైన్యం

బీజింగ్: భారత్, తైవాన్‌లతో కయ్యానికి కాలు దువ్వుతున్న చైనా తన సైనిక శక్తిని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకుంది. అందులోభాగంగా రక్షణ బడ్జెట్‌ను వరసగా ఎనిమిదోసారి పెంచింది. దీంతో చైనా రక్షణ బడ్జెట్ గత ఏడాదితో పోలిస్తే 7.2 శాతం ఎగసి 1.55 ట్రిలియన్ యువాన్‌లకు చేరుకుంది. గత ఏడాది 1.45 ట్రిలియన్ యువాన్లు కేటాయించింది. డాలర్లలో చూస్తే గత కేటాయింపులు 230 బిలియన్ డాలర్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈసారి డాలర్‌తో యువాన్ మారకం విలువ తగ్గడంతో కేటాయింపులు గతంతో పోలిస్తే కాస్త తక్కువగా 225 బిలియన్ డాలర్లుగా నమోదవడం గమనార్హం. బడ్జెట్ వివరాలను ఆదివారం దేశ పార్లమెంట్(నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్–ఎన్‌సీపీ)లో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆ దేశ ప్రధాని లీ కెక్వియాంగ్ సరిహద్దులో సైన్యం విజయాలను గుర్తుచేశారు. ' సరిహద్దుల్లో ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. సరిహద్దు రక్షణ, ప్రాదేశిక సముద్ర జలాలపై హక్కుల పరిరక్షణ, కోవిడ్ సంక్షోభం వంటి వాటిని విజయవంతంగా ఎదుర్కొన్నాం' అంటూ పరోక్షంగా తూర్పు లద్దాఖ్‌ను ప్రస్తావించారు. ' పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ శతాబ్ది ఉత్సవాల నాటికి పెట్టుకున్న లక్ష్యాలను పూర్తిచేసేలా సైనిక చర్యలను చేపట్టాలి' అని ఆర్మీనుద్దేశించి అన్నారు. దక్షిణ, తూర్పు సముద్ర జల్లాలపై పూర్తి హక్కులు తమకే దక్కుతాయని వాదిస్తూ పొరుగు దేశాలతో చైనా ఘర్షణలకు దిగడం తెల్సిందే. వియత్నాం, మలేసియా, ఫిలిప్పీన్స్, తైవాన్, జపాన్‌లతో చైనా తగవులకు దిగుతోంది. ఈ ఆర్థికసంవత్సరంలో భారత రక్షణ బడ్జెట్ కేటాయింపులు 72 బిలియన్ డాలర్లుకావడం గమనార్హం.

## మళ్లీ యెడ్డీ వైపే బీజేపీ మొగ్గు

- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారకర్తగా ముందుంచే అవకాశం
- మరో ప్రత్యామ్నాయం లేకనే అంటున్న విశ్లేషకులు



బెంగళూరు: కర్ణాటకలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి యెడియూరప్పపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఎన్నికల ప్రచార బాధ్యతలను ప్రధాని మోదీతోపాటు యడియూరప్ప సారథ్యం వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయబోనంటూ ఇప్పటికే ప్రకటించిన యెడియూరప్పను మళ్లీ క్రియాశీలకంగా మార్చేందుకు కమలనాథులు ప్రయత్నాలు ప్రారంభించారు. అట్టడుగు స్థాయి నుంచి పార్టీని విస్తరించి, నాలుగు పర్యాయాలు సీఎం పీఠం అధిరోహించిన నేతగా ఆయనపై ఇప్పటికీ ప్రజాభిమానం చెక్కుచెదరలేదు. మరీ ముఖ్యంగా లింగాయత్ కులస్తుల్లో80 ఏళ్ల ఈ వృద్ధ నేతకున్న పలుకుబడి మరే ఇతర రాజకీయ పార్టీ నేతకూ లేదు. ఈ విషయాన్ని గ్రహించే ఆయన కేంద్ర నాయకత్వం రానున్న ఎన్నికల్లో ఆయన్ను 'పోస్టర్ బాయ్'గా ఉంచి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రణాళికలు వేస్తోంది. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో జరిగిన పలు బహిరంగ సభలు, సమావేశాల్లో ప్రధాని మోదీతో పాటు హోం మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ యెడియూరప్పపై ప్రశంసలు కురిపించడం వెనుక కారణం ఇదే. ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడం, లింగాయత్ ఓటు బ్యాంకును పదిలం చేసుకోవడంతోపాటు ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష కాంగ్రెస్‌ను కట్టడి చేసేందుకు సైతం యెడియూరప్ప అవసరం ఎంతో ఉందని రాజకీయ పరిశీలకులతోపాటు కాషాయ వర్గాలు సైతం అంటున్నాయి. రాష్ట్ర బీజేపీకి మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఇష్టం లేకున్నా యెడియూరప్పనే ప్రచారంలో ముందుంచేందుకు బీజేపీ అధిష్టానం సిద్ధమవుతోందని అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీకి చెందిన రాజకీయ విశ్లేషకుడు ఎ.నారాయణ చెప్పారు.

# సాక్షి కరీంనగర్

సోమవారం । 6 । మార్చి । 2023





**శరణు శరణు రాజన్న**
వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడె మొక్కు, అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాల మొక్కులు చెల్లించుకున్నారు.



**కొండపై ప్రముఖులు**
కొండగట్టు : కరీంనగర్ సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి వాణి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
36.0/19.0

**వాతావరణం**
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

# టైఫాయిడ్.. చికెన్‌పాక్స్!

## జిల్లావ్యాప్తంగా చిన్నారులపై జ్వరాల పంజా

కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన ఎనిమిదేళ్ల అయాన్ గతవారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు రమేశ్‌–రాధ నాలుగు రోజుల క్రితం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి టైఫాయిడ్‌గా నిర్ధారించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. జ్వరం కంట్రోల్‌లో ఉంది. దగ్గు, జలుబు తగ్గడం లేదు.

నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన ఐదేళ్ల రాజేశ్‌కుమార్‌కు మొదట తలనొప్పి ప్రారంభమై జ్వరం వచ్చింది. రెండు రోజులైనా తగ్గకపోవడంతో బాబు తల్లి శారద ప్రభుత్వాసుపత్రిలో ఓపీ విభాగంలో చూపించింది. అయితే వైద్యుల సూచన మేరకు ఇన్‌పేషెంట్‌గా చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

జ్వరం, వాంతులు, విరోచనాలు కావడంతో హౌజింగ్‌బోర్డుకాలనీకి చెందిన ఏడేళ్ల మౌనికను ఆమె తల్లిదండ్రులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వాతావరణ ప్రభావంతో పాటు కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల కూడా ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని వైద్యులు తెలిపారు.

- దగ్గు, జలుబుతో సతమతం
- పెరుగుతున్న చికెన్‌పాక్స్ కేసులు
- కిటకిటలాడుతున్న పిల్లల ఆస్పత్రులు
- 'ప్రయివేటు'లో ఆర్థిక దోపిడీ

కరీంనగర్‌టౌన్: జిల్లాలో చిన్నారులపై సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ప్రధానంగా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌పాక్స్, శ్వాసకోశ వ్యాధులు, డయేరియా కేసులు రెట్టింపు అవుతున్నాయి. ఫిబ్రవరి రెండోవారం నుంచి సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయని, వాతావరణ మార్పులతో పిల్లలు విషజ్వరాల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు దోమలు విజృంభిస్తుండడంతో సమస్య ఏర్పడుతోందని ప్రజలు భయపడుతున్నారు. పొద్దంతా కుట్టే దోమలతో డెంగీ, రాత్రిపూట కుట్టే దోమలతో టైఫాయిడ్, మలేరియా జ్వరాలు వస్తున్నాయి. దగ్గు, జలుబు సమస్య పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తోంది. వైరల్ జ్వరం నాలుగైదు రోజుల్లో తగ్గుముఖం పడుతున్నా.. దగ్గు, జలుబు మాత్రం రెండు వారాలకుపైగా తీవ్రత చూపిస్తోంది.

**కిటకిటలాడుతున్న ఆస్పత్రులు**

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేటు ఆస్పత్రులు సైతం జ్వరాలతో వచ్చే పిల్లలతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా ఏడేళ్ల లోపు పిల్లలు జ్వరాల బారిన పడుతుండడంతో తల్లిదండ్రులు ఆస్పత్రులకు పరుగుతీస్తున్నారు.
- జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం 30మందికి పైగా చిన్నారులు చికిత్స పొందుతున్నారు. అందరూ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ప్రస్తుతం దోమలు విజృంభిస్తుండడంతో టైఫాయిడ్ విజృంభిస్తోందని వైద్యులు చెబుతున్నారు.
- చిన్న పిల్లలు ఎక్కువగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, జలుబుతో బాధపడుతున్నారు. గత పదిహేను రోజులుగా ఏ ప్రయివేటు ఆస్పత్రి చూసినా.. నిత్యం100కు పైగా ఓపీలు నమోదు అవుతున్నాయి.
- చిన్న పిల్లలను ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తే నిర్వాహకులు అవసరం ఉన్నా లేకున్నా రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ ఉంచుకుని వేలల్లో వసూలు చేస్తున్నారు. అడ్డగోలుగా మందులు రాస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.
- ఇటీవలి పిల్లలను చికెన్‌పాక్స్ ఎక్కువగా వేధిస్తోంది. వాతావరణంలో మార్పులే చికెన్‌పాక్స్ రావడానికి కారణమని, తల్లిదండ్రులు పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

**జిల్లాలోని ఆస్పత్రుల్లో చిన్నారుల వివరాలు (సుమారుగా)**

| | |
|---|---|
| జిల్లా ఆస్పత్రిలో ప్రతీరోజు ఓపీ: | 700 |
| అందులో చిన్నపిల్లల ఓపీ: | 150 |
| సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు: | 34 |
| ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రతీరోజు ఓపీ: | 1,500 |
| ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారులు: | 450 |

### జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుతం విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, శ్వాసకోశవ్యాధులు, డయేరియా కేసులు నిత్యం వస్తున్నాయి. ఈనెల రోజుల్లోనే ఈ కేసులు అధికంగా వచ్చాయి. సరైన సమయంలో ఆస్పత్రికి వచ్చే పిల్లలు త్వరగా రికవరీ అవుతున్నారు. ఆలస్యంగా వచ్చే వారికి కూడా ప్రాణంభయం ఏమీ లేదు. నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే డాక్టర్లను సంప్రదించాలి.

– డాక్టర్ అజయ్‌కుమార్, ప్రభుత్వాసుపత్రి పిల్లల వైద్యుడు

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంటి చుట్టూ మురికి నీరు నిలిచి ఉండకుండా చూడాలని, కొత్తగా ఇండ్ల నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో దోమలను అరికట్టాలని సూచిస్తున్నారు.

## న్యూస్‌రీల్

### ఎమ్మెల్యే రసమయి బాగోతం బయటపెడతా



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బాగోతాన్ని అన్ని ఆధారాలతో బయటపెడతానని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ హెచ్చరించారు. మండలకేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ.. మానకొండూర్‌లో నిర్వహించిన రేవంత్‌రెడ్డి సభకు వేలాదిమంది తరలిరావడంతో మతిపోయిన రసమయి ఏం మాట్లాడుతున్నాడో తనకే అర్థంకావడం కావడం లేదని అన్నారు. మన్నెంపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడం తమరూటు మ్యాప్‌లో లేదని, అంబేద్కర్ గురించి మాట్లాడేముందు అల్గునూర్‌లో అంబేద్కర్ విగ్రహం గల్లీలో ఎందుకుపెట్టారని ప్రశ్నించారు. తిమ్మాపూర్ బస్టాండ్ వద్ద అంబేద్కర్, పూలే విగ్రహాలకు ముసుగు ఎన్నడు తొలగిస్తారని ప్రశ్నించారు. గోచీ, గొంగలితో వచ్చానని చెబుతున్న రసమయి బాలకిషన్ ఫాంహౌస్, 30ఎకరాల భూమి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఎల్‌గౌడ్, ఎల్కపల్లి సంపత్‌గౌడ్, ఎంపీటీసీ సంపత్, రామిడి తిరుమల్‌రెడ్డి, గసికంటి సంపత్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

### 10న నిరసన దీక్ష



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్: రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 10న జిల్లావ్యాప్తంగా అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు లక్ష రూపాయల పంట రుణమాఫీ వెంటనే చేయాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని చేపట్టే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్, జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, రవీందర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, శివారెడ్డి, మోహన్, శ్రీనివాస్, దేవేందర్, పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో దృఢత్వం పెరుగుతుంది



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంటలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ ఆధ్వర్యంలో ఖేలో కరీంనగర్ పోస్టర్ అవిష్కరించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధి హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో ఈనెల 10వ తేదీ నుంచి పోటీలు ఉంటాయని అన్నారు. రన్నింగ్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్,లాంగ్‌జంప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెన్నమాధవనేని నరసింహరాజు, మాడ గౌతంరెడ్డి, శీలం శ్రీనివాస్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, అకుల రాజేందర్, పల్లపు రవి, దొంతుల రాజ్‌కుమార్, శ్రీనివాస్, అప్పం మధుయాదవ్,ఇటుకాల స్వరూప, గ రైపల్లి నిరుపరాణితోపాటు పాల్గొన్నారు.

### నేటి కంటివెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో సోమవారం 48 ప్రాంతాల్లో కంటివెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో జువేరియా తెలిపారు. కరీంనగర్ పట్టణంలో, హుజూరాబాద్ 8,14 వార్డుల్లో, ధర్మరాజుపల్లి, కనుకులగిద్ద గ్రామాలు, జమ్మికుంటలోని 8, 29 వార్డులు, తనుగుల, వీణవంక మండలం మామిడాలపల్లి, శ్రీరాములపేట, బేతికల్, చిగురుమామిడి మండలం రేకొండ, ముదిమాణిక్యం, చొప్పదండిలోని వార్డునంబరు 9, వెదురుగట్టు, గుమ్లాపూర్, ఇల్లందకుంట మండలం రాచపల్లి, లక్ష్మాజిపల్లిలో శిబిరాలు ఉంటాయి. గంగాధర మండలం గర్శకుర్తి, నారాయణపూర్, కురిక్యాల, రామడుగు మండలం కొరటపల్లి, కొక్కెరకుంట, కొత్తపల్లి పట్టణంలోని 6వ వార్డు, బొమ్మకల్, చర్లబూత్కూర్, గోపాల్‌పూర్ , మానకొండూర్, కొండపల్కల, పచ్చునూర్, తదితర గ్రామాల్లో నిర్వహిస్తారు.

### మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



విద్యానగర్(కరీంనగర్):మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో తెలంగాణ సామాజిక రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ మాట్లాడుతూ.. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని అన్నారు. అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణించాలని సూచించారు. విమర్శకుడు, కవి, రచయిత వడ్డేపల్లి కృష్ణ, హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ, తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి, కవి, రచయిత అన్నవరం దేవేందర్, కామిడి సతీశ్‌రెడ్డి, పసుల స్వామి, బాలసాని కొమురయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా సీఓఈ సెట్

తిమ్మాపూర్: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన సీవోఈ సెట్ – 2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గౌలిదొడ్డి, అల్గునూర్‌లోని సీవోఈ, రుక్మాపూర్ సైనిక్ తో పాటు జిల్లాలోని సిఓఈ కళాశాలలో ప్రవేశాల కోసం జిల్లాలోని అల్గునూర్ సీవోఈతోపాటు రుక్మాపూర్, చింతకుంట, దేవంపల్లి పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,456 మంది విద్యార్థులు పరీక్షరాయాల్సి ఉండగా, 1,384 మంది హాజరయ్యారు. ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీలో ప్రవేశాల కోసం ఈ ఎంట్రన్స్ నిర్వహించారు.

### అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షలు..

కరీంనగర్: టీఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా అదనపు కలెక్టర్ జి.వి శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. ఉదయం 7426 మంది అభ్యర్థులకు గాను 5873 అభ్యర్థులు, మధ్యాహ్నం పరీక్షకు 5861 మంది అభ్యర్థులు హాజరైనట్లు అదనపు కలెక్టర్ వివరించారు.

# అధికారంలోకి రాగానే సూరమ్మ ప్రాజెక్టు పనులు

- ఇక్కడే కుర్చీలేసుకొని కూర్చుండి పూర్తి చేస్తాం
- నాడు ఓట్ల కోసం పనులు ప్రారంభించిన హరీశ్‌రావు, రమేశ్‌బాబు
- గెలిచిన తర్వాత తట్టెడు మట్టి తీయలే..
- కేసీఆర్ పాలనలో బంధువులు, తెలంగాణ ద్రోహులకే పదవులు
- హాథ్ సే హాథ్ జోడోయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



పాదయాత్రలో రేవంత్, కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి(వేములవాడ):కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సూరమ్మ ప్రాజెక్టు వద్ద కుర్చీలేసుకొని కూర్చుండి పనులు పూర్తి చేస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తెలిపారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో నిలిచిపోయిన సూరమ్మ ప్రాజెక్టు పనులను ఆదివారం పరిశీలించారు. 2018 ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు ఆగమేఘాల మీద అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సూరమ్మ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, గెలిచాక తట్టెడు మట్టి కూడా తీయలేదని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబం, బంధువులు, తెలంగాణ ద్రోహులకే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి పదవులు వచ్చాయన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరిగేలా చూడాలని కోరారు. సూరమ్మ చెరువు సందర్శనకు వచ్చిన రేవంత్‌రెడ్డికి గంగపుత్రులు కొర్రమీను, చేపల బుట్టను అందించారు. అంతకముందు రేవంత్ రెడ్డి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు తీపిరెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు, జగిత్యాల జిల్లా కథలాపూర్, మేడిపెల్లి మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిరుపేదలకు ఇళ్లు**

వేములవాడఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు వేములవాడ మండలం రుద్రవరం–సంకెపల్లి గ్రామాల నుంచి ప్రారంభమైన యాత్ర అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా, తిప్పాపూర్ మీదుగా వేములవాడ రాజన్న ఆలయం వరకు కొనసాగింది.

**సమస్యలు తెలుసుకుంటూ..**

వేములవాడ మండలం అనుపురం శివారులో సంచార కుటుంబాల సమస్యలను రేవంత్‌రెడ్డి తెలుసుకున్నారు. ఇండ్లు లేవని వారు చెప్పడంతో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కట్టిస్తామని తెలిపారు. నాంపల్లి గ్రామంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు వినతిపత్రం అందించారు. కాగా అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా గ్రామాల్లోని మిడ్ మానేరు ముంపుగ్రామాల నిర్వాసితులు రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. తమకు పూర్తిగా నష్టపరిహారం అందలేదని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని, రూ.5.04 లక్షలతో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో 23 వేల మంది వీఆర్‌ఏలకు పేస్కేలు, పదోన్నతి, 55 ఏళ్లు నిండిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

**చింతాల్‌ఠాణాలో టీ..**

పాదయాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి చింతాల్‌ఠాణాలో పొత్తూరి దేవయ్య ఇంట్లో టీ తాగారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఏం అభివృద్ధి జరిగింది, మీకు ఏం న్యాయం జరిగింది.. ముంపు గ్రామాల్లో సమస్యలు ఏమన్నా ఉన్నాయా అని అడుగగా.. 'అయ్యా.. మంచిగా ఉన్న ఊరిలో ప్రాజెక్టు కట్టి ఇండ్లను తీసుకువచ్చి ఈ సీసీరోడ్ల మీద వేసింద్రు. ఇప్పటికీ పూర్తి పరిహారం రాలేదు' అని వాపోయారు. అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని బాధితులకు తెలిపారు.

**కాంగ్రెస్‌లో చేరిక**

వేములవాడ అర్బన్ మండలం అనుపురం మాజీ సర్పంచ్ ఎర్రం రాజు, రుద్రవరం సింగ్‌విండో మాజీ చైర్మన్ చింతపల్లి శ్రీనివాసరావు, ఎర్రం సత్తయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరగా రేవంత్‌రెడ్డి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి తమ వంతు బాధ్యతగా పని చేయాలని సూచించారు.

**రాజన్నకు కోడె మొక్కులు..**

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రేవంత్ వెంట పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి

- ఉమెన్స్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ స్కిల్స్ సదస్సులో కలెక్టర్ ఆర్వీ కర్ణన్



మహిళా వ్యాపారవేత్తలను సన్మానిస్తున్న కలెక్టర్

కరీంనగర్: మహిళలు వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సూచించారు. జ్యోతిబాపూలే పార్కులో ఆదివారం మెప్మా, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వ్యాపారస్థాపన కోసం మహిళలకు కావలసిన నైపుణ్యాల గురించి నిర్వహించిన సదస్సులో ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందారని అన్నారు. జిల్లాలో 2లక్షల మందికి పైగా మహిళా సంఘాల సభ్యులుగా చురుకైన మహిళలు ఉన్నారని, ఈ సంవత్సరం బ్యాంకు లింకేజీ ద్వారా రూ.750 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, చిన్నచిన్న వ్యాపారాల రూపాల్లో ఉపయోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర మహిళాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న మహిళా ప్రాంగణంలో సైతం నైపుణ్యాల అభివృద్ధి కోసం శిక్షణ ఇస్తున్నారని, వినియోగించుకోవాలని అన్నారు. మహిళలు సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ వ్యాపారాలు నిర్వహించుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ మహిళలకు అందుబాటులో ప్రభుత్వ సొమ్ము ఎంతో ఉందని, వాటిని బ్యాంకు లింకేజీ పీఎంఈజీపీ, పీఎం ఎఫ్‌ఎంఈ, దళితబంధు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పథకాల ద్వారా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వ్యాపారంలో విజయవంతంగా కొనసాగుతున్న 20మంది మహిళా వ్యాపారులను సన్మానించారు. మహిళా కమిషన్ సభ్యులు కటారి రేవతి, సూదం లక్ష్మి, మెప్మా పీడీ రవీందర్, డీఆర్‌డీవో శ్రీలత, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నవీన్, డీడబ్ల్యూవో సబిత, వీహబ్ ప్రతినిధులు ఊహ, అన్నపూర్ణ, స్వాతి పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ప్రమాదం.. జిల్లాలో విషాదం

- కారును వెనుకనుంచి ఢీకొన్న కంటైనర్
- అక్కడికక్కడే ఇద్దరి మృతి
- దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కామారెడ్డి సమీపంలో ఘటన
- పెద్దదిక్కును కోల్పోయిన రెండు కుటుంబాలు



మహోదర్‌రావు(ఫైల్)



మధుసూదన్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్‌క్రైం/రామడుగు(చొప్పదండి): స్నేహితులందరూ అప్పటివరకు ఆహ్లాదంగా గడిపారు. దైవదర్శనం పూర్తి చేసుకుని ఇంటికి తిరుగు పయనమయ్యారు. మూత్ర విసర్జన కోసమని కారు దిగుతున్న వారిని వెనుకనుంచి వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదం కామారెడ్డి శివారులో ఆదివారం చోటుచేసుకోగా.. జిల్లాకు చెందిన మహోదర్‌రావు(55), మధుసూధన్‌రెడ్డి(58) అక్కడికక్కడే చనిపోవడం వారి కుటుంబాల్లో విషాదం నింపింది. కరీంనగర్‌లోని సీతారాంపూర్‌కాలనీ సాయిబాలాజీనగర్‌లో నివాసముంటున్న మహోదర్‌రావుకు భార్య, స్వర్ణలత, కూతురు, కొడుకు ఉన్నారు. ఇటీవలే కూతురు వివాహం చేశారు. ప్రస్తుతం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మెడికల్ షాపు నిర్వహణ చూసుకుంటున్నారు. మహోదర్‌రావు ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి దూరం బంధువు అని తెలిసింది. సీతారాంపూర్‌కాలనీలోని మహోదర్‌రావు ఇంటివద్ద బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రుద్రారం గ్రామానికి చెందిన లక్కాడి మధుసూదన్‌రెడ్డి కరీంనగర్‌లో డ్రైఫ్రూ ట్స్ వ్యాపారం చేస్తున్నారు. ఏడాది క్రితమే రు ద్రారం గ్రామంలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. మధుసూదన్‌రెడ్డికి భార్య గంగా, కూమారులు సందీప్, రిషీ ఉన్నారు. సందీప్ ఫ్రూట్స్ వ్యాపారం, రిషీ ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నారు.

**స్నేహితులతో కలిసి దైవదర్శనానికి వెళ్లి..**

జిల్లాకు చెందిన మహోదర్‌రావు, మధుసూధన్‌రెడ్డి నలుగురు స్నేహితులతో కలిసి కారులో కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్‌లో ఉన్న తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానానికి దర్శనం కోసం వెళ్లారు. మొక్కులు చెల్లించుకుని కరీంనగర్‌కు తిరుగుపయనమయ్యారు. కామారెడ్డి శివారులో మూత్రవిసర్జన కోసమని రోడ్డుపక్కన ఆపిన కారును కంటైనర్ ఢీకొట్టింది. కారు వెనక సీట్లో కూర్చున్న మహోదర్‌రావు, మధుసూధన్‌రెడ్డి అక్కడికక్కడే మరణించారు. ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసరెడ్డి గాయపడ్డారు. కారు నడిపిన రామకృష్ణరావు ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

# దేశంలో అసమానతలు పెరిగిపోతున్నాయి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

కరీంనగర్: కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ తీరుతో దేశంలో అసమానతలు పెరిగిపోతున్నాయని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ముకుందలాల్ మిశ్రా భవన్లో సీపీఎం పార్టీ కరీంనగర్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం గీట్లముకుంద రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ గుప్పెడు మంది పెట్టుబడిదారులకు, కొంతమంది కార్పొరేట్లకు బీజేపీ కొమ్ము కాస్తోందని ఆరోపించారు. దేశంలో సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు వ్యక్తులకు ధారదత్తం చేస్తూ దేశంలోని సహజ వనరులను లూటీ చేస్తున్నారని అన్నారు. నిత్యవసర వస్తువులు పెట్రోల్ డీజిల్, గ్యాస్, ధరలు పెరుగుతున్నాయన్నారు. నిరుద్యోగం పెరిగిపోయి పారిశ్రామికరంగం సంక్షోభంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు తగ్గాయని తెలిపారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జే.వెంకటేశ్ మాట్లాడుతూ... సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ నుంచి జన చైతన్య యాత్ర 33 జిల్లాల్లో కొనసాగుతుందన్నారు. మార్చి 29 హైదరాబాద్‌లో ముగింపు సభ ఉంటుందని తెలిపారు. ఈనెల 26వ తేదీన బస్సు యాత్ర జిల్లాకి వస్తుందని, జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకులు కూరపాటి రమేశ్, జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, ఎడ్ల రమేశ్, శ్రీనివాస్, అశోక్, నరేశ్‌పటేల్, రాజేశం పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 'దాస్యం'కు పురస్కారం



జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

కరీంనగర్‌టౌన్: ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి అమృతలత జీవన సాఫల్య పురస్కారాన్ని ఆదివారం నిజామాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, అమృతలత చేతుల మీదుగా కరీంనగర్‌కు చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతికి అందించారు. సాహితీ విమర్శ రంగంలో సేనాధిపతి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు అమృతలత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాధేయ, ఆచార్య చెన్నప్ప, సాహితీవేత్తలు సింహప్రసాద్, మాధవీలత, గంప ఉమాపతి, శ్యాంసుందర్, కలాగోపాల్, త్రివేణి, రమ పాల్గొన్నారు.

### ఆరోపణలు మానుకోవాలి'



సదానందం

రామగిరి: మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై జెడ్పీ చైర్మన్ పుట్టమధు అసత్యపు ఆరోపణలు మానుకోవాలని మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం హితవు పలికారు. ముత్తారం మండలం కేశనపల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. గత పాలకుల హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని మధు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మోడల్ స్కూల్, కేజీబీవీ, జూనియర్ కళాశాల, టూటీఎంసీ రిజర్వాయర్ ఎప్పుడు పూర్తయ్యాయో గుర్తుచేసుకోవాలని సూచించారు. జేఎన్టీయూ, హార్టికల్చర్ పాలిటెక్నిక్, కేవీకే ఏర్పాటు చేసింది శ్రీధర్‌బాబేనని పేర్కొన్నారు. కుమార్, శ్రీనివాస్, బక్కతట్ల కుమార్, సాతిని రాకేశ్, బుర్ర రవీందర్, మొగిలి, సమ్మయ్య, పాల్గొన్నారు.

### 'ఎంపీపీ దంపతులు శ్రీధర్‌బాబు కీలుబొమ్మలు'



మాట్లాడుతున్న నాయకులు

రామగిరి(మంథని): రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఆమె భర్త కొమురయ్య ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆడిస్తున్న కీలుబొమ్మలని జెడ్పీటీసీ మ్యాదరవేణి శారద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేసి రవీందర్ అన్నారు. సెంటినరీకాలనీలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పుట్టమధుకు ప్రజల్లో ఉన్న ఆదరాభిమానాలను చూసి కుటిలయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీగా ఎన్నికైనప్పటినుంచి దేవక్క దంపతులు తామే రాజులం, తామే మంత్రులం అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారి అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. వారి స్వగ్రామంలోనే ఓ వికలాంగుడి భూమి కబ్జా చేశారని, ఓ ఇంటినీ ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఎంపీపీ దంపతులు మంచివారైతే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎందుకు సహకరించడం లేదో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఎంపీపీ దంపతులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడిని కోరుతున్నట్లు వివరించారు. వైస్‌ఎంపీపీ శ్రీదేవి, మండల మహిళా అధ్యక్షురాలు భూక్య ఆశాకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

# నిలిచిన 'చదువు'కు బాటలు

- రెగ్యూలర్ విద్యార్థులతో సమానంగా అర్హత, సర్టిఫికెట్లు అందజేత
- 10 వ తరగతి, ఇంటర్ చదువులకు అవకాశం
- సంత్సరంలో 30 రోజులు ప్రతి అదివారం, సెలవు దినాలలో తరగతులు
- నామ మాత్రం ఫీజు, పుస్తకాల అందజేత
- తెలంగాణ ఓపెన్ స్కూల్ సిస్టమ్‌తో బోధన



జమ్మికుంటలో ఓపెన్ స్కూల్ తరగతుల నిర్వహణ

జమ్మికుంట: చదువు కోవాలనే అసక్తి ఉన్నవారికి ఓపెన్ స్కూల్ సిస్టమ్ సదావకాశంగా మారింది. మధ్యలో చదువు మానేసి, కుటుంబం, అనుకోని కారణాలతో చదువు మానేసిన వారికి వరంలా మారింది. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తూ, చక్కటి విద్యను అందుబాటులోకి తెచ్చింది. ఇంటి వద్ద సమయం చిక్కినప్పుడల్లా చదువు కోనసాగించి, ఉన్నత చదువులు, కొలువుల సాధనకు బాటలు వేసుకునేందుకు ఇదీ సదావకాశం. కొన్ని కారణాలతో దూరమైన స్త్రీ, పురుషులు, పదోన్నతులు పొందేవారు జమ్మికుంటకు ఇతర జిల్లా, మండలాలకు చెందిన అభ్యాసకులు తరగతులకు హాజరై నిలిచిన చదువులకు బాటలు వేస్తూ, చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు.

### అందరికీ.. అందుబాటులో విద్య..

తెలంగాణ ఓపెన్ స్కూల్ సిస్టంలో అందరికీ విద్య అందుబాటులోకి విద్య అనే సుత్రాన్ని అనుసరిస్తోంది. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఆసక్తి కలిగి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల పొందాలనే వారికోసం రాష్ట్ర ప్రభుత్వం టాస్క్ ద్వారా అడ్మిషన్లు తీసుకుంటుంది. 1991లో అటానమాస్ సొసైటీని ఏర్పాటుచేసి ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) విధానానికి శ్రీకారం చుట్టింది. ఓడీఎల్ విధానంలో కొన్ని మార్పులు చేసి పదో తరగతితోపాటు ఇంటర్ చదువుకు అవకాశం కలిపించారు. ఇంటర్‌లో సైన్, అండ్ ఆర్ట్స్ గ్రూపుల్లో విద్యార్థులు చదువుకోవచ్చని చెబుతున్నారు.

### ఓపెన్ స్కూల్‌లో చేరే విధానం ..

- ఓపెన్ స్కూల్‌లో చేరే విద్యార్థులు నామ మాత్రం అడ్మిషన్ ఫీజు చెల్లించాలి.
- ఫీజు రాయితీ పొందేవారు అభ్యర్థులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ సమర్పించాలి.
- విద్యార్థి కోర్సుకు సంబంధించిన స్టడీ మెటీరియల్ అందిస్తారు.
- విద్యవేత్తలతో స్వతహాగా చదువుకునేందుకు మెటీరియల్ ఉంటుంది
- ప్రభుత్వ మున్సిపాలిటీలు, ఏయిడెడ్, రిజిస్టర్డ్ విద్యాసంస్థల్లో సెలవు దినాల్లో బోధన ఉంటుంది.
- ఏడాదిలో 30 తరగతుల నిర్వహణ, 24 తరగతులకు తప్పని సరి హాజరుతో పరీక్షకు అర్హత
- రెండో శనివారం, ప్రతీ ఆదివారం, పండగ సెలవు దినాల్లో తరగతుల నిర్వహణ

### పరీక్ష విధానం ..

రెగ్యూలర్ విద్యార్థులతో సమానంగా వేసవి సెలవుల్లో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పరీక్షల నిర్వహణ ఉంటుంది.

- పదో తరగతిలో 5 సబ్జెక్టులు, ఇంటర్ కోర్సు అనుసరించి, రెండేళ్ల సబ్జెక్టుల్లో పరీక్షలు రాయాల్సి ఉంటుంది.
- ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్ల అందిస్తారు.
- ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది.
- ఒక్కసారి అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఐదేళ్ల 9 సార్ల పరీక్షలు రాయొచ్చని నిబంధనలు ఉన్నాయి.

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కేంద్రాల నిర్వహణ**

| | |
|---|---|
| ఎస్ఎస్‌సీ (10 వ తరగతి) | - 46 |
| ఇంటర్ ఆర్ట్స్ గ్రూపు | - 52 |
| ఇంటర్ సైన్ గ్రూపు | - 09 |

**ఉమ్మడి జిల్లాల వారిగా ఎస్ఎస్‌సీ,ఆర్ట్స్ సైన్స్ అభ్యసకుల సంఖ్య**

| | |
|---|---|
| కరీంనగర్ | - 1381 |
| సిరిసిల్ల | - 855 |
| జగిత్యాల | - 1092 |
| పెద్దపల్లి | - 1170 అభ్యసకులు |

తరగతులకు హాజరౌతున్నారని అధికారులు తెలిపారు.

### ఉద్యోగం సాధించాలనే తపనతో..



కుటుంబంలో కొన్ని కారణాలతో 9వ తరగతిలో చదువు మానేశాను. మా తల్లితండ్రులు పెళ్లిచేశారు. ఇద్దరు పిల్లలు. చదువుకోవాలనే ఉద్దేశంతో పదోతరగతి ఓపెన్ స్కూల్‌లో పరీక్షలు రాసి పాసయ్యాను. ప్రస్తుతం ఇంటర్ ఫస్ట్‌యర్ చదువుతున్నాను. డిగ్రీ వరకు చదివి ఉద్యోగసాధించాలని పట్టుదలతో ఉన్నాను.

– అంగిడి అపర్ణ, బుర్నపల్లి, టేకుమట్ల, జయశంకర్ భూపాలపల్లి

### వారసత్వ ఉద్యోగం పొందాను



నేను కుటుంబ కారణాలతో మధ్యలో చదువు మానేశాను. మా నాన్న పోస్టాఫీస్‌లో జేడీఎంసీ ఉద్యోగం చేస్తుండేవారు. మా తండ్రి హఠాన్మరణం చెందగా నాకు వారసత్వ ఉద్యోగం రావాల్సి ఉంది. అందుకు పదో తరగతి చదివి ఉండాలన్నారు. దీంతో ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి చదివి పరీక్షలు రాసి పాసయ్యాను మా తండ్రి ఉద్యోగం నాకు వచ్చింది. ప్రస్తుతం ఉట్నూరులో పోస్టాఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నాను. – రాసమల్ల సంపత్ , జమ్మికుంట

### చదువు మానేసిన వారికి సదావకాశం



రాష్ట్ర సంచాలకుల ఆదేశాలతో జిల్లాలో ఓపెన్ స్కూల్ తరగతులు ఎక్కువగా నిర్వహిస్తున్నాం. ప్రతీ సెలవు దినాల్లో కేంద్రాలకు విద్యార్థుల హాజరుశాతం, అభ్యాసకులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటుచేస్తూ, చదువుకోవడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. చదువు మానేసిన వారు మీ దగ్గరలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సంప్రదించవచ్చు. – చాలువాజీ నాగేశ్వర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో ఆర్డినేటర్,

### ప్రభుత్వ,ప్రైవేటు ఉద్యోగాలకు అర్హతగా సర్టిఫికెట్లు



ఓపెన్ స్కూల్‌లో చేరిన ప్రతి ఒక్కరూ రెండోశనివారం, ఆదివారాల్లో నిర్వహించే తరగతులకు తప్పక హాజరై విషయ నిపుణులు అందించే విజ్ఞానాన్ని పొందాలి. అసైన్‌మెంట్లు తప్పని సరిగా పూర్తి చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. ఓపెన్ స్కూల్ విద్యతో అర్హతగల అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు సర్టిఫికెట్లు ఉపయోగపడతాయి.

– డి.సుధాకర్, కోఆర్డినేటర్, ఓపెన్ స్కూల్ సెంటర్, జమ్మికుంట

### ఇంటర్ స్టేట్‌లెవల్ ఓపెన్ కరాటే పోటీల్లో ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

మంథని: కాజీపేటలో జరిగిన స్టేట్‌లెవల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మంథనికి చెందిన షోటోఖాన్ కరాటే విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు కరాటే ఇన్‌స్ట్రక్టర్ కోండ్ర నాగరాజు తెలిపారు. కటాస్ విభాగంలో ఎనిమిది గోల్డ్‌మెడల్స్, రెండు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. బీర ఆదిత్య తేజ, వడ్లకొండ శ్రీవిన్య, మిట్ట అశ్విత, తుమ్మల శ్రీ నిధి, బోనాల హారిక, నంద ఐశ్వర్య, ఎన్ అనిరుద్ గోల్డ్ మెడల్స్ సాధించగా, నిక్షిప్త సాయి, గురిజాల గగన్, సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. సేపురి మణిదీప్, బ్రాంజ్ మెడల్ సాధించినట్లు నాగరాజు పేర్కొన్నారు.

### సదాశయ ఫౌండేషన్‌కు ప్రత్యేక పురస్కారం



అవార్డు అందుకుంటున్న శ్రావణ్ కుమార్

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్రవ్యాప్తంగా సదాశయ ఫౌండేషన్ 14 ఏళ్లుగా చేస్తున్న అవయవ, శరీర, నేత్రదానలతో పాటు సామాజిక సేవలను గుర్తించి విజయవాడ వాసవీ క్లబ్, సూపర్ స్టార్, వాసవీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్‌కు విజయవాడ నగర్ మేయర్ ఆదివారం అవార్డును అందించారు. 14 ఏళ్లుగా సదాశయ ఫౌండేషన్ చేస్తున్న అవయవ, శరీర నేత్రాదానాలపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఉచిత వైద్యశిబిరాలు, రక్తదానాలు, అనాథలను చేరదీయడం వంటి అనేక సామాజిక సేవలకు గాను నందిఅవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపిక చేసిన వాసవీ క్లబ్ నిర్వాహకులు లలితకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్ కుమార్, సానా రామకృష్ణ రెడ్డి, లింగమూర్తి, రాజిరెడ్డి, డాక్టర్ భీష్మాచారి, చంద్రమౌళి, వాసు, రాజు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యతో మహిళలకు ఉన్నత స్థానం

- రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: మహిళలు సమాజంలో ఉన్నతంగా ఎదిగేందుకు విద్యేప్రాధాన్యమని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం మార్కండేయ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ఆటల పోటీలు ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు చదువుతోనే చైతన్యవంతులవుతారన్నారు. మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించాలని అప్పుడే స్త్రీకి సమాన హక్కుతో పాటు గౌరవం లభిస్తుందన్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఒంటరి మహిళా ఆసరా పింఛన్లతో పాటు అనేక సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. నియోజకవర్గంలోని మహిళలు ఆర్థికంగా రాణించాలనే లక్ష్యంతో వీహబ్ ద్వారా రూ.కోట్లల్లో రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, నిర్వాహకులు మూల విజయారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి, తానిపర్తి విజయలక్ష్మి, తస్నీంబాను, జనగామ కవిత సరోజని, బాదె అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన ఆటల పోటీలు అలరించాయి.

### గెలుపే లక్ష్యంగా శ్రమించాలి

గోదావరిఖని: రాబోయే గుర్తింపు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు శ్రమించాలని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తన నివాసంలో కోర్‌కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ యూనియన్ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై లోతుగా విశ్లేషించారు. గోదావరిఖనిలో నిర్వహించే మహాసభ విజయవంతంపై కార్యాచరణ రూపొందించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్‌సే హాత్ జోడో యాత్రను అన్నిగనులపై నిర్వహించి విజయవంతం చేయాలని, ఇందుకు కాంగ్రెస్ నేతలను ఆహ్వానించాలని నిర్ణయించారు. సమావేశంలో నాయకులు నర్సింహారెడ్డి, త్యాగరాజన్, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, గుమ్మడి కుమారస్వామి, వంగ లక్ష్మీపతిగౌడ్, జెట్టి శంకర్‌రావు, పసునూటి రాజేందర్, వడ్డెపల్లి దాస్, రాంశెట్టి నరేందర్, వికాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలి



విధుల్లో బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ టెండర్‌ను సెమీస్కిల్డ్ వేతనాలతోనే పిలవాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా ఓసీపీలు, సీహెచ్‌పీలు, అండర్ గ్రౌండ్ మైన్స్‌ల్లో విధులు నిర్వహిస్తున్న బెల్ట్ క్లీనింగ్ కార్మికులకు సెమీస్కిల్ వేతనాలు చెల్లించాలని చాలా ఏళ్లుగా లేబర్ అధికారులతో, సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్న క్రమంలో అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ సింగరేణి యాజమాన్యం ఇప్పటికి అమలు చేయకుండా కార్మికులను శ్రమదోపిడీకి గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు బూట్లు, హెల్మెట్ టెండర్‌లో కోడ్ చేయాలన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బెల్ట్‌క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలతో పాటు బూట్లు, హెల్మెట్(టోపి) అందించే విధంగా టెండర్ పిలవాలని డిమాండ్ చేశారు.

### భూ వివాదంలో బొమ్మకల్ సర్పంచ్‌కు నోటీసులు

కరీంనగర్‌క్రైం: ఓ భూమికి సంబంధించిన కేసులో పోలీసులు నోటీసులు ఇవ్వడానికి వెళ్లగా ఇప్పుడే వస్తానని బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్ పరారైనట్లు సమాచారం. సీఐ విజ్ఞాన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. షాషామహల్‌కు చెందిన సైఫోద్దీన్‌కు సంబంంంంంంధించిన భూమికేసు కోర్టులో నడుస్తోంది. ఈక్రమంలో శ్రీనివాస్‌తో పాటు పలువురు అక్రమంగా భూమిలో ప్రవేశించారని ఇటీవల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు విషయంలో పోలీసుస్టేషన్‌కు రావాలని సూచించగా రాలేదు. దీంతో ఆదివారం విచారణకు హాజరు కావాలని నోటీసులిచ్చేందుకు వెళ్లగా చొక్కా వేసుకుని వస్తానని పరారయ్యాడని ఈ విషయాన్ని కోర్టుకు సూచిస్తామని సీఐ వివరించారు.

### మృత్యువుతో పోరాడి ఓడిన చిన్నారి

రామగిరి(మంథని): ముత్తారం మండలం ఓడేడ్‌కు చెందిన గాయత్రి (17నెలలు) చిన్నారి దాదాపు ఐదు రోజులు మృత్యువుతో పోరాడి తనవు చాలించింది. వివరాల్లోకి వెళితే.. కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లికి చెందిన అపర్ణను పదేళ్ల క్రితం ఓడేడ్‌కు చెందిన నరాల రమేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కూతుళ్లు విష్ణుప్రియ, గాయత్రి. అపర్ణకు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో వరంగల్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి మందులు వాడుతోంది. ఈ క్రమంలో గత నెల 28న ఇంట్లో ఎవరు లేని సమయంలో అపర్ణ(26) తనతో పాటు 17 నెలల కూతురు గాయత్రికి విషమిచ్చి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి చేర్పించగా అదేరోజు చికిత్సపొందుతూ అపర్ణ మృతిచెందింది. గాయత్రి కడుపులోకి విషం వెళ్లడంతో మృత్యుతో పోరాడి మృతిచెందింది.

### రోడ్డు ప్రమాదంలో జూనియర్ అసిస్టెంట్‌కు గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన గురుమూర్తి

రామగిరి(మంథని): రామగిరి మండలం రత్నాపూర్ బస్టాండ్ సమీపంలో మంథని, పెద్దపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొడ్డెళ్ల గురుమూర్తి జూనియర్ అసిస్టెంట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మంథనికి చెందిన గురుమూర్తి సెంటినరీకాలనీ నుంచి మంథని వైపు బైక్‌పై వస్తుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రామగిరి పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్ మల్లన్న సెంటినరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

### 'రక్తనాయక్' అవార్డు అందుకున్న యాదవరాజు




యాదవరాజును మెమెంటోలతో సత్కరిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ


గోదావరిఖనిటౌన్: గోదావరిఖనికి చెందిన ఎస్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిభిరాలు నిర్వహించి, బాధితులకు సేవలందించినందుకు హర్యానా సీఎం మనోహర్ చేతులమీదుగా రక్తనాయక్-2023 అవార్డును అందించారు. కోవిడ్ సమయంలో నిఫా సహకారంతో ఎస్‌వైపీ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించి బాధితులకు నిత్యావసర సరుకులు మాస్కులు, శానిటైజర్లు అందించారు. యాదవరాజు ఆధ్వర్యంలో సరోజాయాదవ్, తేజశ్రీ, కొలగాని శ్రీనివాస్, విద్యాసాగర్, కల్యాణి, కానిస్టేబుల్ కన్నె రాజుకు హర్యానా సీఎం అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హర్యానా రాజ్‌భవన్‌లో వీరిని శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అవార్డు రావడంపై పలు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

### ఎస్సారెస్పీ కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

- బంధువుల ఇంటికి వచ్చిన యువకుడు
- ఈతకొడుతూ గల్లంతైన వైనం
- మరో యువకుడు క్షేమం



గల్లంతైన వ్యక్తి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

మానకొండూర్: బంధువుల ఇంట్లో జరిగే దైవ కార్యక్రమానికి మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి కరీంనగర్‌కు వచ్చిన ఓ యువకుడు ఎస్సారెస్పీ కాలువలో పడి గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మురారి రితికేష్ (23) యువకుడు ఐఐటీ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్ ఖరగ్‌పూర్ నుంచి శనివారం రాత్రి కరీంనగర్‌లో ఉంటున్న తన అమ్మమ్మ, మేనమామల ఇంటికి చేరుకున్నాడు. రాత్రి బంధువుల ఇంట్లో నిర్వహించిన దైవకార్యక్రమంలో (దుర్గమ్మ కొలుపు) పాల్గొన్నాడు. ఉదయాన్నే నిద్రలేచి తన మేనమామ డోలిశ్రీనివాస్, డోలి ప్రసాద్, డోలి బద్రినాత్, డోలి జతిన్‌తో కలిసి మురారి రితికేష్ సరదాగా ఈతకు వెళ్దామని మానకొండూర్ మండలంలోని ఈదులగట్టెపల్లికి కారులో వెళ్లారు. గ్రామ శివారులో కల్లుతాగి సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ ర్యాంపు వద్ద ఈతకొడుతుండగా కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రితికేష్‌తో పాటు, జతిన్ (20) ఇద్దరు నీటిలో కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న శ్రీనివాస్, ప్రసాద్ జతిన్‌ను కాపాడారు. ఇంతలోనే రితికేష్ నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. జతిన్ క్షేమంగా ప్రమాదం నుంచి బయట పడగా రుతికేష్ నీటిలో గల్లంతవడంతో మేనమామలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీఐ రాజ్‌కుమార్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ కాలువ నీటిని నిలిపివేయించి జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రితికేష్ తండ్రి రాజేందర్ పదేళ్లక్రితం మృతిచెందగా, తల్లి భవానీ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఓ చెల్లి కూడా ఉందని సమాచారం.

# రైలుకిందపడి మహిళ మృతి

- ప్రాణాలతో బయటపడ్డ ఏనిమిదేళ్ల బాలుడు
- సింగరేణి రైలులో కిక్కిరిసిన ప్రయాణికులు

ఓడెల: కాజీపేట్ నుంచి బల్లార్షా మధ్య పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో కాల్వశ్రీరాంపూర్ మండల పరిధిలోని ఆరెపల్లి జీపీ అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లెకు చెందిన శ్రీమంతుల భాగ్యమ్మ(55) మహిళ సింగరేణి రైలుకిందపడి ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మల్లయ్యపల్లెకు చెందిన భాగ్యమ్మ తన ఎనిమిదేళ్ల మనవడితో పొత్కపల్లి నుంచి రవీంద్రఖనికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కిక్కిరిసిన ప్రయాణికులతో వచ్చిన రైలులో మనవడితో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీకింద పడడంతో కాళ్లుచేతులు తెగి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. చేతిలో ఉన్న మనవడిని మాత్రం బయటకు నెట్టివేయడంతో ప్లాట్‌ఫాంపై పడి ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పొత్కపల్లి రైల్వేస్టేషన్లో రోదనలు మిన్నంటాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని రామగుండం జీఆర్పీఎఫ్ పోలీసులు సందర్శించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భాగ్యమ్మ మృతి వార్త తెలియడంతో స్వగ్రామైన కాల్వశ్రీరాంపూర్ మండలం మల్లయ్యపల్లెలో విషాద ఛాయాలు అలుముకున్నాయి.

## క్లుప్తంగా

### సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం



కరీంనగర్‌టౌన్: సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన సర్దార్ రవీందర్ సింగ్‌ను గంజ్ హైస్కూల్‌లో ఆయనతో పదోతరగతి చదివిన మిత్రులు ఆదివారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాకు మా మిత్రులు ప్రతీ సందర్భంలో వెన్నంటి ఉన్నారని, కష్టసుఖాల్లో అండగా నిలిచారని తెలిపారు. గంజ్ హైస్కూల్ మిత్ర బృందం సభ్యులు కన్న కృష్ణ, జనగామ సత్యనారాయణ, చెట్టుపెల్లి రాజమౌళి, నూజెట్టి రవీందర్ నాథ్, ఈవీ ప్రసాద్, రఘోత్తమ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు గుమస్తాల సంఘం కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌కు..



కరీంనగర్‌రూరల్: కోర్టు గుమస్తాల సంఘం కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ బండి వీరాస్వామిని ఆదివారం పదో డివిజన్ గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని చంద్రయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్లకొండ నాగయ్య, మద్దిశ్రీనివాస్, పైడిపల్లి రాజు, పూరెల్ల శ్రీనివాస్, సదానందం, కె.రమేశ్, అశోక్, ఎల్లాగౌడ్, శ్రీనివాస్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సినీనటుడు సోహైల్‌కు..



కరీంనగర్: బిగ్ బాస్ ఫేమ్, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు సినిమా హీరో సోహైల్ కరీంనగర్ వచ్చిన సందర్భంగా తెలంగాణ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆదివారం సన్మానించారు. తెలంగాణ నుంచి ముఖ్యంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది సినీనటులుగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో కళాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

### వలంటీర్ల మానవహారం



మానవహారంగా ఏర్పడిన వలంటీర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చామనపల్లిలో నిర్వహిస్తున్న వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా ఆదివారం చామనపల్లి, చెర్లభూత్కూర్ గ్రామాల్లో వలంటీర్లు ర్యాలీ చేపట్టారు. ప్రధాన చౌరస్తాల్లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో వలంటీర్లు శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బోగొండ లక్ష్మి, రమణారెడ్డి, ఉపసర్పంచు శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, న్యాయవాదులు నర్సింగ్, ఎంఏ.బేగ్, ప్రిన్సిపాల్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఆదివారం బొమ్మకల్ కృష్ణానగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలను ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ప్రారంభించారు. విద్యార్థుల్లో గణితం పట్ల భయం పోవడానికి అబాకస్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం జిల్లాలోని 25 పాఠశాలల నుంచి 280 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సీఈవో హరిచరణ్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రతినిధులు మారుతి, యుగంధర్, పవన్, ఎస్.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకం.. మా నేస్తం

- పుస్తక పఠనంతో మానసిక వికాసం
- విద్యార్థులు, యువత చదవాలి
- బుక్ ఫెయిర్‌పై పలువురు కవుల అభిప్రాయం

కరీంనగర్‌కల్చరల్: పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు.. ఒక మంచి పుస్తకం పది మంది మిత్రులతో సమానం.. పుస్తకాలు వికసించే విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లుతాయి.. పుస్తకం పఠనంతో మానసిక వికాసం కలుగుతుంది. అందుకే నేటి విద్యార్థులు, యువత పుస్తక పఠనంపై ఆసక్తితోపాటు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పలువురు సాహితీవేత్తలు అంటున్నారు. పుస్తకం తమ నేస్తమని చెబుతున్నారు. కరీంనగర్‌లోని జ్యోతిబా పూలే మైదానం జరుగుతున్న బుక్ ఫెయిర్‌లో భాగంగా శనివారం పలువురు కవులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.



స్టాళ్లలో ఏర్పాటు చేసిన పుస్తకాలను చూస్తున్న పాఠకులు

### సామాజిక చైతన్యానికి దోహదం



పుస్తక ప్రదర్శన సామాజిక చైతన్యానికి దోహదపడేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపడం అభినందనీయం. పండగను తలపించేలా పుస్తక పరిచయం ఏర్పాట్లు చేయడం సంతోషదాయకం. అయితే పుస్తక ప్రదర్శనను తిలకించడంతోపాటు పుస్తకాలను కొన్నప్పుడే ప్రదర్శన లక్ష్యం నెరవేరగలదు. పుస్తక ప్రియులు అధిక సంఖ్యలో వచ్చి, పుస్తకాలను కొనాలని కోరుతున్నా. ప్రదర్శన సందర్భంగా ఎన్నో సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయం. పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడంలో పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు చొరవ చూపాలి.

– దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, విమర్శకులు

### చదువు ఔన్నత్యాన్ని చాటుతుంది



చదడం మర్చిపోయి చూడటం అలవాటుగా మారి, అది వ్యసనంగా తయారైన ఈ తరుణంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం బాగుంది. ఇది చదువు ఔన్నత్యాన్ని చాటుతుంది. పుస్తకం విలువను తెలియజేస్తుంది. మేము పూర్వం అణానా, రూపాయికి చిన్న చిన్న కథల పుస్తకాలు, నవలలు కిరాయికి తెచ్చుకొని చదువుకునేవాళ్లం. అవి చదువుకుంటూ అందులో లీనమయ్యేవాళ్లం. నేటితరం కేవలం ల్యాప్‌టాప్, మొబైల్స్‌లో మునిగిపోతూ అదే లోకంగా బతుకుతోంది. ఈ పరిస్థితుల్లో పుస్తక ప్రదర్శన చదువు ఆవశ్యకతను అందరికీ తెలియజేస్తుంది. మర్చిపోయిన పుస్తకాలను, చదువును గుర్తు చేస్తూ కొత్త మార్గాల వైపు దారి చూపే దీపంగా నిలుస్తుంది.

– గాజుల రవీందర్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు

### ఆదరణ బాగుంది



పుస్తకం ప్రదర్శన ప్రభుత్వమే నిర్వహించడం సంతోషకరం. అనేక స్టాళ్లలో భారతీయ చరిత్ర, రాజ్యాంగం, నవలలు, సాహిత్యం, కామిక్స్, సైన్స్, వ్యక్తి వికాసం, బాల సాహిత్యం, ఆటో బయోగ్రాఫిక్స్, చిన్నపిల్లలకు సబంధించిన పుస్తకాలు, బాలల సాహిత్యం వివిధ రకాల 500 పబ్లిషర్స్ సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం అన్ని పుస్తకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికైతే విక్రయాలు కూడా బాగున్నాయి. ఈ నెల 8 వరకు బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. పుస్తక ప్రియులు సద్వినియోగం చసుకోవాలి.

–పురుషోత్తం సతీశ్, బుక్ ఫెయిర్ నిర్వాహక సభ్యుడు

### వ్యక్తిత్వ వికాసం



పుస్తక పఠనం వల్ల మానసిక శక్తి విస్తృతమవుతుంది. ప్రతీ విషయాన్ని శాస్త్రబద్ధంగా ఆలోచించే విధానం అలవడుతుంది. మనుషుల్లో సమస్యలను పరిష్కరించుకో గల సామర్థ్యం పెరుగుతుంది. మనోస్థైర్యాన్ని కలిగించి, బుద్ధి వికాసాన్ని పెంపొందిస్తుంది. మానవుడు తనకాళ్లపై తాను నిలబడ గల ధైర్యాన్ని ఇస్తుంది. చేసే పనిలో నైపుణ్యం వృద్ధి చెందుతుంది. మూఢాచారాలు నశిస్తాయి. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగిందో పుస్తకాల వల్లనే తెలుస్తుంది. సాంస్కృతిక చైతన్యం కలుగుతుంది. శీల నిర్మాణం జరుగుతుంది. వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుంది.

– కూకట్ల తిరుపతి, కవి, రచయిత

### సమాజ అభివృద్ధికి బాటలు..



పుస్తక ప్రదర్శన వల్ల పాఠకుల్లో సాహిత్య అభిరుచి పెరిగి, సమాజంలో శాంతి, సహృదం పరిఢవిల్లుతాయి. క్షలు అంతరించిపోతాయి. అవమానీయతకు చోటు ఉండదు. ఫలితంగా సమాజ అభివృద్ధికి బాటలు పడతాయి. నేటితరం వారు పుస్తకం పఠనాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలి.

– సీవీ కుమార్, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి

### ఎల్లమ్మ ఆలయానికి రూ.50 వేల విరాళం



నగదు అందిస్తున్న సర్పంచు రమణారెడ్డి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్ గ్రామంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి పనులకు సర్పంచు దబ్బెట రమణారెడ్డి ఆదివారం రూ.50 వేల విరాళాన్ని గౌడ సంఘం ప్రతినిధులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు మూల లక్ష్మీరాజం, ప్రతినిధులు బుర్ర రాజవీరు, నారాయణ, స్వామి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

### ఐఎంఏ ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ రాంకిరణ్

కరీంనగర్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎంఏ మహిళా విభాగం కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని ఆసుపత్రుల్లో పనిచేసే మహిళా సిబ్బందికి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి థైరాయిడ్, షుగర్, బీపీ, గుండె, కంటి, చర్మవ్యాధి తదితర వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ శేషశైలజ, వైద్యులు సింధు, సంధ్య, ప్రియాంక, రజని, రత్నమంజరి, రఘురామన్ తదితరులు పాల్గొన్నారు.





## మార్కెట్‌కు హోలీ కళ

విద్యానగర్: హోలీ.. రంగుల పండుగ. ఇది వసంత కాలంలో వస్తుంది కాబట్టి వసంతోత్సవం అని కూడా అంటారు. వయోభేదం లేకుండా అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే వేడుక. ఈ నెల 8న హోలీ నేపథ్యంలో కరీంనగర్‌లోని ప్రధాన కూరగాయల మార్కెట్, టవర్ సర్కిల్, శాస్త్రీరోడ్, ఆఫీస్ రోడ్‌లలో హోలీ రంగులు, వాటర్ కేన్‌లు దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. స్వీట్ల కోసం ముందుగానే ఆర్డర్లు ఇస్తున్నారు.

### విక్రయాలు బాగున్నాయి



హోలీ పండుగ సందర్భంగా సామగ్రి విక్రయాలు బాగున్నాయి. వినియోగదారులు వాటర్ కేన్‌లు, రంగులు కొనుగోలు చేస్తున్నారు. పిల్లలు, ఆడవాళ్లు వీటిని ఎక్కువగా తీసుకెళ్తున్నారు.

– ఈశ్వర్, గణేశ్ జనరల్ స్టోర్, శాస్త్రీరోడ్, కరీంనగర్

## రచయిత మచ్చ, రచయిత్రి పొత్తూరిలకు సన్మానం



హరిదాసును సన్మానిస్తున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన కవులు, కళాకారులు, సాహితీవేత్తలను సత్కరిస్తున్నట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. బుక్ ఫెయిర్ నాలుగో రోజు ఆదివారం జిల్లాకు చెందిన మచ్చ హరిదాసును డాక్టర్ గోపు లింగారెడ్డి అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలో జన్మించిన హరిదాసు ఎన్నో అవార్డులు, సన్మానాలు పొందారన్నారు. తెలుగులో ఆయన యాత్ర చరిత్రలు, గోరు కొయ్యలు, సూచి, అష్టదళ తదితర గ్రంథాలు రచించారని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్ లాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, మెప్మా పీడీ రవీందర్, డీడబ్ల్యూవో సబిత, ప్రముఖ రచయిత జనసేషన్ వీర రాఘవన్, డాక్టర్ సంగనభట్ల నరసయ్య, డాక్టర్ మట్ట సంపత్ కుమార్ రెడ్డి, సంకెపల్లి నాగేంద్ర శర్మ, అలిశెట్టి సంగ్రామ్, దామెరకుంట శంకరయ్య, నంది శ్రీనివాస్ తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## 'ప్యారడైజ్'లో 'పది' విద్యార్థులకు వీడ్కోలు



చైర్మన్ ఫాతిమారెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: రేకుర్తిలోని ప్యారడైజ్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు వేడుక నిర్వహించారు. ప్యారడైజ్, సెయింట్ జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదేళ్ల విద్యా ప్రయాణం ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులపై మీకున్న ప్రేమానురాగాలు, అనుభూతులు మరిచిపోలేనివన్నారు. వారు విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసమే అప్పుడప్పుడు శిక్షించారని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ కరస్పాండెంట్ లింగయ్య మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో నేర్చుకున్న విద్య భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు పునాది కావాలన్నారు. వ్యక్తిగతంగా, పాఠశాలకు, తల్లిదండ్రులకు, దేశానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చేలే ఉండాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా.. వీడ్కోలు సందర్భంగా పదోతరగతి విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ప్రిన్సిపాల్ వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం



సెయింట్ పాల్ స్కూల్‌లో..



ది ప్లే స్కూల్‌లో...

విద్యానగర్: కరీంనగర్‌లోని సెయింట్ పాల్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని పాల్గొన్నారు. కరీంనగర్‌లోని ది ప్లే స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల చైర్మన్ పోల్సాని సుధాకర్‌రావు, ప్రిన్సిపాల్ ప్రభాదేవి ముఖయా, రమాదేవి పాల్గొన్నారు.

## అర్చకుడికి 'పురోహిత రత్న' బిరుదు



జయచందర్ శాస్త్రిని సన్మానిస్తున్న సినీ నటుడు సుమన్

కొత్తపల్లి: సర్ సీవీ రామన్ అకాడమీ (సాంస్కృతిక సేవా సంస్థ) రుద్రాక్ష వైభవంవారు రేకుర్తి శ్రీ అపర్ణ అమృతేశ్వర మహాశివాలయం ప్రధాన అర్చకుడు శివ జయచందర్ శాస్త్రికి వైదిక 'పురోహిత రత్న' బిరుదుతోపాటు సువర్ణ కంకణం ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఉగాది పురస్కార వేడుకల్లో సినీనటుడు తల్వారు సుమన్, నిర్వాహకుడు మహేంద్రవాడ వెంకటేశ్వరరావుల చేతులమీదుగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు స్థానిక కార్పొరేటర్ సుదగోని మాధవి, కృష్ణగౌడ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

**శివశాస్త్రికి 'శిరోరత్న' బిరుదు..**

వైదిక నిర్వహణలో పురోహితం, కల్యాణాలు, హోమాలు, వ్రతాలు, ప్రతిష్ఠలు, పంచాంగ శ్రవణం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామానికి చెందిన పత్తి శివశాస్త్రికి సర్ సీవీ రామన్ అకాడమీ (సాంస్కృతిక సేవా సంస్థ) రుద్రాక్ష వైభవం వారు వైదిక 'శిరోరత్న' బిరుదు, సువర్ణ కంకణం ప్రదానం చేశారు. సినీనటుడు సుమన్ ఆయనను సత్కరించారు.

## 'అచీవర్స్'లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే



నృత్యం చేస్తున్న చిన్నారులు

కరీంనగర్‌టౌన్: స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, కె.వేణుగోపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతుల్ని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


### గౌడ యువజన సంఘం కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చామనపల్లిలో ఆదివారం గౌడ యువజన సంఘం గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా గర్వందుల సంతోష్, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి ఎల్లాగౌడ్, కార్యదర్శిగా వడ్లకొండ పర్శరాములు, కోశాధికారిగా బండారి అర్జున్, కార్యవర్గ సభ్యులుగా భూసారపు మహేశ్, బుర్ర రమేశ్, పల్లె సాగర్, బండపల్లి ఆంజనేయులు, బత్తిని ప్రశాంత్‌గౌడ్ ఎన్నికయ్యారు.

### పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు కొనసాగుతున్నందున సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ మెహర్‌నగర్, గంజ్, హౌజింగ్‌బోర్డు ఫీడర్ల పరిధిలోని మెహర్‌నగర్, కూరగాయల మార్కెట్, గంజ్, టవర్ సర్కిల్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ముందు ప్రాంతం, సిక్‌వాడ, కమాన్‌రోడ్, హౌజింగ్‌బోర్డు కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆకట్టుకున్న స్పోర్ట్స్ డే



కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని హలో కిడ్స్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వార్షిక స్పోర్ట్స్ డే ఆకట్టుకుంది. బ్లూరిబ్బన్ అకాడమీ డైరెక్టర్ సిరిపురం ఈశ్వర్, పిల్లల వైద్యుడు నార్ల మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని సూచించారు. అనంతరం పిల్లలు నృత్యాలు, పాటలతో అలరించారు. మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ కె.వసంత్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీలత, డైరెక్టర్ కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

### ముస్లిం శ్మశానవాటిక వెల్ఫేర్ కమిటీ ఎన్నిక



కరీంనగర్‌టౌన్: నగరంలోని కాపువాడలో గల తాఖియా కరీముల్లా షా సాహెబ్ శ్మశానవాటిక వెల్ఫేర్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ సులేమాన్ తవక్కలి, ఉపాధ్యక్షులుగా యూసుఫుద్దీన్ ఖాద్రీ, సిరజ్ అహ్మద్ ఖాన్, ఎస్కే.ముఖ్తర్, ఎండీ.నవాజ్ హుస్సేన్, ఎండీ.కుర్షీద్ బాస్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఇంతియాజ్ అలీ, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ రెహమాన్, ఈసీ మెంబర్లుగా అజీజ్ ఉర్-రెహమాన్, కలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



కరీంనగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ సర్దార్ రణధీర్ సింగ్ రాణా మాట్లాడుతూ.. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,155 చేరిందని మండిపడ్డారు. కమర్షియల్ సిలిండర్‌పై రూ.350 పెంచడం వల్ల రూ.2,345కు చేరిందని పేర్కొన్నారు. దీనివల్ల ఆహార పదార్థాల ధరలు పెరిగి, మళ్లీ ప్రజలపైనే భారం పడే ప్రమాదం ఉందన్నారు. జిల్లా సెక్రటరీ నారాయణ, మాజీ అధ్యక్షుడు దినేశ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జహూర్, టౌన్ యూత్ వైస్ ప్రెసిడెంట్ పవన్ కల్యాణ్, నాయకులున్నారు.

## బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు సాగాలి



ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరిస్తున్న ఎస్పీ శైలజ, సముద్రాల వేణుగోపాలచారి

**రాజమహేంద్రవరం రూరల్:** రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణ సామాజికవర్గం ఐక్యంగా ముందుకు సాగాలని, అప్పుడే ప్రాధాన్యం లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి అభ్యర్థి ఎక్కడ పోటీ చేసినా గెలిపించడానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కాతేరు వద్ద వెంకటాద్రి గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సు ఆదివారం జరిగింది. తెలంగాణ ఎమ్మెల్సీ, మాజీ ప్రధాని పీవీ కుమార్తె సురభి వాణీదేవి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యవాడ దుర్గాప్రసాద్, కోనూరు సతీష్‌శర్మ, కోశాధికారి హెచ్‌కే మనోహర్, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు రెంటచింతల దీప్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ తోలేటి శిరీష తదితరులు హాజరయ్యారు.

# ప్రభుత్వ మద్దతు అమోఘం

- అందుకే మా పెట్టుబడులను ఇక్కడే భారీగా విస్తరిస్తున్నాం
- జీఐఎస్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పిన పారిశ్రామికవేత్తలు




**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఇప్పటికే వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు తమ భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై తమకున్న విశ్వాసాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు వేదికగా ప్రపంచానికి చాటిచెప్పారు. విశాఖలో జరిగిన రెండ్రోజుల జీఐఎస్ సదస్సులో కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకోవడమే కాకుండా ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న వివిధ సంస్థలు తమ భారీ విస్తరణ కార్యక్రమాలను ప్రకటించాయి. రిలయన్స్ గ్రూపు దగ్గర నుంచి కొత్త తరం నోవా ఎయిర్ సంస్థ వరకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందిస్తున్న తీరును సభా వేదికగా కీర్తించాయి. అంతేకాక.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రండి అంటూ ఇతర పారిశ్రామికవేత్తలను ఆయా సంస్థల అధిపతులు ఆహ్వానించడం విశేషం. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం, రిటైల్ వంటి వ్యాపారాల్లో ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టామని.. ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతుతో మరో రూ.50,000 కోట్లతో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ పార్కును ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు.

### అదానీ మరో రూ.43,664 కోట్లు

అలాగే.. అదానీ గ్రూపు పోర్టులు, సిమెంట్ వంటి రంగాల్లో రాష్ట్రంలో సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టగా భవిష్యత్తులో ఆయా రంగాల్లో సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు ఏపీ సెజ్ సీఈఓ కరణ్ అదానీ ప్రకటించారు. రాష్ట్రంలో డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీతో పాటు వివిధ రంగాల్లో రూ.43,664 కోట్ల పెట్టుబడులను పెట్టే విధంగా అదానీ గ్రూపు ఒప్పందం కుదుర్చుకుంది. ఇక లాక్‌డౌన్ కాలంలో తక్కువ సమయంలో యూనిట్‌ను ప్రారంభించామని, దీనికి రాష్ట్ర మద్దతే కారణమని నోవా ఎయిర్ సీఈఓ, ఎండీ గజానన్ నంబియార్ స్పష్టంచేశారు. సాధారణంగా ఆక్సిజన్ వంటి పారిశ్రామిక వాయువుల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేయడానికి కనీసం 18 నుంచి 24 నెలల సమయం పడుతుందని, కానీ కేవలం 14 నెలల కాలంలోనే యూనిట్‌ను ప్రారంభించి వేలాది మంది జీవితాలను కాపాడినట్లు ఆయన తెలిపారు.

### జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్లు

జిందాల్ స్టీల్ పవర్ చైర్మన్ నవీన్ జిందాల్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో ఏపీ పారిశ్రామిక రాష్ట్రంగా ఎదగనుందన్నారు. అందుకే తన సోదరుడికి చెందిన జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. ఇక, ఇతర రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ పార్కును దక్కించుకుంది. దీనితో రాష్ట్రంలో ఫార్మా రంగం మరింతగా విస్తరించనుంది. సాధారణంగా ఫార్మా పరిశ్రమ స్థాపనకు మూడు నుంచి నాలుగేళ్లు పడుతుందని, కానీ అన్ని అనుమతులున్న బల్క్ డ్రగ్ పార్కులో తక్షణం కార్యకలాపాలు మొదలుపెట్టే అవకాశం కలుగుతుందని దివీస్ ఫార్మా వైస్ ప్రెసిడెంట్ మధుబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా రంగానికి ఇస్తున్న మద్దతుతో తాము మరింతగా కార్యకలాపాలు విస్తరించడానికి రూ.వేల కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు దివీస్, లారస్, హెటిరో, అపోలో తదితర సంస్థలు ప్రకటించాయి. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్న సంస్థలు ఇలా భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించడంతో రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెళ్లిపోతున్నాయంటూ తెలుగుదేశంతో పాటు దాని అనుబంధ పత్రికల దుష్ప్రచారానికి తెరపడుతుందని భావిస్తున్నట్లు పారిశ్రామికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

| సంస్థ | పెట్టుబడి (రూ.కోట్లల్లో) | ఉపాధి |
|---|---|---|
| ఎన్టీపీసీ | 2,35,000 | 77,000 |
| జేఎస్‌డబ్ల్యూ | 50,632 | 9,500 |
| రిలయన్స్ | 50,000 | 10,000 |
| అదానీ గ్రూపు | 43,664 | 53,815 |
| హెచ్‌పీసీఎల్ | 14,320 | 1,500 |
| అరబిందో | 10,365 | 5,250 |
| ఆదిత్య బిర్లా | 9,300 | 2,850 |
| ఐటీసీఎల్ | 4,300 | 1,500 |
| సన్నీ ఆప్టెక్ | 2,500 | 2,000 |
| అల్ట్రాటెక్ | 2,500 | 2,000 |
| ఆంధ్రా పేపర్ | 2,000 | 2,300 |
| మాండలీజ్ | 1,600 | 150 |
| లారస్ గ్రూపు | 1,210 | 1,700 |
| దివీస్ | 1,100 | 3,700 |
| సెల్‌కాన్ రిజల్యూట్ | 1,000 | 5,000 |

## వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ..

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో పెరిగిన విశాఖ ఇమేజ్
- నగర అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకదృష్టి






**సాక్షి, విశాఖపట్నం:** విశాఖ నగరంలో ఓవైపు కడలి కెరటాలు.. మరోవైపు పెట్టుబడులు పోటెత్తాయి. బెస్త గ్రామం నుంచి మహానగరంగా మారిన విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్). పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ నగరానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. సదస్సు విజయవంతం అయిన తర్వాత 'దేశానికి ఆర్థికకోట విశాఖ..' అని అందరి నోటా ఒకే మాట. జీఐఎస్-2023తో పెట్టుబడుల స్వర్గధామంగా సరికొత్త ఇమేజ్‌కు నాంది పలికిన వైజాగ్.. ఇదే స్ఫూర్తితో జీ-20 సదస్సుకు సిద్ధమవుతోంది. రాజధానులెన్నింటికో రాదారిగా ఉన్న విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా మార్చాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం సిద్ధించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. చోదకశక్తి కేంద్రాలుగా మారుతున్న ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల జాబితాలో అగ్రభాగంలో ఉన్న విశాఖపట్నంలో రెండురోజులు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ సక్సెస్ అయింది. ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన నగరంగా విశాఖకు ఈ సమ్మిట్ నిర్వహణతో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. గత ప్రభుత్వ హయాంలో మూడుమార్లు పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా రాని ఇమేజ్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటిసారి ఏర్పాటు చేసిన జీఐఎస్‌తో వైజాగ్ పేరు ఖండాంతరాలు దాటింది. సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా నిర్వహించిన సమ్మిట్‌కు దేశవిదేశాలకు చెందిన దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు హాజరై విశాఖ నగర వైభవానికి వావ్ అన్నారు.

**కొత్త ఇమేజ్ తీసుకొచ్చారు**

ఇన్నాళ్లు.. విశాఖపట్నం అంటే అలల సవ్వడులతో.. అందాల నగరంగా.. పర్యాటక ప్రాంతంగా మాత్రమే గుర్తింపు ఉండేది. కానీ.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించిన తర్వాత నగరానికి సరికొత్త ఇమేజ్ వచ్చింది. ఎవరు వచ్చినా ఆహ్వానించదగ్గ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న విశాఖ నగరంలో తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించాలన్న ఆలోచనల్ని పారిశ్రామికవేత్తలు స్వయంగా చూసిన తర్వాత మరింత బలపరుచుకున్నారు. నివాసయోగ నగరాల్లో టైర్-1 సిటీలతో పోటీపడుతున్న విశాఖపట్నం పెట్టుబడులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. హైదరాబాద్‌ని మించి అభివృద్ధి చేసే అవకాశాలున్నప్పటికీ.. గత పాలకులు విశాఖని ఒక నగరంగానే గుర్తించి విస్మరించడంతో అనుకున్న మేర అభివృద్ధి చెందలేదు. కానీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేకశ్రద్ధ వహించారు. నగరానికి కొత్త ఇమేజ్ తీసుకొచ్చేందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చేలా అడుగులు వేశారు. అనుకున్నట్లుగానే పెట్టుబడుల సదస్సుతో 'తింటే గారెలే తినాలి.. వింటే భారతం వినాలి.. ఉంటే వైజాగ్‌లోనే ఉండాలి.. చేస్తే విశాఖలోనే వ్యాపారం చేయాలి..' అనే స్థాయికి తీసుకెళ్లారు.

# మానవ తప్పిదమే

- డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్‌పై తేల్చేసిన ఎన్‌హెచ్‌పీసీ
- చంద్రబాబు నిర్వాకాలు తేటతెల్లం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరంపై చంద్రబాబు సర్కారు అనాలోచిత నిర్ణయాలు.. ప్రణాళికా రాహిత్యం.. కమీషన్ల దాహంతోనే డయాఫ్రమ్ వాల్ దెబ్బ తిందని ఆది నుంచి చెబుతున్న వాస్తవాలను ఎన్‌హెచ్‌పీసీ నివేదిక అధికారికంగా ధ్రువీకరించింది. గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ చానల్, స్పిల్‌వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా టీడీపీ సర్కారు ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడం ఘోర తప్పిదమని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) రాష్ట్ర జలవనరుల శాఖకు సమర్పించిన నివేదిక తేల్చి చెప్పింది. ఆ మానవ తప్పిదం వల్లే 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడంతో ఖాళీ ప్రదేశం 800 మీటర్లకు కుచించుకుపోయి ప్రవహించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇది వరద ఉధృతి తీవ్రతరం కావడానికి దారితీసింది. అందువల్లే ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గ్యాప్-1లో 35 మీటర్లు, గ్యాప్-2లో 20 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయని స్పష్టం చేసింది. గ్యాప్-2లో డయాఫ్రమ్ వాల్ ఎడమ వైపున 175 మీటర్ల నుంచి 363 మీటర్ల వరకు ధ్వంసం కాగా కుడి వైపున 1,170 నుంచి 1,370 మీటర్ల వరకు పూర్తిగా ధ్వంసమైందని తేల్చింది. 480 మీటర్ల నుంచి 510 మీటర్ల వరకు, 950 మీటర్ల నుంచి 1,020 మీటర్ల వరకు రెండు చోట్ల 20 మీటర్ల లోతు వరకూ డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తేల్చింది. ఫలితంగా భూగర్భంలో గోదావరి ప్రవాహాన్ని సమర్థంగా అడ్డుకట్ట వేయలేదని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను పటిష్టం చేసే చర్యలు చేపడితేనే లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపింది.

**ఎన్‌హెచ్‌పీసీ సమగ్ర అధ్యయనం..**

పోలవరం వద్ద భౌగోళిక పరిస్థితుల రీత్యా వరద ప్రవాహాన్ని మళ్లించే స్పిల్‌వేను నదీ తీరానికి కుడి వైపున రాతి నేలపై, 194.6 టీఎంసీలను నిల్వ చేసే ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్‌ను నదికి అడ్డంగా నిర్మించేలా కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ప్రాజెక్టు డిజైన్‌ను ఆమోదించింది. ప్రధాన డ్యామ్‌కి పునాదిగా డయాఫ్రమ్ వాల్ వేయాలని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను నిర్మిస్తేనే భూ గర్భంలో గోదావరి ప్రవాహం ఎగువకు నుంచి దిగువకు, దిగువ నుంచి ఎగువకు వెళ్లకుండా అడ్డుకుంటుంది. అంటే లీకేజీ (ఊట నీరు)కి పూర్తిగా అడ్డుకట్ట వేస్తుంది. ఇది ప్రధాన డ్యామ్ చెక్కు చెదరకుండా కాపాడుతుంది. ప్రధాన డ్యామ్‌కు అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్‌ను గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించే పనులు పూర్తి చేశాకే చేపట్టాలి. గత సర్కారు అనాలోచితంగా అందుకు విరుద్ధంగా చేపట్టడంతో 2019లో వచ్చిన వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈ క్రమంలో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించింది. సీడబ్ల్యూసీ సూచనల మేరకు ఎన్‌హెచ్‌పీసీకి ఈ బాధ్యతను అప్పగించింది.

### ఈ పాపం.. చంద్రబాబుదే

పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయంతో తామే పూర్తి చేస్తామని విభజన చట్టం సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నాడు సీఎం హోదాలో చంద్రబాబు కోరారు. ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధం కావడంతో 2016 సెప్టెంబరు 6న ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. ఈ క్రమంలో 2013-14 ధరల ప్రకారమే నీటిపారుదల విభాగం వ్యయంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని కేంద్రం విధించిన షరతులకు చంద్రబాబు తలొగ్గారు. రూ.3,302 కోట్ల విలువైన జలాశయం పనులను 'ఈనాడు' రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు, ఎడమ కాలువలో రూ.150 కోట్ల పనులను నాటి ఆర్థిక మంత్రి యనమల వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కు నామినేషన్‌పై కట్టబెట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. ఈ పాపాల కారణంగానే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది.

### కోతకు గురైన ప్రాంతంలో కొత్త డయాఫ్రమ్ వాల్

- దెబ్బతిన్న చోట సమాంతరంగా కొత్తగా నిర్మాణం
- మరో రెండు చోట్ల సరిదిద్దే విధానంపై సీడబ్ల్యూసీతో చర్చ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

# అలరించిన 'ఊరు మనదిరా'

- వేదికపై గర్జించిన కవులు, కళాకారులు
- కవి గూడ అంజయ్యకు ప్రముఖుల నివాళి
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వేదికపై అభివాదం చేస్తున్న నాయకులు, కవులు, గాయకులు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రజా కవి గూడ అంజయ్య యాదిలో నిర్వహించిన ఊరు మనదిరా సాంస్కృతిక సభ అలరించింది. కవులు, కళాకారులు, గాయకులు ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రజాయుద్ధనౌక గద్దర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అమరులపై గద్దర్ పాడిన పాట సభికులను కన్నీళ్లు పెట్టించింది. బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, రచయిత జయరాజు, ప్రజాగాయకులు పల్లె నర్సింహ, గర్జన దయానర్సింగ్, తేలు విజయ, రాంబాబు, మిట్టపల్లి సురేందర్, స్వామి, లక్ష్మీనారాయణ తదితరులు ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. పాలకులు సాగిస్తున్న అణచివేత, దౌర్జన్యాలు, ప్రజల ఆకలి కేకలు, ఆక్రందనలు, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, అమరుల రక్త తర్పణలు పాటల రూపంలో ప్రవహించాయి. ప్రజాకవి గూడ అంజయ్య పాటలకు గాయకులు పబ్బతి పట్టారు.

**శక్తివంతమైనది పాట..**

ఊరు మనదిరా సాంస్కృతిక సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి, టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు హాజరయ్యారు. గూడ అంజయ్యకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాటకు మహత్తరమైన శక్తి ఉందని, ఆటం బాంబుకన్నా శక్తివంతమైనదని అన్నారు. ప్రజాకవి గూడ అంజయ్య రాసిన అనేక పాటలు ప్రజల గుండెకు సూటిగా తాకాయన్నారు. ప్రజల యాస, భాషను తీసుకుని అంజయ్య తెలంగాణ మలి దశ ఉద్యమంలో రాసిన పాటలు ఉద్యమాన్ని మలుపు తిప్పాయని తెలిపారు. కానీ అంజయ్య మరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. హైదరాబాద్‌లో ప్రజాకవి అంజయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే తామే నిర్మిస్తామని సీపీఐ నేత నారాయణ తెలిపారు.

**దేశంలో పెద్దదొర కేంద్రం..**

దేశంలో ఉన్న పెద్ద దొర కేంద్ర ప్రభుత్వమని విప్లవ దర్శకుడు, నటుడు ఆర్.నారాయణ మూర్తి అన్నారు. సహజ సంపదను పెట్టుబడి దారులకు కట్టబెడుతూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపు ఇచ్చారు. ఇందుకు అన్ని శక్తులు ఏకం కావాలన్నారు. ముఖ్యంగా ప్రజావ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటాలు సాగించేందుకు ఎర్రజెండా పార్టీలన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ప్రజాకవి గూడ అంజయ్య సతీమణి హేమా నళిని, గుండా మల్లేశ్ సతీమణి గుండా సరోజను అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు తదితరులు పాల్గొన్నారు.



అమరుల పాట పాడుతున్న ప్రజా గాయకుడు గద్దర్



గూడ అంజయ్య భార్య హేమానళినిని సత్కరిస్తున్న నాయకులు, గాయకులు

# మార్మోగిన నారసింహుని నామస్మరణ



ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు



దైవ దర్శనం బారులు తీరిన భక్తులు

**ధర్మపురి:** నారసింహుని నామ స్మరణతో ధర్మపురి పుణ్యక్షేత్రం మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం భక్తులు పోటెత్తారు. తొలుత గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆ తర్వాత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దైవదర్శనం కోసం ఆలయం ఎదుట గంటల తరబడి బారులు తీరారు. ఆ తర్వాత ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామిని దర్శించుకున్నారు. నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. కొబ్బరి, బెల్లం సమర్పించారు. 'తడిబట్ట తానాలయ్యా ఓ నర్సయ్య.. నీ గుడిలో పూజాలయ్యా.. ఓ నర్సయ్య' అంటు తెలంగాణ మాండలికంలో పాడిన పాటలతో భక్తులు మైమరిపించారు.

### గోదావరిలో పోటెత్తిన భక్తులు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా తరలివచ్చిన భక్తులు తొలుత పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. పుష్కర ఘాట్ మెట్లపై వంటలు తయారుచేసుకుని చేసుకొని ఆరగించారు. అయితే, భక్తులు సేదదీరిన చోట జంతుబలి ఇవ్వడంతో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి.

# ఓబీ కార్మికుల సమ్మె సైరన్..!



ఆందోళన నిర్వహిస్తున్న ఓబీ కాంట్రాక్టు కార్మికులు

- చట్టప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్
- నేటి నుంచి నిరవధిక సమ్మె
- సమ్మెలోకి మూడువేల మంది
- బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యక్ష ప్రభావం

**గోదావరిఖని:** ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మె సైరన్ మోగించారు. రామగుండం రీజియన్‌లోని 3వేల మంది సమ్మెకు సిద్ధమయ్యారు. ఇదే జరిగితే రీజియన్‌లోని నాలుగు ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపనుంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 45 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం స్పందించడం లేదని, ఓబీ కాంట్రాక్టు కూడా ముందుకు రాలేదని కార్మికులు చెబుతున్నారు. సోమవారం ఉదయం షిఫ్టు నుంచి సమ్మెకు వెళ్తున్నామని అంటున్నారు. ఓబీల్లో పనిచేస్తున్న వోల్వో డ్రైవర్లు, హెల్పర్లు, బ్లాస్టింగ్ హెల్పర్లు, సర్వే సిబ్బంది సమ్మెలోకి వెళ్తున్నారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, జీవో 22 అమలుకు ఉత్తర్వులు జారీ చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలనే తదితర డిమాండ్లతో సమ్మెకు సిద్ధమవుతున్నారు. అయితే అసలే ఆర్థిక సంవత్సరం చివరి నెల. అందులోనూ బొగ్గు ఉత్పత్తి నిర్దేశిత లక్ష్యానికి యాజమాన్యం చాలా దూరంలో ఉంది. ఈక్రమంలో కార్మికుల సమ్మెపై యాజమాన్యం ఎలా ముందుకెళ్తుందో చూడాలి.


### పట్టించుకోని యాజమాన్యం



కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 45రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదు. ఓబీ కాంట్రాక్టర్లు కూడా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తొందరగా సమస్యలు పరిష్కరించాలి. లేనిపక్షంలో నిరవధిక సమ్మె ఉధృతం చేస్తాం.

– కౌశిక్ హరి, కార్మిక నేత

### కార్మికుల శ్రమదోపిడీ



కాంట్రాక్టు కార్మికులతో పనిచేయించుకుంటున్న యాజమాన్యం సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. ఈ విషయంలో యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి, జీవో 22 అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి.

– తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు

# సింగరేణి రిటైర్డు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

**తాండూర్(బెల్లంపల్లి):** ఒకే గనిలో కలిసి విధులు నిర్వర్తించిన సింగరేణి కార్మికులు, అధికారులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయతను పంచుకున్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం టౌన్ షిప్ చేరువలోని మూసివేతకు గురైన ఎంవీకే-1 గని పరిసరాల్లో సమ్మేళనం నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా పరిధి ఎంవీకే-1 గని ప్రారంభమైనప్పటి నుంచి మూసివేతకు గురయ్యే(1976-2002) వరకు విధులు నిర్వర్తించిన ఉద్యోగులు కలిసికట్టుగా సమ్మేళనంలో పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సింగరేణి అప్పటి, ప్రస్తుత పరిస్థితులు, పరిణామాల గురించి మాట్లాడుకున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఎక్కడెక్కడో స్థిరపడిన కార్మికులు, అధికారులు 26ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ దేవేందర్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.




ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సింగరేణి ఉద్యోగులు

# సన్నిధి

## దమ్మపదం

# అరటి పువ్వులా ఉండ కూడదు!



దేవదత్తుడు ఒక యువ రాజు. చిన్ననాటినుంచి బుద్ధుని పట్ల దేవదత్తుడు శత్రుభావంతో ఉండేవాడు. చిన్నప్పుడు బాణాలతో దేవదత్తుడు హంసను కొడితే, దాన్ని బుద్ధుడు సంరక్షించి, ప్రాణం కాపాడాడు.

ఆ హంస నాదంటే నాదని దేవదత్తుడు సిద్ధార్థునితో వాగ్వివాదానికి దిగాడు. 'ప్రాణం తీసిన వానిది కాదు. ప్రాణం పోసిన వానిదే హంస' అని, ఆ హంసను తీసుకుని, గాయాలు మానేలా చేసి, తిరిగి ఆకాశంలోనికి వదిలి పెట్టాడు సిద్ధార్థుడు. అప్పటినుంచి బుద్ధుడి పట్ల ద్వేషం, అసూయ పెంచుకుంటాడు దేవదత్తుడు.

వారు పెరిగి పెద్దవారయ్యాక, బుద్ధుడు బౌద్ధసంఘాన్ని స్థాపించి విశేష గౌరవ సత్కారాలు పొందడం చూసి తానూ బౌద్ధ సంఘంలో చేరాడు దేవదత్తుడు. కొన్నాళ్లకి బౌద్ధసంఘంలో తనకే అగ్రస్థానం లభించాలని, తానో నాయకుణ్ణి కావాలని పట్టుబట్టాడు దేవదత్తుడు. సంఘం అంగీకరించక పోవడంతో మగధ యువరాజు అజాత శతృవు పంచన చేరి 'నీవు నీ తండ్రిని చంపి రాజువుకా. నేను బుద్ధుణ్ణి చంపి బౌద్ధసంఘం నాయకుణ్ణవుతాను' అని నూరిపోస్తాడు.

అజాత శతృవు దేవదత్తుని మాటలు నమ్మి, అతణ్ణి ఆదరిస్తాడు. ఈ విషయం శిష్యులు బుద్ధునితో చెబుతారు. అప్పుడు బుద్ధుడు – 'భిక్షువులారా! దుష్టునికి దక్కే గౌరవ సత్కారాలు అరటిచెట్టు పువ్వులాంటివి. వెదురుచెట్టు పుష్పం లాంటివి. ఎండ్రకాయ గర్భం లాంటివి. ఒక్కపువ్వుతోనే అరటిచెట్టు అంతరిస్తుంది. వెదురు చెట్టు ఒక్క పూతతోనే తన నాశనాన్ని తాను తెచ్చుకుంటుంది. పీతకి గర్భమే దాని చావుని ప్రసాదిస్తుంది' అని చెప్పాడు.

''నిజమే, మామిడిచెట్టు పుష్పించి, ఫలాలనిస్తుంది కానీ అంతరించదు. మరలా చిగురించి, మరలా ఫలాలను ఇస్తూనే ఉంటుంది. అది ఎప్పుడూ గౌరవ సత్కారాలు పొందుతూనే ఉంటుంది. కానీ అరటిచెట్టు పుష్పించి, గెలవేసి అంతరిస్తుంది. ఒక్కకాపుతోనే దాన్ని నరికేస్తారు. దుశ్శలుడు పొందే గౌరవ సత్కారాలు ఇలాటివే కదా!'' అనుకున్నారు అతిథులు.

బుద్ధుడు చెప్పినట్టే, ఆ తర్వాత అజాత శతృవుకి దూరమై, ఒంటరిగా మిగిలి దైన్యంగా ప్రాణాలు పోగొట్టుకున్నాడు దేవదత్తుడు.

– బొర్రా గోవర్ధన్

## మంచి మాట

8, బుధవారం మహిళా దినోత్సవం

# కదిలించే కావ్యం మహిళ

సృష్టిలో ఒక గొప్ప సృష్టి మహిళ. మహిళ గొప్పతనం గురించి గొప్పవాళ్లు ఎందరో ఎంతో గొప్పగా చెప్పారు. ఆ చెప్పినది అంతా మహిళ గొప్ప తనానికి ఎంతమాత్రమూ న్యాయం చెయ్య లేదు, సరితూగలేదు. మహిళ గొప్పతనం గురించి ఎవ్వరూ గొప్పగా కాదుకదా తగినట్లుగా కూడా చెప్పలేదేమో? చెప్పలేరేమో?!

**అమ్మ అయింది, తోబుట్టువు అయింది, ఆలి అయింది; అడుగడుగునా మనతోడై నిలిచింది మహిళ. అనురాగం ఆప్యాయతల కలబోత అయిన మహిళ ఆనందానికి ఆలయం తానై వెలిసింది. మన ఉనికికి మూలం, మనుగడకు ఆలవాలం మహిళ. మూగిన జీవనచీకటిలో కాంతి మహిళ. మానవ బంధాలను, సంబంధాలను కలుపుతూ కదిలే కావ్యం మహిళ. మనల్ని కదిలించే కావ్యం మహిళ.**

మానవ జీవితకథకు ఇతివృత్తం మహిళ; మానవ జీవనకథనానికి గమనం మహిళ. మానవచరిత్రకు ఆత్మ మహిళ. అత్యుదాత్తతకు ఆకృతి మహిళ.

తత్త్వంపరంగానూ, వ్యక్తిత్వంపరంగానూ, ప్రవర్తనపరంగానూ మహిళ ఎంతో విశిష్టమైంది. 'మహిళ ఒకదాన్ని స్వీకరిస్తుంది ఆపై దాంతో సృజన చేస్తుంది; ఆ సృజన సూత్రం విశ్వంలోనే అత్యంత అద్భుతమైంది' అని చైనీస్ తత్త్వవేత్త, కవి జుషి వందలయేళ్ల క్రితమే చెప్పారు. 'సారంలేని ఈ లోకంలో సారాన్ని ఇచ్చేది మహిళ అని తెలుసుకునే కాబోలు శివుడు తన అర్ధశరీరాన్ని మహిళకు ఇచ్చాడు' అని ఒక పూర్వ సంస్కృతశ్లోకం మనకు చెబుతోంది.

మనవాళ్లు మహిళకు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చారు; మహిళకు ప్రశస్తమైన స్థానాన్ని ఇచ్చారు. వేదంలో ఒక వధువు, వరుడితో ''నేను ఋక్ (సాహిత్యం), నువ్వు సామం (గానం)'' అని అంటుంది. గానానికి సాహిత్యంలాగా మగవాడికి మహిళ ముఖ్యం. మహిళను సాహిత్యం అనడమే ఆమె గొప్పతనాన్ని చాటుతోంది. సాహిత్యం మన సుల్నీ, మస్తిష్కాల్నీ కదిలిస్తుంది. మహిళ కూడా అంతే.

మన భారతదేశంలోని ఋషులలో రోమశ, లోపాముద్ర, గార్గి, మైత్రేయి, అదితి, విశ్వనార, స్వస్తి, శశ్వతి, సూర్య, ఇంద్రాణీ, శచి, ఆపరి, ఉశన, గౌరివీతి, చైలకి, జయ, ప్రాదురాక్షి, మేధ, రమ్యాక్షి, లౌగాక్షి, వారుని, విదర్బి, విశ్వనార, వృష , సర్పరాజ్ఞి, సునీతి, హైమ ఇంకా కొందరు మహిళలు ఉండేవారు. కొన్ని మంత్రాలకు ఋషులైన మహిళలు ద్రష్టలు. వేదంలో ఒక మహిళ ''నేను శిరస్సును, నేను జెండాను, నేను నిప్పుల మాటలు పలుకుతాను. నా భర్త నన్ను అనుసరించనీ'' అంటుంది.


ఈ మాటల్నిబట్టి వేదకాలంలో మహిళకు స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం నిండుగా ఉండేవని, మహిళకు విశేషమైన, ప్రత్యేకమైన స్థానాలు ఉండేవని తెలియవస్తోంది. 'సమాజానికి, కుటుంబానికి మహిళ రక్షకురాలిగా వ్యవహరించాలి' అనీ, 'మహిళలు యుద్ధంలో పాల్గొనాలి' అనీ చెప్పిన వేదం 'భర్తకు సంపాదించే మార్గాలు నేర్పించు' అనీ మహిళకు చెబుతూ ఆమె ఆవశ్యకతను మనకు తెలియజేస్తోంది.

'ఆదిశక్తి అంటూ శక్తి అంటే మహిళే అని మనకు తెలియ చెప్పడం జరిగింది. 'శివుడు శక్తితో కలిస్తేనే జగత్తును సృష్టించే శక్తి కలవాడు అవుతాడు' అని ఆదిశంకరులు సౌందర్యలహరిలో తెలియజెప్పారు. మహిళ లేకపోతే శక్తే లేదు.

మహిపై దేవుడి మహిమ వెల్లివిరిసింది, అది మహిళ అయింది. వ్యాఖ్యానించబడలేని ఔన్నత్యం ఒక మూర్తిమత్వాన్ని పొందింది; అదే మహిళ. మహిళను సరిగ్గా అర్థం చేసుకోవడం, సరిగ్గా గౌరవించడం మనం నేర్చుకోవాలి. సరైన మహిళకు సాటి సరైన మహిళతత్త్వమే. సరైన మహిళ లేదా సరైన మహిళ తత్త్వం ప్రేరణ, స్ఫూర్తి కాగా మనం సరైన మనుగడ చెయ్యాలి.

– రోచిష్మాన్

## గురువాణి



# పాము పడగ మీది మణిలాగా..

శీలము, విద్య ఈ రెండూ పక్కపక్కన ఒక దానికొకటి దోహదపడాలి. శీలము అంటే నడవడిక. మనిషి ప్రవర్తన. ఎంత విద్యావంతుడో అంత వినయం కలిగిన వాడై ఉండాలి. విద్య అంటే తెలుసుకొనుట.. ఈ క్రమంలో తనకు తెలియనివి ఎన్నో ఉన్నాయని తెలుసుకుంటాడు. నాకు తెలిసింది బహు తక్కువ అని తెలుసుకుని, కొత్త వాటిని తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటాడు. అదే విద్య. తెలియనివి ఎన్నో ఉన్నాయనుకొన్నవాడు తలెత్తి గర్వంతో ఎలా తిరుగుతాడు ? అందుకే విద్య చేత వినయం.. దానితో ప్రవర్తన అలవాటవుతుంది.

శ్రీరామాయణం బాలకాండలో రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలుగురూ కలిసి వశిష్ఠ మహర్షి వద్ద నేర్చుకొన్న వైనాన్ని వర్ణిస్తూ వాల్మీకి మహర్షి..''సర్వేవేదవిదః శూరాః సర్వే లోకహితే రతాః/ సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వేసముదితా గుణైః... అంటాడు. వాళ్ళు అన్నీ చదువుకొన్నారు. అది లోకహితానికి పనికొచ్చింది... అంటాడు. మీరు ఎంత వినయంతో ప్రవర్తిస్తుంటారు, అందరి మేలు గురించి ఎంత ఆలోచిస్తుంటారు, దాన్ని గురించి ఎంత ఒత్తిడిన యినా ఎదుర్కోవడానికి సిద్ధపడుతుంటారు, మీరు త్యాగం చేసి పది మందికి ప్రయోజనాన్ని చేకూర్చడంలో ఎంత సంతోషంగా గడపగలరు...అన్నవి మీరు చదువుకున్న చదువుకి సార్థకత చేకూరుస్తాయి. అప్పుడే దాని వల్ల నలుగురికీ ప్రయోజనం.

''విద్యచే భూషితుండయి వెలయుచున్న/దొడరి వర్జింపన గుజుమీ దుర్జనుండు/చారు మాణిక్య భూషిత శస్తమస్త/కం బయిన పన్నగము భయంకర ముగాదె'' అంటాడు భర్తృహ రి.. నాగుపాము పడగమీద మణి ఉండి ఏ ప్రయోజనం... అలాగే దుర్మార్గులవద్ద ఎంత విద్య ఉన్నా అంతే అంటాడు. పోతనకూడా అదే అంటాడు భాగవతంలో... ''జ్ఞాన ఖలునిలోని శారదయును బోలె...'' అని. నిలువెల్లా దుర్మార్గపు ఆలోచనలున్నప్పుడు, అహంకారం తలకెక్కి ఉన్నప్పుడు.. తానొక్కడే జ్ఞాని అని మిగిలిన అందరినీ చులకనగా చూస్తున్నప్పుడు వారివల్ల, వారి పాండిత్యం వల్ల ఎవరికి ప్రయోజనం!


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఈనాటికీ జ్ఞాపకం చేసుకుంటున్నామంటే... వారి తెలివితేటలే కాదు.. వారి వినయ ప్రవర్తన, వారి వల్ల సమాజానికి చేకూరిన లాభం కారణం... గొల్లపూడి మారుతీరావు గారు ఒక చోట చెబుతారు... ఒక చెట్టునుంచి లక్ష అగ్గిపుల్లలు తయారవుతాయి... కానీ ఒక్క అగ్గిపుల్ల అరణ్యాన్ని మొత్తం కాల్చేస్తుంది. ఒక పక్షి బతికున్నకాలంలో ఎన్నో పురుగులను తింటుంది. అదే పక్షి చనిపోతే పురుగులు దాన్ని తింటాయి... ''మాకురు ధన జన యౌవ్వన గర్వం, హరతినిమేషత్కాలఃసర్వం/మాయామయమిదమఖిలమ్ హిత్వా, బ్రహ్మపదమ్ త్వం ప్రవిశ విదిత్వా'' అంటారు శంకరభగవత్పాదులు. దేనికోసం ఈ మిడిసిపాటు! అన్న ఆత్మ విమర్శ నిన్ను నిగ్రహిస్తూ ఉండాలి.

భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిగారు చనిపోయే నాటికి ఆయన కొనుక్కున్న ఫియట్ కారు మీద అప్పు తీరలేదు. ఎందరో అభిమానులు మనీ ఆర్డర్లు పంపబోతే ఆయన భార్య లలితా శాస్త్రిగారు వాటిని సున్నితంగా తిరస్కరించి ఆ అప్పును తానే తీర్చుకున్నారు. చదువు, మంచి నడవడిక కలిసి ఉన్నప్పుడు నీ శీలవైభవాన్ని మరింత ప్రకాశింపచేస్తాయి.

## అమృత బిందువులు

- మనలో ఉన్న మంచి భావాలు మంచి సాంగత్యాన్ని ఇస్తాయి. మంచి సాంగత్యం మంచి పనులకు దారి తీస్తుంది.
- ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. ఇది ముమ్మాటికీ నిజం. అందులో మన కష్టాలు కూడా ఉంటాయి.
- జీవితంలో అన్నీ కోల్పోయినా ఒకటి మాత్రం మనకోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దాని పేరే భవిష్యత్తు.
- నిన్ను వద్దనుకొన్న బంధాలముందు జాలిగా నిలబడకు. నీ వ్యక్తిత్వాన్ని ఎప్పటికీ వదులుకోకు. నీ విలువ తెలియని మనుషుల కోసం పరితపించకు.
- నిన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడేవారు ఉంటారు. ఎందరో కాకపోయినా... ఒక్కరైనా... ఆ ఒక్కరూ నీకు తోడుగా... నీతో కలసి ఉంటారు.
- సమస్యలు నిన్ను చుట్టుముడతాయి. బాధలు నిన్ను అమాంతం అలుముకుంటాయి. కష్టాలు నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అనేక భావోద్వేగాలు నిన్ను ఆవేదనకు గురిచేస్తాయి. నువ్వు అష్టదిగ్బంధనంలో ఇరుక్కుంటావు. కానీ, నువ్వు ఓర్పుతో, నేర్పుతో, పట్టుదలతో, క్రమశిక్షణతో ఉండు. కాలమే ప్రతి సంఘర్షణకు సమాధానం. ఎందుకంటే... ఏ నిమిషం శాశ్వతం కాదు.

# సినిమా

## వైజాగ్‌లో టైగర్


రవితేజ

హీరో రవితేజ నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న 'టైగర్ నాగేశ్వరరావు' చివరి షెడ్యూల్ వైజాగ్‌లో ప్రారంభమైంది. వంశీ, అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ–''స్టూవర్టుపురంలోని టైగర్ నాగేశ్వరరావు అనే గజదొంగ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతోన్న చిత్రమిది. 1970ల నేపథ్యంలో కథ సాగుతుంది. ఈ పాత్ర కోసం రవితేజ కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. సరికొత్త బాడీ లాంగ్వేజ్, యాసతో అలరిస్తారు. వైజాగ్‌లో ప్రారంభమైన చివరి షెడ్యూల్‌లో కీలక తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలు తెరకెక్కిస్తున్నాం. ఈ ఏడాది సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సమర్పణ: తేజ్ నారాయణ్ అగర్వాల్, సహ నిర్మాత: మయాంక్ సింఘానియా, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, కెమెరా: ఆర్. మధి.

## నా పాత్రలో రెండూ ఉంటాయి

– రానా



''నేను సాధారణంగా మంచి లేదా చెడు పాత్రలు పోషిస్తాను. కానీ, 'రానా నాయుడు' లో నేను చేసిన రానా పాత్రలో ఆ రెండూ కలిసి ఉంటాయి'' అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. వెంకటేష్, రానా తొలిసారి 'రానా నాయుడు' అనే వెబ్ సిరీస్‌లో నటించారు. కరణ్ అన్షుమాన్–సుపర్ణ్ ఎస్.వర్మ దర్శకత్వం వహించారు. కరణ్ అన్షుమాన్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ– ''రానా నాయుడు' లో రానా చీకటి జీవితం గడుపుతుంటాడు. కానీ తన కుటుంబాన్ని పోషించడానికి బాగా కష్ట పడతాడు. నా పాత్రలో ఎక్కువ కోపం చూపించే సన్నివేశాలున్నాయి. నిజ జీవితంలో నేను ప్రశాంతంగా ఉంటాను. కానీ ఈ సిరీస్‌లో కోపం ప్రదర్శించడం సవాలుగా అనిపించింది. అదృష్టవశాత్తూ మా బాబాయ్‌కి(వెంకటేష్), నాకు ఆఫ్ స్క్రీన్ కూడా మంచి బాండింగ్ ఉండటంతో నటించడం సులభం అయింది. వైరం ఉన్న పాత్రలో మెప్పించడం ఒక సవాల్‌తో కూడుకున్నప్పటికీ రానా, నాగా(వెంకటేష్ క్యారెక్టర్) పాత్రలు, వాటి మధ్య ఉండే ఆవేశం, భావోద్వేగాల పైనే దృష్టిపెట్టాం'' అన్నారు.

## యాక్షన్‌కి వేళాయె

విజయ్ దేవరకొండ యాక్షన్ మోడ్‌లోకి వెళ్లనున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా సమంత అనారోగ్య సమస్య, కాల్షీట్స్ సర్దుబాటు వంటి అంశాలతో 'ఖుషి' సినిమా షూటింగ్‌కు కాస్త బ్రేకులు పడ్డాయి. అయితే అతిత్వరలో ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లోనే ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ప్లాన్ చేశారు శివనిర్వాణ. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి పీటర్ హెయిన్ కొరియోగ్రఫీ చేయనున్నారు. 'ఖుషి' చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటోంది చిత్ర యూనిట్.


విజయ్ దేవరకొండ

## ఎమోషనల్ థ్రిల్లర్

దివంగత నటుడు నందమూరి తారక రామారావు మనవడు(జయకృష్ణ తనయుడు) చైతన్య కృష్ణ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బ్రీత్'. వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వం వహించారు. వైదిక సెంజలియా హీరోయిన్. బసవతారకరామ క్రియేషన్స్‌పై జయకృష్ణ నిర్మించారు. 'బ్రీత్' టైటిల్ పోస్టర్‌ని హీరో కల్యాణ్ రామ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''బ్రీత్' తో మా పెదనాన్న జయకృష్ణ నిర్మాతగా, మా అన్న చైతన్యకృష్ణ హీరోగా పరిచయమవుతుండటం హ్యాపీ. పోస్టర్ ఆసక్తిగా ఉంది. ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''ఎమోషనల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'బ్రీత్'. సినిమా చాలా బాగా వచ్చింది.. అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు జయకృష్ణ. ఈ చిత్రానికి కెమెరా: రాకేష్ హోసమణి, సంగీతం: మార్క్ కె.రాబిన్.


చైతన్య కృష్ణ

## అమ్ముతడా? సస్తడా?

'పుష్ప' ఫేమ్ జగదీశ్ ప్రతాప్ భండారి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సత్తిగాని రెండెకరాలు'. 'అమ్ము తడా? సస్తడా?' అనేది క్యాప్షన్. అభినవ్ దండా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 17 నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ కానున్నట్లు యూనిట్ ప్రకటించింది. ''కొల్లూరు నేపథ్యంలో పవర్‌ఫుల్ స్టోరీలైన్‌తో 'సత్తిగాని రెండెకరాలు' సినిమా రూపొందింది'' అని యూనిట్ పేర్కొంది.


జగదీశ్

## కృష్ణతత్త్వం నేపథ్యంలో...

అనసూయ, సాయి కుమార్, సుమన్, ఆమని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్‌వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, శేషు మారంరెడ్డి నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలో కృష్ణతత్త్వం నేపథ్యంలో సాగే తొలిపాటను హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్ అధ్యక్షుడు శ్రీ సత్య గౌరవ్ చంద్రదాస్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని మంగ్లీ పాడారు. జయశంకర్ మాట్లాడుతూ–''కథ ప్రకారం కృష్ణుడు గురించి అందరికీ అర్థమయ్యేలా ఓ పాట కావాలని కాసర్ల శ్యామ్‌ని కోరాను. కృష్ణుడి ఫిలాసఫీ, గీత తత్త్వం అందరికీ అర్థమయ్యేలా రాసిచ్చారాయన'' అన్నారు. ''ఈ సినిమాలో మంచి పాత్ర చేశాను'' అన్నారు సాయికుమార్. ''అరి' బాగుంటుంది'' అన్నారు శేషు మారంరెడ్డి. ఈ కార్యక్రమంలో కాసర్ల శ్యామ్, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవ్ నాయర్, నటి, యాంకర్ అంజలి పాల్గొన్నారు.


శేషు, శ్యామ్, జయశంకర్, శ్రీ సత్య గౌరవ్, సాయికుమార్

## వేసవిలో అహింస


గీతిక, అభిరామ్

నిర్మాత సురేశ్ బాబు తనయుడు, హీరో రానా సోదరుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. తేజ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గీతికా తివారీ హీరోయిన్. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై పి.కిరణ్ నిర్మించారు. కాగా 'అహింస' సినిమాని వేసవి కానుకగా ఏప్రిల్ 7న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''యూత్‌ఫుల్ లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'అహింస' ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. రజత్ బేడీ, సదా, రవి కాలే, కమల్ కామరాజు, మనోజ్ టైగర్, కల్పలత, దేవీ ప్రసాద్ నటించిన ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: ఆర్పీ పట్నాయక్.

## వ్యాయామం చేయడం మంచిదైంది

– సుస్మితాసేన్

మాజీ మిస్‌వరల్డ్, నటి సుస్మితాసేన్ ఇటీవల తీవ్ర గుండెపోటుకు గురైన సంగతి తెలిసిందే. ఆమెకు వైద్యులు యాంజియోప్లాస్టీ చేసి, స్టంట్ వేశారు. దీంతో ఆమె ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉంది. అయితే తన తాజా ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ ఓ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేశారు సుస్మితాసేన్. ''ఇటీవల నేను తీవ్ర గుండెపోటుకు గురయ్యాను. ప్రధాన రక్తనాళం 95 శాతం క్లోజ్ అయ్యింది. వైద్యులు నా కోసం ఎంతో శ్రమించారు. హాస్పిటల్ సిబ్బందికి, నా కోసం ప్రార్థనలు చేసిన వారందరికీ ధన్యవాదాలు. నా గొంతు ఇప్పుడు సరిగ్గాలేదు. కానీ భయడాల్సిన పనేంలేదు. చిన్న ఇన్‌ఫెక్షన్ మాత్రమే. ఇటీవల ఎక్కువగా గుండెపోటు కేసులు నమోదు కావడాన్ని గమనిస్తున్నాం. దయచేసి వ్యాయామాలు చేయండి. జిమ్‌కు వెళ్లడం వల్ల ఏం ఉపయోగం లేదని కొందరు భావిస్తుంటారు. కానీ, నా విషయంలో వ్యాయామాలు చేయడం ఉపయోగపడింది. ఓ యాక్టివ్ లైఫ్‌ను లీడ్ చేస్తున్నందునే ఈ ప్రమాదం నుంచి బయటపడగలిగాను. నా ఆరోగ్యం గురించి వైద్యులు ఓకే చెప్పగానే 'ఆర్య' లేటెస్ట్ సీజన్ కోసం జైపూర్ వెళ్తాను. 'తాలి' సినిమాకు డబ్బింగ్ చెప్పాల్సి ఉంది'' అన్నారు సుస్మితాసేన్.



## మహిళల సమస్యలపై...


నోయల్, రమేష్, భానుశ్రీ

నోయల్ సీన్, 'బిగ్ బాస్' ఫేమ్ భానుశ్రీ జంటగా దొంతు రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈఎమ్ఐ– ఈ అమ్మాయి'. దొంతు బుచ్చయ్య, బమ్మిడి సంగీత సమర్పణలో డి.రమేష్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ''ప్రపంచంలో అన్ని వస్తువులు ఈఎమ్ఐలో దొరుకుతాయి. అమ్మాయి కూడా అలాగే దొరికితే ఎలా ఉంటుంది? అనేదే మా చిత్ర కథ'' అన్నారు దొంతు రమేష్. ''మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో నిర్మించిన చిత్రమిది'' అన్నారు దొంతు బుచ్చయ్య.

## వెబ్ ఎంట్రీ

హీరోయిన్ జ్యోతిక వెబ్ ఎంట్రీ ఖరారు అయినట్లుగా తెలుస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి హిందీ నిర్మాణ సంస్థ ఎక్సెల్ ఎంటర్‌టైన్మెంట్‌పై నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సద్వానీ రెండో వెబ్‌సిరీస్ నిర్మించనున్నారు. సోనాలీ బోస్ దర్శకత్వం వహించనున్న ఈ వెబ్‌సిరీస్‌లో ఓ లీడ్ యాక్ట్రస్‌గా జ్యోతికను అనుకున్నారట మేకర్స్. స్క్రిప్ట్ నచ్చడంతో ఆమె కూడా ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ టాక్. ఐదుగురు గృహిణులు రహస్యంగా ఓ వ్యాపారాన్ని మొదలుపెట్టినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? అన్నదే ఈ వెబ్‌సిరీస్ కథాంశమట. దీనిపై అధికారిక ప్రకటన వెల్లడైతే జ్యోతిక నటించే తొలి వెబ్‌సిరీస్ ఇదే అవుతుంది.


జ్యోతిక

## పగ కూడా అంతే!

సృష్టిడాంగే ప్రధాన పాత్రలో ఎమ్‌ఏ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరఖడ్గం'. బ్రహ్మానందం, సత్యప్రకాష్, ఆనంద్ రాజ్ కీలక పాత్రలు చేశారు. కె.కోటేశ్వరరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల మూడోవారంలో రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఎమ్‌ఏ చౌదరి మాట్లాడుతూ–''చరిత్ర శిథిలమైనా, దాని మూలాలు ఎక్కడో ఒక చోట మిగిలే ఉంటాయి.. పగ కూడా అంతే. వాస్తవాన్ని వెంటాడుతూ గతం చేసిన యుద్ధమే 'వీరఖడ్గం'' అన్నారు. ''సినిమా బాగా వచ్చింది'' అన్నారు లైన్‌ప్రొడ్యూసర్, ఫైనాన్షియర్ సునీల్‌కుమార్.



సృష్టిడాంగే



## 'అమ్మాయిల ఆటకు డబ్ల్యూపీఎల్‌తో అందలం'

దేశంలో మహిళా క్రికెటర్ల కలలు సాకారమయ్యేందుకు డబ్ల్యూపీఎల్ దోహదం చేస్తుందని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ అన్నారు. 'మరెంతో మంది యువ క్రీడాకారిణిలు క్రికెట్‌వైపు మళ్లేందుకు, కెరీర్‌గా ఎంచుకునేందుకు డబ్ల్యూపీఎల్ ఉపయోగపడుతుంది. ఇందులో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. తొలి మ్యాచ్‌లో తమ ఫ్రాంచైజీ భారీ విజయం సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నా' అని నీతా అంబానీ వ్యాఖ్యానించారు.

## బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి చాంప్ వెర్‌స్టాపెన్



ఫార్ములావన్ సీజన్‌లోని తొలి రేసు బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ నిర్ణీత 57 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 33 నిమిషాల 56.736 సెకన్లలో ముగించి టైటిల్ సాధించాడు. పెరెజ్ (రెడ్‌బుల్) రెండో స్థానంలో, అలోన్సో (ఆస్టన్ మార్టిన్) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని రెండో రేసు సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.



గ్రేస్ హారిస్

# 'గ్రేట్' హారిస్...

- యూపీని ఒంటిచేత్తో గెలిపించిన గ్రేస్ హారిస్
- 26 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్
- గుజరాత్‌కు రెండో ఓటమి

**ముంబై:** పురుషుల లీగ్‌కు ఏమాత్రం తీసిపోని మ్యాచ్ మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)కు వన్నెలద్దింది. ఉత్తరప్రదేశ్ (యూపీ) వారియర్స్ 'హిట్టర్' గ్రేస్ హారిస్ (26 బంతుల్లో 59 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆఖరి ఓవర్ మెరుపులతో మ్యాచ్ ఫలితాన్నే మార్చింది. 170 లక్ష్యం ఛేదించే క్రమంలో యూపీ ఒకదశలో 105/7 స్కోరుతో ఓటమికి దగ్గరైంది. ఈ దశలో సోఫీ ఎకిల్‌స్టోన్ (12 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అండతో హారిస్ ధనాధన్ 'గ్రేట్' ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించింది. అబేధ్యమైన 8వ వికెట్‌కు ఈ ఇద్దరు 4.1 ఓవర్లలో 70 పరుగులు జోడించి యూపీని గెలిపించారు. ఆఖరి ఓవర్లో యూపీకి 19 పరుగుల కావాల్సి ఉండగా.. అనాబెల్ వేసిన ఈ ఓవర్‌లో గ్రేస్ వరుసగా 6, వైడ్, 2, 4, వైడ్, 4, 6లతో ఏకంగా 24 పరుగులు పిండుకుంది. దీంతో యూపీ 3 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. అంతకుముందు గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 169 పరుగులు చేసింది. హర్లీన్ డియోల్ (32 బంతుల్లో 46; 7 ఫోర్లు) రాణించగా, సబ్బినేని మేఘన (15 బంతుల్లో 24; 5 ఫోర్లు), ఆష్లే గార్డ్‌నర్ (19 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (13 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. యూపీ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్, దీప్తి శర్మ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన యూపీ వారియర్స్ 19.5 ఓవర్లలో 7 వికెట్లకు 175 పరుగులు చేసి గెలిచింది. కిమ్ గార్త్ (5/36) యూపీని బెంబేలెత్తించినా ఫలితం లేకపోయింది.

**స్కోరు వివరాలు**

**గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్:** మేఘన (సి) శ్వేత (బి) సోఫీ 24; సోఫియా (బి) దీప్తి 13; హర్లిన్ (సి) తాలియా (బి) అంజలి శర్వాణి 46; అనాబెల్ సదర్లాండ్ (సి) అంజలి (బి) సోఫీ 8; సుష్మ (సి) శ్వేత (బి) తాలియా 9; గార్డ్‌నర్ (స్టంప్డ్) హీలీ (బి) దీప్తి 25; హేమలత (నాటౌట్) 21; స్నేహ్ రాణా (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 169. వికెట్ల పతనం: 1–34, 2–38, 3–50, 4–76, 5–120, 6–142. బౌలింగ్: రాజేశ్వరి 4–0–30–0, అంజలి శర్వాణి 4–0–43–1, దీప్తి 4–0–27–2, సోఫీ 4–0–25–2, తాలియా 2–0–18–1, దేవిక 2–0–24–0.

**యూపీ వారియర్స్ ఇన్నింగ్స్:** హీలీ (సి అండ్ బి) గార్త్ 7; శ్వేత (సి) మాన్సి (బి) గార్త్ 5, కిరణ్ నవ్‌గిరే (సి) సుష్మ (బి) గార్త్ 53; తాలియా (సి) హేమలత (బి) గార్త్ 0; దీప్తి (బి) మాన్సి 11; గ్రేస్ హారిస్ (నాటౌట్) 59; సిమ్రన్ (బి) గార్త్ 0; దేవిక (సి) హేమలత (బి) అనాబెల్ 4; సోఫీ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (19.5 ఓవర్లలో 7 వికెట్లకు) 175. వికెట్ల పతనం: 1–13, 2–19, 3–20, 4–86, 5–88, 6–88, 7–105. బౌలింగ్: కిమ్ గార్త్ 4–0–36–5, తనూజ 4–0–29–0, గార్డ్‌నెర్ 4–0–34–0, అనాబెల్ 3.5–0–41–1, స్నేహ్ రాణా 2–0–16–0, మాన్సి 2–0–15–1.

# షఫాలీ, లానింగ్ ధనాధన్

- ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ల మెరుపులు
- 60 పరుగులతో బెంగళూరు ఓటమి
- డబ్ల్యూపీఎల్ టోర్నీ





తారా నోరిస్

షఫాలీ

మెగ్ లానింగ్

**ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో పరుగుల హోరెత్తుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ 200 పైచిలుకు పరుగులు నమోదయ్యాయి. ఢిల్లీక్యాపిటల్స్ ఓపెనర్లు షఫాలీ వర్మ (45 బంతుల్లో 84; 10 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ మెగ్ లానింగ్ (43 బంతుల్లో 72; 14 ఫోర్లు) చెలరేగారు. బౌలింగ్‌లో తారా నోరిస్ (5/29) నిప్పులు చెరగడంతో ఢిల్లీ 60 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై జయభేరి మోగించింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో మొదట ఢిల్లీ 20 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి 223 పరుగుల భారీస్కోరు చేసింది. మహిళల టి20 క్రికెట్‌లో ఇది రెండో అత్యధిక స్కోరు కావడం విశేషం. ఓపెనర్లు లానింగ్, షఫాలీ తొలి వికెట్‌కు 162 పరుగులు జోడించారు. షఫాలీ 31 బంతుల్లో (5 ఫోర్లు, 3 సిక్స్‌లు)... లానింగ్ 30 బంతుల్లో (10 ఫోర్లు) అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఆఖర్లో మరిజన్ కాప్ (17 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సర్లు), జెమీమా (15 బంతుల్లో 22 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడారు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 163 పరుగులే చేయగలిగింది. కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన (23 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలీస్ పెర్రీ (19 బంతుల్లో 31; 5 ఫోర్లు), హీథెర్‌నైట్ (21 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుగ్గా ఆడారు. తారా నోరిస్ 5, అలైస్ క్యాప్సీ 2 వికెట్లు తీశారు.

**స్కోరు వివరాలు**

**ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్:** లానింగ్ (బి) హీథెర్‌నైట్ 72; షఫాలీ (సి) రిచా (బి) హీథెర్‌నైట్ 84; మరిజన్ కాప్ (నాటౌట్) 39; జెమీమా (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 223. వికెట్ల పతనం: 1–162, 2–163. బౌలింగ్: రేణుక సింగ్ 3–0–24–0, మేగన్ 4–0–45–0, ప్రీతి 4–0–35–0, పెర్రీ 3–0–29–0, సోఫీ డివైన్ 1–0–20–0, శోభన 2–0–29–0, హీథెర్‌నైట్ 3–0–40–2.

**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** స్మృతి మంధాన (సి) శిఖా (బి) క్యాప్సీ 35; సోఫీ డివైన్ (సి) షఫాలీ (బి) క్యాప్సీ 14; పెర్రీ (బి) నోరిస్ 31; దిశ (సి) క్యాప్సీ (బి) నోరిస్ 9; రిచా (సి) రాధ (బి) నోరిస్ 2; హీథెర్‌నైట్ (సి) లానింగ్ (బి) నోరిస్ 34; కనిక (సి) షఫాలీ (బి) నోరిస్ 0; శోభన (సి) రాధ (బి) శిఖా 2; మేగన్ (నాటౌట్) 30; ప్రీతి బోస్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 163. వికెట్ల పతనం: 1–41, 2–56, 3–89, 4–90, 5–93, 6–93, 7–96, 8–150. బౌలింగ్: శిఖా పాండే 4–0–35–1, మరిజన్ కాప్ 4–0–36–0, జొనసెన్ 4–0–28–0, అలైస్ క్యాప్సీ 2–0–10–2, రాధ యాదవ్ 2–0–24–0, తారా నోరిస్ 4–0–29–5.

# సొంతగడ్డపై భావోద్వేగం...

ఆఖరి మ్యాచ్ ఆడిన సానియా మీర్జా • హాజరైన ప్రముఖులు



సానియా, యువరాజ్, బోపన్న, బెథానీ సెల్ఫీ



సానియా, తనయుడు ఇజ్‌హాన్

**సాక్షి, హైదరాబాద్:** టెన్నిస్ ఆటలో తొలి అడగులు వేసిన స్వస్థలం హైదరాబాద్‌లో భారత దిగ్గజం సానియా మీర్జా అభిమానుల కోసం చివరిసారిగా రాకెట్ పట్టింది. అంతర్జాతీయ సర్క్యూట్‌లో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనకు భాగస్వాములుగా వ్యవహరించిన బెథానీ మాటెక్ సాండ్స్ (అమెరికా), కారా బ్లాక్ (జింబాబ్వే), ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా), రోహన్ బోపన్న (భారత్)లతో కలిసి సానియా ఎల్బీ టెన్నిస్ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడింది. తన స్నేహితుడు, భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్, వింబుల్డన్ మాజీ చాంపియన్ మరియన్ బర్తోలి (ఫ్రాన్స్) కూడా కాసేపు రాకెట్ పట్టి సానియాతో కలసి ఆడారు. సానియా మ్యాచ్ తిలకించడానికి వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుత కేంద్ర న్యాయశాఖ మంత్రి, కేంద్ర మాజీ క్రీడల మంత్రి కిరణ్ రిజిజు, తెలంగాణ రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజహరుద్దీన్, రాబిన్ ఉతప్ప, అనన్య బిర్లా, సినీ నటులు దుల్కర్ సల్మాన్, హుమా ఖురేషి, బీసీసీఐ జూనియర్ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ చాముండేశ్వరీనాథ్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సానియా కుటుంబ సభ్యులు ఈ మ్యాచ్‌ను తిలకించారు. మ్యాచ్ ముగిశాక మంత్రి కేటీఆర్ సానియాను సన్మానించారు. 'నా ఆఖరి మ్యాచ్ సొంతగడ్డపై ఆడినందుకు ఆనందంగా ఉంది. ఇది సాధ్యం కావడానికి సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి నా ధన్యవాదాలు. ఎల్బీ స్టేడియంతో నాకెంతో అనుబంధం ఉంది. ఇక్కడితో టెన్నిస్ ఆడటం మానేస్తున్నా. అయితే భవిష్యత్‌లో ఈ ఆటతో మాత్రం కొనసాగుతా. నా వీడ్కోలు మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన వారందరికీ ధన్యవాదాలు. నేను ఇంత భావోద్వేగానికి గురవుతానని అనుకోలేదు. ఇవీ ఆనందభాష్పాలే. ఈ స్థాయిలో వీడ్కోలు లభిస్తుందని ఆశించలేదు. భవిష్యత్‌లో మరింత మంది సానియా మీర్జాలు వస్తారని ఆకాంక్షిస్తున్నాను' అని గత నెలలో దుబాయ్ ఓపెన్‌తో అంతర్జాతీయ టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పిన 36 ఏళ్ల సానియా వ్యాఖ్యానించింది.

## పీవీఎల్ చాంప్ అహ్మదాబాద్ డిఫెండర్స్

**కొచ్చి:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) రెండో సీజన్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 15–7, 15–10, 18–20, 13–15, 15–10తో బెంగళూరు టోర్పిడోస్ జట్టుపై గెలిచింది. అహ్మదాబాద్ తరఫున అంగముత్తు రామస్వామి 16 పాయింట్లు, సంతోష్ 11 పాయింట్లు స్కోరు చేశారు. బెంగళూరు తరఫున పంకజ్ శర్మ 11 పాయింట్లు, ముజీబ్ తొమ్మిది పాయింట్లు సాధించారు.

## డబ్ల్యూపీఎల్‌లో నేడు

ముంబై ఇండియన్స్ X బెంగళూరు
రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

## ఇరానీ కప్ విజేత రెస్ట్ ఆఫ్ ఇండియా

**గ్వాలియర్:** ఆద్యంతం ఆధిపత్యం చాటుకున్న రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు 30వ సారి ఇరానీ కప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టుతో ఆదివారం ముగిసిన ఐదు రోజుల ఫైనల్లో మయాంక్ అగర్వాల్ కెప్టెన్సీలోని రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు 238 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 437 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 58.4 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 81/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ ఆట చివరిరోజు మరో 117 పరుగులు జోడించి మిగతా ఎనిమిది వికెట్లు కోల్పోయింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో సౌరభ్ కుమార్ మూడు వికెట్లు తీయగా... ముకేశ్ కుమార్, అతీత్, పుల్కిత్ నారంగ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

## భవిత



# విద్య, ఉద్యోగ సమాచారం

### బీఎస్ఎఫ్‌లో 1284 ట్రేడ్స్‌మ్యాన్ పోస్టులు

భారత కేంద్ర హోంమంత్రిత్వ శాఖలో భాగంగా ఉన్న సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్).. కానిస్టేబుల్(ట్రేడ్స్‌మ్యాన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1284 » **పోస్టుల వివరాలు:** పురుషులు–1220, మహిళలు–64.
» **విభాగాలు:** కోబ్లర్, టైలర్, వాషర్‌మెన్, బార్బర్, స్వీపర్, కుక్, వెయిటర్ తదితరాలు.
» **అర్హత:** మెట్రిక్యులేషన్/పదో తరగతి/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. కొన్ని ట్రేడుల్లో ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవల్ 1 కోర్సు పూర్తిచేయాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు. రాతపరీక్షలో భాగంగా 100 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులకు ట్రేడ్ టెస్ట్ కూడా నిర్వహిస్తారు. ఇందులోనూ అర్హత సాధించాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.03.2023.
» **వెబ్‌సైట్:** rectt.bsf.gov.in

### ఏపీపీఎస్సీ–ఆర్ఐఎంసీలో ఎనిమిదో తరగతి ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(ఆర్ఐఎంసీ)లో జనవరి–2024 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2024 జనవరి నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. **వయసు:** 01.01.2024 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా.. పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. 02.01.2011 నుంచి 01.07.2012 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వాయిస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్షా విధానం:** రాతపరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. అవి.. మ్యాథమేటిక్స్(200 మార్కులు), జనరల్ నాలెడ్జ్(75 మార్కులు), ఇంగ్లిష్(125 మార్కులు)నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైవా వాయిస్(50 మార్కులు) నిర్వహిస్తారు. రాతపరీక్ష, వైవా వాయిస్ కలిపి మొత్తం 450 మార్కులు కేటాయించారు. దీనిలో కనీస ఉత్తీర్ణత మార్కులు 50% ఉండాలి. ఈ రెండింటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు చివరిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఆర్ఐఎంసీ పంపిన దరఖాస్తు ఫారం నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఏపీపీఎస్సీ చిరునామకు పంపించాలి.
» **పరీక్షా కేంద్రం:** హైదరాబాద్‌లో మాత్రమే.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.
» **పరీక్ష తేది:** 03.06.2023.
» **వెబ్‌సైట్:** psc.ap.gov.in

### మహాత్మా జ్యోతిబాపులే ఆర్‌జేసీ/ఆర్‌డీసీ సెట్–2023

మహాత్మాజ్యోతిబాపులే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్)..రాష్ట్రంలోని వివిధ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ప్రవేశ పరీక్ష ఆధారంగా ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి ఏడాదిలో ప్రవేశాలు కల్పిస్తారు.

» **జూనియర్ కళాశాలలు(ఇంగ్లిష్ మీడియం):** మొత్తం–255(బాలురు–130, బాలికలు–125). **ఇంటర్ గ్రూపులు(ఇంగ్లిష్ మీడియం):** ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ఇతర వృత్తి విద్యా కోర్సులు. **అర్హత:** పదో తరగతి/ఎస్ఎస్‌సీ చదువుతున్న అర్హులు.
» **మహిళా డిగ్రీ కళాశాలలు:**14(ఇంగ్లిష్ మీడియం) మహిళలు–06, పురుషులు–08. **అర్హత:** ఇంటర్ సెకండియర్ చదువుతున్నవారు అర్హులు.

**కళాశాలలు అందిస్తున్న డిగ్రీ కోర్సులు**

» **బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్:** ఎంపీసీ, ఎంసీసీఎస్, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్ఏఐ అండ్ ఎంఎల్, ఎంపీజీ,ఎంఈఎస్ అండ్ ఎంఈసీఎస్.
» **బీఎస్సీ లైఫ్ సైన్సెస్:** బీజెడ్‌సీ, బీజెడ్‌జీ, బీబీసీసీ, బీటీబీసీసీ, బీటీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, ఎన్‌జెడ్‌సీ అండ్ ఏఎన్‌పీహెచ్‌బీసీ.
» **బీకామ్:** జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అనలిటిక్స్. » **బీఏ:**ఈపీహెచ్,హెచ్‌పీఈ,ఐఆర్ఈపీ,పీపీజీఈపీ. » బీబీఏ, బీఎఫ్‌టీ.
» **ఎంపిక విధానం:** ప్రవేశపరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.04.2023.
» **హాల్‌టికెట్లు డౌన్‌లోడింగ్ తేది:** 20.04.2023.
» **ప్రవేశపరీక్ష తేది:** 29.04.2023.
» **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

# 'నెస్ట్'.. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీకి బెస్ట్!





» నెస్ట్ స్కోర్ ఆధారంగా నైసర్, సీఈబీఎస్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ
» ఇంటర్మీడియెట్ సైన్స్ గ్రూప్ విద్యార్థులు అర్హులుగా నెస్ట్
» ప్రవేశం పొందితే అయిదేళ్లపాటు స్కాలర్‌షిప్, ఇతర ప్రోత్సాహకాలు
» పరిశోధనల దిశగా అడుగులు వేసే మార్గం

నెస్ట్.. నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్! ఈ ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపితే.. ఇంటర్ పూర్తి చేస్తూనే.. నేరుగా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో అడుగు పెట్టొచ్చు! అది కూడా దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్‌లుగా గుర్తింపు పొందిన.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్), యూనివర్సిటీ ఆఫ్ ముంబై - డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్‌లో అడ్మిషన్ లభిస్తుంది. ఇటీవల నెస్ట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో నెస్ట్ వివరాలు, ప్రవేశాలు కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూట్స్ ప్రాధాన్యత, అకడమిక్‌గా లభించే అవకాశాలు, ప్రోత్సాహకాలు, నెస్ట్‌లో విజయానికి ప్రిపరేషన్ విధానం...

దేశంలో సైన్స్ విద్య, పరిశోధనలో పేరున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)–భువనేశ్వర్,అదే విధంగా ముంబై యూనివర్సిటీలో అణు శక్తి విభాగం నెలకొల్పిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(సీఈబీఎస్) ఇన్‌స్టిట్యూట్స్‌లోని ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశం కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఎంట్రన్స్.. నెస్ట్.

**అర్హతలు**

- సైన్స్ గ్రూప్‌లతో 2021, 2022 సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సుల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. • 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** ఆగస్ట్ 1, 2003 తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగులకు గరిష్ట వయోపరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

**మొత్తం 257 సీట్లు**

- నెస్ట్ స్కోర్ ఆధారంగా.. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ప్రవేశం కల్పించే నైసర్ –భువనేశ్వర్, సీఈబీఎస్‌లలో మొత్తం 257 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నైసర్ భువనేశ్వర్‌లో 200, సీఈబీఎస్‌లో 57 సీట్లు ఉన్నాయి.
- నైసర్–భువనేశ్వర్‌లో బయాలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ విభాగాల్లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బోధిస్తున్నారు. •సీఈబీఎస్‌లోనూ ఇవే సబ్జెక్ట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ అందుబాటులో ఉంది.
- నెస్ట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం ఖరారు చేసుకున్న అభ్యర్థులు.. తమ అకడమిక్ అర్హతలకు అనుగుణంగా ఏదో ఒక సబ్జెక్ట్‌లో పీజీ ఎంచుకోవచ్చు. • మేజర్ సబ్జెక్ట్‌తోపాటు బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ వంటి సబ్జెక్ట్‌లను మైనర్ సబ్జెక్ట్‌లుగా ఎంచుకునే అవకాశం ఉంటుంది.
- నెస్ట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులు రెండు ఇన్‌స్టిట్యూట్స్‌కు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**నాలుగు విభాగాలు.. 200 మార్కులు**

- నెస్ట్ నాలుగు విభాగాలుగా(బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్) 200 మార్కులకు ఉంటుంది. ప్రతి విభాగానికి 50 మార్కులు కేటాయించారు. అదే విధంగా.. ప్రతి విభాగంలో 17 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 12 ప్రశ్నలు ఎంసీక్యూలుగా, అయిదు ప్రశ్నలు మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు ఉంటాయి.
- మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలకు 2.5 మార్కులు చొప్పున,మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్ టైప్ కొశ్చన్స్‌కు నాలుగు మార్కులు చొప్పున కేటాయిస్తారు.
- ఇలా ప్రతి సెక్షన్‌లో 17 ప్రశ్నలతో 50 మార్కులు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- మొత్తం రెండు సెషన్లుగా పరీక్షను నిర్వహిస్తారు. అభ్యర్థులు ఏదో ఒక సెషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.
- నాలుగు సెక్షన్లలో మూడు సెక్షన్లు ఎంచుకునే అవకాశం ఉంది. నాలుగు సెక్షన్లు కూడా రాయొచ్చు.
- మెరిట్ లిస్ట్ రూపకల్పనలో.. నాలుగు సెక్షన్లలో అత్యధిక మార్కులు పొందిన మూడు సెక్షన్లనే పరిగణనలోకి తీసుకుని అందులో పొందిన మార్కులను గణించి మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు.
- ప్రతి సెక్షన్‌లోనూ కొన్ని ప్రశ్నలకు నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. • కొన్ని ప్రశ్నలు ఒకటి కంటే ఎక్కువ సమాధానాలతో ఉంటాయి.
- నెస్ట్‌లో స్కోర్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించే క్రమంలో.. ప్రతి సెక్షన్‌లోనూ అభ్యర్థులు పొందాల్సిన కనీస అర్హత మార్కులను నిర్దేశించారు.

**ఓవరాల్ కటాఫ్ నిబంధన**

- నెస్ట్ స్కోర్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపకల్పనలో సెక్షన్‌వారీగా కనీస అర్హత మార్కుల నిబంధన మాత్రమే కాకుండా.. మినిమమ్ అడ్మిషబుల్ పర్సంటైల్ పేరుతో ఓవరాల్ కటాఫ్‌ను కూడా నిర్దేశిస్తున్నారు.
- జనరల్ కేటగిరీ అభ్యర్థులు 95 పర్సంటైల్, ఓబీసీ అభ్యర్థులు 90 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీ అభ్యర్థులు 75 పర్సంటైల్ సాధించాల్సి ఉంటుంది.

**సీటు సాధిస్తే.. స్కాలర్‌షిప్**

- నెస్ట్ స్కోర్ ఆధారంగా.. నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులకు అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ వ్యవధిలో.. స్కాలర్‌షిప్, ఇంటర్న్‌షిప్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం కూడా అందిస్తారు.
- ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్ పేరిట నెలకు రూ.అయిదు వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు స్కాలర్‌షిప్ అందిస్తారు.
- ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌నకు అర్హత పొందని వారికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రవేశ పెట్టిన దిశ ప్రోగ్రామ్ ద్వారా నెలకు రూ.5000 స్కాలర్‌షిప్ లభిస్తుంది.
- ప్రతి ఏటా సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసేందుకు రూ.20 వేలు గ్రాంట్ మంజూరు చేస్తారు.

**నెస్ట్‌తో మరిన్ని ప్రయోజనాలు**

- నైసర్–భువనేశ్వర్, యూనివర్సిటీ ఆఫ్ ముంబై –డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ పూర్తి చేసిన వారికి పీహెచ్‌డీ ప్రవేశాల్లోనూ ప్రాధాన్యత ఉంటుంది.
- ఈ ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి భవిష్యత్తులో రీసెర్చ్ ల్యాబ్స్‌లో, సంస్థల ఆర్ అండ్ డీ సెంటర్లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.
- భవిష్యత్తులో పీహెచ్‌డీ పట్టా అందుకుని యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీగా, ప్రముఖ రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్ట్‌లుగా రూ.లక్షల వేతనంతో కెరీర్ సొంతం చేసుకోవచ్చు.

**పరిశోధనలకు మార్గం**

- నెస్ట్ ద్వారా ప్రవేశం ప్రవేశం పొందిన విద్యార్థులు.. ఐదేళ్ల వ్యవధిలో పది సెమిస్టర్లుగా ఉండే ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- ఈ పది సెమిస్టర్లలోనూ.. ఆరు సెమిస్టర్లలో సదరు క్యాంపస్‌లోని ఫ్యాకల్టీ సభ్యులు చేస్తున్న రీసెర్చ్‌లో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుంది. దీని ఆధారంగానూ అభ్యర్థులకు మార్కులు, క్రెడిట్స్ కేటాయిస్తారు. ఇలాంటి నిబంధన నేపథ్యంలో విద్యార్థులకు పీజీ స్థాయిలోనే రీసెర్చ్ దిశగా ఆసక్తిని పెంచుకునే అవకాశం, రీసెర్చ్ కార్యకలాపాలపై అవగాహన లభిస్తాయి.

**బార్క్‌లో.. పీహెచ్‌డీ!**

నెస్ట్ స్కోర్‌తో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో సీటు ఖరారు చేసుకున్న వారికి భవిష్యత్తులో కలిసొచ్చే మరో అంశం.. ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థ బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ ట్రైనింగ్ స్కూల్‌లో ప్రవేశానికి నేరుగా ఇంటర్వ్యూకి హాజరయ్యే అవకాశం కల్పించడం. ఇందుకోసం విద్యార్థులు ఎమ్మెస్సీ కోర్సును నిర్దిష్ట మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ మార్కులను ప్రతి ఏటా బార్క్ నిర్దేశిస్తుంది.

**నెస్ట్‌లో విజయం సాధించాలంటే**

- నెస్ట్‌లో విజయం సాధించాలంటే.. విద్యార్థులు ప్రధానంగా ఇంటర్మీడియెట్ స్థాయిలో తాము చదివిన అకడమిక్స్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలి.
- ప్రధానంగా..బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించి అడిగే ప్రశ్నలు..విద్యార్థుల్లోని విశ్లేషణాత్మక దృక్పథం, సంగ్రహణ సామర్థ్యం, తులనాత్మక విశ్లేషణను గుర్తించేలా ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించడంతోపాటు వాటిని వాస్తవ పరిస్థితుల్లో అన్వయించగలిగే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందుకోసం చదువుతున్న అంశాలను ప్రాక్టీస్ చేయడం ఎంతో లాభిస్తుంది.
- నెస్ట్ ఎంట్రన్స్.. విభాగాల వారీగా గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే.. ప్రశ్నలు సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా అడుగుతున్నట్లు తెలుస్తోంది. కాబట్టి అభ్యర్థులు పది, పదకొండు, పన్నెండు తరగతుల సీబీఎస్ఈ పుస్తకాలను ఔపోసన పట్టడం మేలు చేస్తుంది. ముఖ్యంగా కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి.
- ఇలా అకడమిక్ సబ్జెక్ట్‌లపై కాన్సెప్ట్‌లతోపాటు అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్ సాగిస్తే నెస్ట్‌లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.
- జేఈఈ–మెయిన్, జేఈఈ–అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు అదే ప్రిపరేషన్‌తో నెస్ట్‌కు కూడా హాజరై ప్రతిభ చూపే అవకాశం ఉంది.

**నెస్ట్-2023 ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 17.05.2023
- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం: 12.06.2023
- నెస్ట్–2023 పరీక్ష తేదీ: 24.06.2023
- ఫలితాల వెల్లడి: 10.07.2023
- వెబ్‌సైట్: www.nestexam.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 900 | 272 |
| 59,809 | 17,594 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,689 | ▲ | 226 |
| డోజోన్స్ | 33,391 | ▲ | 387 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,947 | ▲ | 3 |
| డాక్స్ | 15,578 | ▲ | 251 |
| షాంఘై | 3,328 | ▲ | 18 |
| నికాయ్ | 27,927 | ▲ | 429 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 81.59 | 83.26 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 96.96 | 100.27 |
| € | యూరో | ఎస్‌బీఐ | 85.86 | 88.94 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 59.36 | 61.26 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 54.45 | 56.80 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 60.21 | 62.15 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 20.86 | 22.53 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.42 | 23.21 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.75 | 12.82 |

# ఈపీఎఫ్‌వో అధిక పెన్షన్.. అంత ఈజీ కాదు!?




- వాస్తవ వేతనం ఆధారంగా పెన్షన్ నిధికి జమ
- ఇది కోరుకుంటే ఆప్షన్ ఇవ్వాలి
- అప్పుడు గత కాలం బ్యాలన్స్ చెల్లించాలి
- అది ఎలా అన్నదానిపై స్పష్టత లేదు
- పెన్షన్ లెక్కింపునూ తేల్చని ఈపీఎఫ్‌వో
- 15 ఏళ్ల సర్వీస్ ఉంటే అధిక పెన్షన్



**సుదీర్ఘ పోరాటం తర్వాత వేతన జీవుల ఆకాంక్ష అయిన అధిక పెన్షన్ కల సాకారమైంది. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) పరిధిలోని ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్ 95) కింద అధిక పెన్షన్‌కు అర్హత లభించింది. 2014 సెప్టెంబర్ 1 నాటికి ఈపీఎస్ సభ్యులుగా ఉన్నవారు, అంతకుముందు రిటైర్మెంట్ తీసుకున్న వారు, తమకు అధిక పెన్షన్ కావాలంటూ ఆప్షన్ ఇచ్చుకోవచ్చు. ఇందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. దరఖాస్తు చేసుకోవచ్చంటూ ఈపీఎఫ్‌వో ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగి తన సంస్థ తరఫున ఉమ్మడి దరఖాస్తు పత్రాన్ని ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అధిక పెన్షన్ కావాలంటూ ఆప్షన్ ఇవ్వాలా? వద్దా..? ఎవరు అర్హులు? తదితర అంశాలపై వేతన జీవుల్లో ఎన్నో సందేహాలు నెలకొనగా.. దీన్ని ఎలా అమలు చేయాలి? అనే విషయమై ఈపీఎఫ్‌వోలోనూ స్పష్టత కొరవడింది. ఈ నేపథ్యంలో దీనిపై ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న వివరాలతో ప్రత్యేక కథనమిది...**

## ప్రతి నెలా అధికంగా కోత..

అధిక పెన్షన్ ఆప్షన్ ఎంపిక చేసుకుంటే అది 2014 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు అవుతుంది. కనుక సర్వీసులో ఉన్న వారు నాటి నుంచి నేటి వరకు అధిక పెన్షన్ కోసం అదనపు నిధిని జమ చేయాల్సి ఉంటుంది. దీన్ని భవిష్యనిధి నుంచి మళ్లించడానికి ప్రస్తుత నిబంధనలు ఒప్పుకోవడం లేదు. గత కాలానికి సంబంధించిన ఈపీఎస్ బకాయి కనుక, అది సంస్థ (ఎంప్లాయర్) సర్దుబాటు చేయాలా? లేదంటే ఉద్యోగి జమ చేయాలా? దీనిపైనా స్పష్టత లేదు. ప్రస్తుత ఫార్ములా ప్రకారం రూ.15,000 వేతనంపై 12 శాతం (రూ.1,800) ఉద్యోగి వేతనం నుంచి మినహాయించి ఈపీఎఫ్‌కు జమ చేస్తున్నారు. ఉద్యోగి తరఫున సంస్థ కూడా 12 శాతం చొప్పున రూ.1800 జమ చేస్తోంది. కాకపోతే సంస్థ సమకూర్చే వాటాలో 8.33 శాతం (రూ.1,250) ఈపీఎస్‌కు వెళుతోంది. మిగిలినది (రూ.550) ఈపీఎఫ్ ఖాతాకు జమ అవుతోంది. అధిక పింఛను ఆప్షన్ ఇస్తే ఇక మీదట వాస్తవ వేతనం (బేసిక్, డీఏ)పై 12 శాతం అమలవుతుంది. అలాంటప్పుడు ఉద్యోగితో పాటు సంస్థలు కూడా అదనపు భారం మోయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఏ అనే ఉద్యోగికి ప్రస్తుతం మూల వేతనం, డీఏ కలిపి రూ.30,000 ఉందని అనుకుందాం. అయినా కానీ, రూ.15,000 గరిష్ట వేతన పరిమితి ఆధారంగా ప్రతి నెలా రూ.1800 మొత్తాన్ని మినహాయించే వారు. సంస్థ కూడా తన వంతుగా రూ.1800 జమ చేసేది. కానీ, ఇకపై రూ.30 వేలకు 12 శాతం అంటే రూ.3,600 ప్రతి నెలా ఉద్యోగి వాటా నుంచి కోత పడుతుంది. దీనికి సంస్థ కూడా అంతే మొత్తం జమ చేయాల్సి వస్తుంది. దీనివల్ల కంపెనీలపైనా భారం పడుతుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం గరిష్టంగా రూ.15,000 వేతనంపైనే సంస్థ చందా పరిమితమై ఉంది. కనుక ఇంతకు మించి సంస్థలు ఎందుకు చెల్లిస్తాయి? వీటన్నింటిపై స్పష్టత ఇవ్వకుండానే ఈపీఎఫ్‌వో దరఖాస్తు చేసుకోవాలని కోరింది.

## అంత పింఛను ఎవరు చెల్లించాలి?

ఉదాహరణకు కిరణ్ అనే వ్యక్తి 1996 ఏప్రిల్ 1న ఉద్యోగంలో చేరాడని అనుకుందాం. నాడు అతడి బేసిక్ వేతనం రూ.5,000. నాటి నుంచి ఏటా 7.5 శాతం చొప్పున పెరుగుతూ వచ్చిందని భావిస్తే.. అతడు అధిక పెన్షన్ ఆప్షన్ ఎంపిక చేసుకోకపోతే, 2031 నాటికి 35 ఏళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం, అతడికి ప్రతి నెలా రూ.7,929 పెన్షన్ వస్తుంది. ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో కిరణ్ ఒకవేళ అధిక పెన్షన్ ఆప్షన్ ఇస్తే అతడికి 2031 తర్వాత నుంచి ప్రతి నెలా వచ్చే పింఛను రూ.26,879కి పెరుగుతుంది. దీనికోసం ఇప్పుడు రూ.9.74 లక్షలు జమ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తంపై వచ్చే రాబడి రేటు 23.4 శాతం. ఇంత రాబడి అంటే అది కచ్చితంగా ఉద్యోగులకు లాభించేదే. కానీ, అది ఈపీఎఫ్ నిధిపై ఇది గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. అందుకుని ఈపీఎఫ్‌వో ప్రత్యామ్నాయ ఫార్ములా కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తోంది.

## సర్వీస్ కాలం..

అదనపు పెన్షన్ కోరుకునే వారు ఎంత అదనపు మొత్తం ఇప్పుడు జమ చేయాలన్నది ఆసక్తికరంగా మారింది. నిబంధనల ప్రకారం రిటైర్మెంట్ నాటికి ఈపీఎస్ పథకం కింద పదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే పెన్షన్‌కు అర్హత లభిస్తుంది. ఈపీఎస్ కింద సర్వీస్ ఎంత ఎక్కువ కాలం ఉంటే అంత అధికంగా పెన్షన్ అందుకోగలరు. అధిక పెన్షన్ ఆప్షన్ ఇవ్వాలా? వద్దా? అనేదానికి కూడా ఇదే ప్రామాణికం అవుతుంది. ఈపీఎస్ 95 కింద 20 ఏళ్లకు పైగా సర్వీస్ ఉన్న వారు అధిక పెన్షన్ ఆప్షన్‌తో ఎక్కువగా ప్రయోజనం పొందుతారన్నది ప్రాథమిక అంచనా.

## దేనికైనా కట్టుబడి ఉండాలి?

ఈపీఎస్ 95 కింద పెన్షన్ లెక్కింపు అనేది పెన్షన్ సర్వీస్, బేసిక్ వేతనంపై ఆధారపడి ఉంటుంది. ఈపీఎస్ 95 పథకం 1995 నవంబర్ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం హామీగా ఉంటుంది. ఆరంభంలో రూ.5,000 బేసిక్ శాలరీ పరిమితి విధించారు. 2001 జూన్ నుంచి రూ.6,500 చేశారు. ఆ తర్వాత 2014 సెప్టెంబర్ నుంచి రూ.15,000కు పెంచారు. ఇంతకంటే అధిక వేతం తీసుకుంటున్నా.. ఈపీఎస్‌కు అధికంగా జమ చేసే అవకాశం లేక రిటైర్మెంట్ తర్వాత తక్కువ పెన్షన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఇప్పటి వరకు ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రూ.15,000 పరిమితి తొలగిపోయింది. రిటైర్మెంట్‌కు ముందు చివరి ఐదేళ్ల కాలంలో ఉన్న సగటు బేసిక్ వేతనం ఆధారంగా పెన్షన్ అందుకోవడానికి అర్హులు అవుతారు. సుప్రీంకోర్టు ఆదేశాలను యథాతథంగా అమలు చేస్తే ఎక్కువ సర్వీస్ ఉండి.. అధిక మూల వేతనం, డీఏ కలిగిన వారికి ఎక్కువ పెన్షన్ రిటైర్మెంట్ తర్వాత వస్తుంది. కానీ, ఈపీఎఫ్‌వో వైపు నుంచి పారదర్శకత లోపించింది. ఎంత పెన్షన్ ఇస్తారో చెప్పకుండా, ఈపీఎఫ్‌వో నిర్ణయించిన సూత్రం మేరకు పెన్షన్ తీసుకునేందుకు సమ్మతమేనంటూ అంగీకారం తెలియజేయాలని ఆన్‌లైన్ దరఖాస్తులో షరతు విధించినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పథకంలో చేసే మార్పులకు అంగీకారం తెలపాలని కూడా కోరుతోంది. అధిక పెన్షన్ ఆప్షన్ ఇచ్చినా, తనపై చెల్లింపుల భారం పడకుండా ఈపీఎఫ్‌వో చూస్తున్నట్టు అర్థమవుతోంది. పైగా 2014 నాటి నిబంధనల సవరణ తర్వాత వాస్తవ వేతనంపై జమలు చేస్తున్న వారు సైతం ఇప్పుడు అధిక పెన్షన్ పొందాలంటే.. నాడు ఈపీఎఫ్‌వో నుంచి ఉద్యోగి, సంస్థ ఉమ్మడిగా తీసుకున్న అనుమతి పత్రాన్ని సమర్పించాలని ఈపీఎఫ్‌వో నిబంధన విధించింది. ఇంతకాలం అధిక చందాలను అనుమతిస్తూ, ఇప్పుడు అనుమతి ఉండాలని కోరడమే విడ్డూరంగా ఉంది.

## పెట్టుబడి వారసులకు రాదు..



ఈపీఎస్ సభ్యుడు, అతని జీవిత భాగస్వామి, వారి మరణానంతరం వైకల్యంతో ఉన్న 25 ఏళ్లకు మించని పిల్లల వరకు పెన్షన్ వస్తుంది. వీరి తదనంతరం పింఛను నిధి వారసులకు చెల్లించరు. దీంతో దీన్ని మంచి సాధనం కాదని చాలా మంది అనుకుంటారు. ప్రైవేటు లైఫ్ ఇన్సూరెన్స్ యాన్యుటీ ప్లాన్‌లో చివర్లో పెట్టుబడి తిరిగిచ్చే ప్లాన్‌లో గరిష్ట రాబడి 6.87 శాతంగా ఉంటే.. పెట్టుబడి తిరిగి ఇవ్వని (ఈపీఎస్ మాదిరి) ఆప్షన్‌లో రాబడి 8.6 శాతంగా ఉంది. ఇంతకంటే అధిక రాబడిని, ప్రభుత్వ హామీతో ఇచ్చే ఏదైనా సాధనం ఉందంటే.. నిస్సందేహంగా దానికి వెళ్లొచ్చు. ఈపీఎస్‌లో కనీసం 15 ఏళ్ల సర్వీస్ ఉన్న వారికి సైతం ఇంతకంటే అధిక రాబడే వస్తుంది. రిటైర్మెంట్ తర్వాత ఎక్కువ కాలం జీవించి లేని సందర్భాల్లో పెన్షన్ ఫండ్‌ను తిరిగిచ్చే ప్లాన్ మెరుగైనది అవుతుంది. కానీ, రిటైర్మెంట్ తర్వాత ఎంత కాలం జీవించి ఉంటామన్నది ఎవరికీ తెలియదు.

## ప్రత్యామ్నాయం ఎన్‌పీఎస్

అధిక పింఛను ఆప్షన్‌కు ఈపీఎఫ్‌వో దరఖాస్తు తీసుకుంటున్నప్పటికీ.. అందులో పారదర్శకత లేదు. అధిక పింఛను అంటే ఎంత చెల్లిస్తామనే స్పష్టత లేదు. అన్నింటికీ కట్టుబడి ఉంటాము, షరతులకు అంగీకరిస్తాము? అన్న అంగీకారాన్ని తీసుకుంటోంది. కనుక రిటైర్మెంట్ తర్వాత మెరుగైన పింఛను కోరుకునే వారు ఈపీఎస్‌నే నమ్ముకోవాలనేమీ లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్), ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. పన్ను ప్రయోజనంతో కూడిన రాబడి కోరుకునే వారికి ఎన్‌పీఎస్ మెరుగైనది. రిటైర్మెంట్ తర్వాత ఎన్‌పీఎస్ కింద సమకూరిన మొత్తం నిధిలో 60 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. దీనిపై ఎలాంటి పన్ను ఉండదు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాలి. యాన్యుటీ అనేది పెన్షన్ ప్లాన్. ఇక్కడి నుంచి కనీసం మరో 20 ఏళ్ల సర్వీసు ఉన్న వారు ఎన్‌పీఎస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

- 1980 జనవరి 1న జన్మించిన వారు ఎన్‌పీఎస్‌ను ఎంపిక చేసుకుని ప్రతి నెలా రూ.2,000 చొప్పున, ఇక్కడి నుంచి మరో 17 ఏళ్లపాటు అంటే 60 ఏళ్ల వరకు ఇన్వెస్ట్ చేస్తే.. 10 శాతం రాబడి ప్రకారం రూ.10.7 లక్షలు సమకూరుతాయి. 40 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే 6 శాతం రాబడి రేటు ప్రకారం 2147 పెన్షన్‌గా వస్తుంది. లేదు 100% నిధితో యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే రూ.5,367 పెన్షన్‌గా లభిస్తుంది.
- 1990 జనవరి 1న జన్మించిన వారు ప్రతి నెలా రూ. 2,000ను ఎన్‌పీఎస్‌లో జమ చేసుకుంటే, 60 ఏళ్ల నాటికి 10 శాతం రాబడి రేటు ఆధారంగా రూ.33 లక్షలు సమకూరుతాయి. 40% నిధితో యాన్యుటీ ప్లాన్ తీసుకుంటే రూ. 16,594గా లభిస్తుంది.

| అబాట్ ఇండియా | సెంట్రమ్ బ్రోకింగ్ | కొనొచ్చు |
|---|---|---|



ప్రస్తుత ధర: రూ. 20,133 టార్గెట్: రూ. 24,450

ఎందుకంటే: హెల్త్‌కేర్ రంగ దిగ్గజం అబాట్ ఇండియా ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో అంచనాలను మించిన ఫలితాలు ప్రకటించింది. వార్షికంగా అమ్మకాలు 8 శాతం పుంజుకుని రూ. 1,330 కోట్లను తాకాయి. అయితే త్రైమాసికవారీగా(క్యూ2) 6 శాతం తక్కువ. ప్రధానంగా థెరపీ విభాగంలో జీఐ(జెంటిసిన్), వీఎంఎస్ అమ్మకాలు ఇందుకు దోహదం చేశాయి. కంపెనీకి కీలక బ్రాండ్లు ఉడిలివ్, థైరోనార్మ్, డుఫలాక్ తదితరాలు మెరుగైన అమ్మకాలు సాధించాయి. దీంతో ముడివ్యయాల భారాన్ని విభిన్న ప్రొడక్టులను విడుదల చేయడం ద్వారా బ్యాలన్స్ చేసుకుంది. కాగా.. స్థూల మార్జిన్లు వార్షికంగా 3.17 శాతం, త్రైమాసికవారీగా 1.63 శాతం నీరసించి 43.8 శాతానికి చేరాయి.




అయితే ప్రమోషనల్ తదితర వ్యయాలు తగ్గడంతో నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్ల మెరుగుకు సహకరించాయి. వెరసి వార్షికంగా 1.88 శాతం, త్రైమాసికవారీగా 1.03 శాతం బలపడి 24 శాతాన్ని తాకాయి. ఇక నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 17.6 శాతం పుంజుకుని రూ. 320 కోట్లకు చేరింది. నికర లాభం సైతం వార్షికంగా 24 శాతం ఎగసి రూ. 250 కోట్లను తాకింది. అయితే ఇబిటా, నికర లాభం త్రైమాసికవారీగా 7 శాతంస్థాయిలో డీలా పడ్డాయి. కొత్త ప్రొడక్టులు వృద్ధిలో 3 శాతాన్ని ఆక్రమించడంతో భవిష్యత్‌లో ఈ వాటా మరింత ఊపందుకునే వీలుంది. కంపెనీ ఇకపై మరిన్ని బలమైన ప్రొడక్టులను ప్రవేశపెట్టనుండటమే దీనికి కారణం. 2022లో మార్కెట్లో థెరప్యూటిక్ విభాగాలలో 10 కొత్త ప్రొడక్టులను ఆవిష్కరించింది.

| మారుతీ సుజుకీ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు |
|---|---|---|

ప్రస్తుత ధర: రూ. 8,610 టార్గెట్: రూ. 10,700

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. వార్షికంగా అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నిర్వహణ లాభం(ఇబిటా) 82 శాతం దూసుకెళ్లి రూ. 2,830 కోట్లను తాకింది. అంచనాలకంటే ఇది 8 శాతం అధికంకాగా.. స్థూల మార్జిన్లు 2.6 శాతం బలపడ్డాయి. ఇందుకు పటిష్ట అమ్మకపు ధరలు, విభిన్న ప్రొడక్టుల విడుదల, కరెన్సీ సానుకూల కదలికలు దోహదపడ్డాయి. ఇక ప్రొడక్టులకు తగిన ధరలు లభించడంతో మొత్తం ఆదాయం సైతం 25 శాతం జంప్‌చేసి రూ. 29,040 కోట్లకు చేరింది. ఇది అంచనాలకంటే 2 శాతం అధికం. ఇటీవల ప్రవేశపెట్టిన పలు కొత్త మోడళ్ల నేపథ్యంలో భారీ స్థాయిలో 3.63 లక్షల యూనిట్ల కోసం ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయి.




వెరసి రానున్న త్రైమాసికాలలో అమ్మకాల వృద్ధికి పెండింగ్ ఆర్డర్‌బుక్ దారి చూపనుంది. మార్చితో ముగియనున్న ఈ ఏడాది చివరికల్లా ఆదాయం 32 శాతం పుంజుకోగలదని అంచనా. ఈ బాటలో రెండేళ్ల కాలానికి వార్షికంగా 14 శాతం చొప్పున అమ్మకాల్లో వృద్ధి నమోదయ్యే వీలుంది. దీంతో ఇబిటా మార్జిన్లు ఈ ఏడాది 6.5 శాతం నుంచి 9.3 శాతానికి మెరుగుపడనున్నాయి. రెండేళ్లలో అంటే 2025కల్లా 11.3 శాతానికి చేరే అవకాశముంది. ఈ ఏడాది షేరువారీ ఆర్జన(ఈపీఎస్) రూ. 263కు చేరవచ్చని భావిస్తున్నాం. వచ్చే ఏడాది రూ. 380, 2025లో రూ. 428 ఈపీఎస్ సాధించవచ్చని అంచనా. ఆర్థిక మందగమనం, కొత్త ప్రొడక్టులకు అంతంత మాత్రం డిమాండ్ తదితర అంశాలు కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే


# గోల్డ్ బాండ్ గ్రాము @ రూ. 5,611

## నేటి నుంచి కొత్త సావరిన్ గోల్డ్ బాండ్



**ముంబై:** సావరిన్ గోల్డ్ బాండ్ పథకం 2022–23.. తదుపరి దశలో భాగంగా రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) గ్రాముకి రూ. 5,611 ధరను నిర్ణయించింది. ఐదు రోజులపాటు కొనసాగనున్న ఇష్యూ సోమవారం (6న) ప్రారంభంకానుంది. ఈ నెల 10న ముగియనున్న ఇష్యూలో భాగంగా గ్రాముకి ముందస్తు(నామినల్) ధర రూ. 5,611ను ఆర్‌బీఐ నిర్ణయించింది. కాగా.. ఆర్‌బీఐతో సంప్రదింపుల తదుపరి కేంద్ర ప్రభుత్వం గ్రాముకి నామినల్ విలువకు రూ. 50 డిస్కౌంట్‌ను ప్రకటించింది. అయితే ఇందుకు ఇన్వెస్టర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని డిజిటల్ విధానంలో చెల్లింపులు చేపట్టవలసి ఉంటుంది. వెరసి గ్రాము గోల్డ్ బాండ్ ధర రూ. 5,561కు లభించనుంది. ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ సావరిన్ గోల్డ్ బాండ్లను జారీ చేసే సంగతి తెలిసిందే. వీటిని స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్(ఎస్‌హెచ్‌సీఐఎల్), కొన్ని పోస్టాఫీసులు, ఎన్‌ఎస్‌ఈ, బీఎస్‌ఈల ద్వారా విక్రయిస్తారు. వీటి కాలపరిమితి ఎనిమిదేళ్లుకాగా.. ఐదేళ్ల తదుపరి రిడెంప్షన్‌ను అనుమతిస్తారు. ఫిజికల్ గోల్డ్‌కు డిమాండును తగ్గించే బాటలో 2015 నవంబర్‌లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. దేశీ పొదుపు సొమ్మును ఫిజికల్ గోల్డ్‌కు కాకుండా సావరిన్ గోల్డ్ కొనుగోలువైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. పూర్తి స్వచ్ఛత(999)గల బంగారం సగటు ధరను బాండ్లకు నిర్ణయిస్తారు. ఒక గ్రామును ఒక యూనిట్‌గా కేటాయిస్తారు. వ్యక్తిగత ఇన్వెస్టర్లను కనిష్టంగా 1 గ్రాము, గరిష్టంగా 4 కేజీలవరకూ కొనుగోలుకి అనుమతిస్తారు. హెచ్‌యూఎఫ్‌లకు 4 కేజీలు, ట్రస్ట్‌లకు 20 కేజీల వరకూ యూనిట్ల కొనుగోలుకి వీలుంటుంది.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

# కేవైసీ ఒక్కసారి చేస్తే చాలదా?

**ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్ మరణించినట్టయితే అవి నామినీకి బదిలీ అవుతాయి. నామినీ విక్రయ నిబంధనలు ఏమిటి?** – విశ్వ ప్రకాశ్

జాయింట్ హోల్డర్ ఉంటే, రెండో వాటాదారునకు అవి బదిలీ అవుతాయి. ఇది అసలు హోల్డర్ లేని సందర్భంగా బదిలీ చేస్తున్నారు కనుక పన్ను వర్తించదు. సంబంధిత యూనిట్లను పొందిన వారు వాటిని విక్రయించినప్పుడు పన్ను చెల్లించాలి. యూనిట్లను ఎంత కాలం ఉంచుకున్నారనే అంశాల ఆధారంగా, స్వల్పకాల, దీర్ఘకాల మూలధన లాభాలపన్ను వర్తిస్తుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అయితే ఏడాది కాలంలోపు విక్రయించినప్పుడు వచ్చే లాభాన్ని, స్వల్పకాల మూలధన లాభాల పన్నుగా పరిగణిస్తారు. ఈ మొత్తంపై 15 శాతం పన్ను పడుతుంది. ఏడాదికి మించిన పెట్టుబడులను విక్రయించినప్పుడు వచ్చే లాభం దీర్ఘకాల మూలధన లాభాల పన్నుగా చట్టం పరిగణిస్తుంది. మొదటి రూ.లక్ష లాభం మినహా మిగిలిన లాభంపై 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈక్విటీయేతర మ్యూచువల్ ఫండ్స్‌లో మూడేళ్ల వరకు పెట్టుబడులపై లాభాన్ని స్వల్పకాల మూలధన లాభంగాను, మూడేళ్లకు మించిన పెట్టుబడులపై లాభాన్ని దీర్ఘకాల మూలధన లాభంగా చూస్తారు. స్వల్పకాల మూలధన లాభం వ్యక్తి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను నుంచి ద్రవ్యోల్బణాన్ని మినహాయించి, మిగిలిన మొత్తంపై 20 శాతం పన్ను చెల్లించాలి. ఒకరి నుంచి వారసత్వంగా లేదంటే నామినీగా వచ్చే పెట్టుబడులను విక్రయించినప్పుడు వాటి అసలు కొనుగోలు తేదీ నుంచి హోల్డింగ్ పీరియడ్ అమలవుతుంది. బదిలీ అయిన తేదీ కాదు. ఉదాహరణకు ఒక ఇన్వెస్టర్ రూ.5 లక్షల విలువైన మ్యూచువల్ ఫండ్స్ యూనిట్లను 2020లో కొనుగోలు చేసి, 2021లో మరణిస్తే,

**వివిధ మ్యూచువల్ ఫండ్స్‌కు ఏకీకృత కేవైసీ ప్లాట్‌ఫామ్ ఉందా?** – సమీర్ పటేల్

ప్రస్తుతం సెంట్రల్ కేవైసీ అనేది ఉంది. ఇన్వెస్టర్లు వారి కేవైసీ ప్రక్రియను ఒక్కసారి మాత్రమే పూర్తి చేసేందుకు సెంట్రల్ కేవైసీ అవకాశం కల్పిస్తోంది. వేర్వేరు మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసే ప్రతిసారి కేవైసీ ఇవ్వాల్సిన అవసరం దీంతో ఉండదు. పాన్, చిరునామా ధ్రువీకరణను ఇన్వెస్టర్ పంపిణీదారు లేదా సెబీ వద్ద నమోదు అయిన మార్కెట్ ఇంటర్‌మీడియరీ అయిన స్టాక్ బ్రోకర్, డిపాజిటరీ పార్టిసిపెంట్‌కు ఇచ్చినా.. తాజా సమాచారం సెంట్రల్ కేవైసీ రికార్డుల్లో అప్‌డేట్ అవుతుంది.

# హోండా కార్స్ నుంచి న్యూ సిటీ

**న్యూఢిల్లీ:** హోండా కార్స్ ఇండియా తాజాగా న్యూ సిటీ (పెట్రోల్), న్యూ సిటీ ఈ:హెచ్ఈవీ పేరిట రెండు కొత్త మోడల్స్‌ను దేశీ మార్కెట్లో ఆవిష్కరించింది. భద్రత, కనెక్టివిటీ, సౌకర్యాలకు సంబంధించి వీటిలో అదనపు ఫీచర్స్‌ను జోడించినట్లు కంపెనీ తెలిపింది. న్యూ సిటీ (ఐ–వీటెక్) ధర రూ. 11.49 లక్షల నుంచి రూ. 14.72 లక్షల వరకూ ఉంటుంది. న్యూ సిటీ (ఈ–హెచ్ఈవీ) ధర రూ. 18.89 లక్షల నుంచి రూ. 20.39 లక్షల వరకూ ఉంటుంది. పెట్రోల్ వేరియంట్లు లీటరుకు 17.8 నుంచి 18.4 కిలోమీటర్ల వరకూ మైలేజీ ఇస్తాయి. న్యూ సిటీలో అధునాతన 20.3 సెం.మీ. టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే ఆడియో, వన్ టచ్ ఎలక్ట్రిక్ సన్ రూఫ్, అలాగే 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హోండా లేన్ వాచ్, యాంటీ థెఫ్ట్ అలారం తదితర ఫీచర్లు ఉంటాయి. రెండు మోడల్స్‌లోనూ 3 ఏళ్ల అపరిమిత కిలోమీటర్ల వారంటీ లభిస్తుంది. కావాలంటే 5 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకూ అదనంగా వారంటీ తీసుకోవచ్చు. లిథియం అయాన్ బ్యాటరీ వారంటీ 8 ఏళ్ల లేదా 1,60,000 కి.మీ.గా (ఏది ముందైతే అది) ఉంటుంది.




హోండా న్యూసిటీ ఎంఎంసీని ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అరుణ్ జ్యోతి, ప్రైడ్ గ్రూప్ ఎండీ సురేష్ రెడ్డి

## క్లుప్తంగా...

### బంగారం పెట్టలేదని విద్యుత్ స్తంభం ఎక్కి..

**అత్తింటివారిపై అల్లుడి అలక**



విద్యుత్ స్తంభం ఎక్కిన శేఖర్‌ను కిందకు దించే ప్రయత్నం చేస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ: పెళ్లిలో తనకు బంగారం పెట్టలేదంటూ ఓ అల్లుడు అత్తవారిపై అలిగాడు.. అంతటితో ఆగకుండా విద్యుత్ స్తంభం ఎక్కి కూర్చున్నాడు. మెదక్ పట్టణ పరిధిలోని గాంధీనగర్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. పట్టణానికి చెందిన శేఖర్ ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం క్రితం ఓ యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అయితే వివాహ సమయంలో అత్తగారు బంగారం పెట్టలేదని అలిగి విద్యుత్ స్తంభం ఎక్కాడు. స్థానికులు శేఖర్ స్తంభం ఎక్కడాన్ని గమనించి.. విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విషయం తెలియడంతో మెదక్ ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, డీఎస్పీ సైదులు, సీఐ, ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అందరూ శేఖర్‌కు నచ్చజెప్పడంతో కిందకు దిగడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### 'కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి'

సాక్షి, హైదరాబాద్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని కాన్షీరామ్ ఫౌండేషన్ చైర్మన్, కాన్షీరామ్ సోదరి స్వర్ణ కౌర్ డిమాండ్ చేశారు. ఆమె ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రపతి పదవిని తృణప్రాయంగా వదిలేసి బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారానికి పాటుపడిన వ్యక్తి కాన్షీరామ్ అన్నారు. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో బహుజన సమాజ్‌పార్టీని నాలుగుసార్లు అధికారంలోకి తీసుకురావడమే కాకుండా.. మాయావతిని సీఎం పదవిలో కూర్చోబెట్టారని చెప్పారు. అనంతరం తెలంగాణ ప్రజా సంఘాల అధ్యక్షులు గజ్జల కాంతం మాటాడారు.

## యాదాద్రిలో దర్శనానికి 3 గంటలు



దక్షిణ దిశలో క్యూలైన్ తీసేయడంతో మండుటెండలో నిల్చున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. దీంతో శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల సంఖ్య పెరిగింది. జంట నగరాలతో పాటు ఆయా రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా రావడంతో సందడిగా మారింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాదం విక్రయశాఖ, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం ఆరగింపు సమయాల్లో భక్తులు క్యూలైన్లలో నిలిచారు. ఇటీవల బ్రహ్మోత్సవాల్లో భాగంగా దక్షిణ దిశలోని క్యూలైన్‌ను తొలగించడంతో భక్తులు మండుటెండకు ఇబ్బందులు పడ్డారు. పైన ఎండ, కింద కృష్ణ స్టోన్‌ఫ్లోరింగ్‌పై కాళ్లు కాలుతుండటంతో భక్తులు ఇదేమీ బాధ స్వామి అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. స్వామి వారిని 35 వేలకు పైగా భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా, వివిధ పూజలతో నిత్య ఆదాయం రూ. 48,70,521 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

**దర్పణంలో ప్రతిబింబం**


అత్యంత అద్భుతంగా నిర్మించిన యాదాద్రి ప్రధానాలయ ముఖమండపంలో భారీ దర్పణం ఏర్పాటు చేశారు. శ్రీవారిని దర్శించుకుని వచ్చిన భక్తులతో పాటు ముఖ మండపం ఆ దర్పణంలో ప్రతిబింబంగా కనిపించడంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ యాదాద్రి భువనగిరి



ప్రధానాలయం ముఖ మండపం ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేసిన భారీ దర్పణం

# ప్రైవేటు పీహెచ్‌డీలకు రెడ్ కార్పెట్




**కాలేజీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు మార్గదర్శకాలు**

- విడుదల చేసిన జేఎన్‌టీయూహెచ్.. • ఇలా చేస్తే నాణ్యత ఎలా ఉంటుందంటున్న నిపుణులు
- కాలేజీల ఇష్టారాజ్యమవుతుందన్న సందేహాలు • గైడ్స్‌ను వేధించేలా నిబంధనలున్నాయన్న వాదనలు
- అధ్యాపకుల్లో పెరుగుతున్న ఆందోళన • అర్హత ఉంటేనే ఇస్తాం: వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు కాలేజీల నుంచి పీహెచ్‌డీ చేసేందుకు అనుమతించడం వివాదాస్పదమవుతోంది. ఇది యూజీసీ నిబంధనలకు విరుద్ధమని అధ్యాపక వర్గం అంటోంది. ఈ విధానం వల్ల పీహెచ్‌డీల నాణ్యతే దెబ్బతింటుందని విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. విద్యార్జనలో అత్యున్నత స్థాయి డిగ్రీ అయిన పీహెచ్‌డీ (పరిశోధన)ని యూనివర్సిటీ గుర్తింపు ఉన్న కాలేజీల్లో చేసేందుకు అనుమతిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ పీహెచ్‌డీ కేవలం యూనివర్సిటీల పరిధిలోనే జరుగుతోంది. వర్సిటీ నేతృత్వంలోని ఫ్యాకల్టీ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేయాల్సి ఉంటుంది. యూనివర్సిటీల్లో గత కొన్నేళ్ళుగా అధ్యాపకుల నియామకం జరగడం లేదు. దీంతో గైడ్‌గా ఉండే అధ్యాపకులకు కొరత ఏర్పడింది. పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి ఇది పెద్ద అవరోధంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక నుంచి ప్రైవేటు కాలేజీల్లో పీహెచ్‌డీ ఇచ్చేందుకు జేఎన్‌టీయూహెచ్ కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. దీని ప్రకారం రీసెర్చ్‌కు అవసరమైన అన్ని మౌలిక వసతులు, ఫ్యాకల్టీ ఉన్న కాలేజీలకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అంతిమంగా పీహెచ్‌డీలు ఇచ్చేది యూనివర్సిటీయేనని అంటున్నారు. అయితే, వర్సిటీ పట్టాలిచ్చే ఓ కర్మాగారంగా ప్రేక్షక పాత్ర పోషించే వీలుందని నిపుణులు సందేహిస్తున్నారు.

**నాణ్యత ఉంటుందా...?**

అఫ్లియేషన్ ఉన్న ప్రైవేటు కాలేజీల్లో పీహెచ్‌డీ చేయడం వల్ల నాణ్యత ఎలా ఉంటుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చాలా ఇంజనీరింగ్ కాలేజీలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫ్యాకల్టీని ఎంపిక చేయడం లేదని నిపుణులు అంటున్నారు. కాలేజీల్లో ఒక్కో విభాగానికి ప్రొఫెసర్‌లను అర్హులైన వాళ్ళనే నియమించాల్సి ఉన్నా... నిబంధనలు సరిగ్గా పాటించడం లేదని చెబుతున్నారు. పీహెచ్‌డీల వ్యవహారంలోనూ ఇదే జరిగే వీలుందని, అర్హతలేని గైడ్‌ల చేత పీహెచ్‌డీ పర్యవేక్షణ చేయించే వీలుందనే ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థి పీహెచ్‌డీ పూర్తయ్యే వరకూ అధ్యాపకుడు అదే కాలేజీలో పనిచేయాలనే నిబంధనపైనా తీవ్ర వ్యతిరేకత వస్తోంది. దీన్ని అడ్డం పెట్టుకుని కాలేజీలు అధ్యాపకులను తమ కాలేజీలోనే ఉండాలని వేధించే వీలుందని చెబుతున్నారు. ఇప్పటికే వేతనాలు సకాలంలో ఇవ్వకపోయినా కాలేజీ యాజమాన్యాలను అడిగే దిక్కు ఉండటం లేదని వాపోతున్నారు. నిపుణులైన గైడ్స్ దీనివల్ల ప్రైవేటు కాలేజీల్లో పనిచేసేందుకు మొగ్గు చూపకపోవచ్చనే విమర్శలొస్తున్నాయి. పీహెచ్‌డీకి గైడ్‌గా ఉండే వ్యక్తికి పీహెచ్‌డీ పూర్తయి.. ఏవైనా జనరల్స్‌లో మూడు ఆర్టికల్స్ పబ్లిష్ అయి ఉండాలి. అయితే, యూనివర్సిటీలు పూర్తి అనుభవం ఉన్న వాళ్ళతోనే పీహెచ్‌డీ మార్గదర్శకత్వం ఇప్పిస్తున్నాయి. ఇప్పుడు ప్రైవేటుకు అప్పగిస్తే ఈ తరహా నాణ్యత ఉండదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



**నాణ్యత దెబ్బతింటుంది**

ప్రైవేటు కాలేజీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు అనుమతిస్తే నాణ్యత దెబ్బతింటుంది. ఇది యూజీసీ నిబంధనలకు విరుద్ధం. విద్యార్థి పీహెచ్‌డీ అయ్యే వరకూ అధ్యాపకులు అదే కాలేజీలో ఉండాలనే నిబంధన కూడా అన్యాయమే. దీనివల్ల ఫ్యాకల్టీతో కాలేజీల యాజమాన్యాలు వెట్టి చాకిరీ చేయించుకుంటాయి. జేఎన్‌టీయూహెచ్ ఈ నిర్ణయాన్ని సమీక్షించుకోవాలి.

– డాక్టర్ వి బాలకృష్ణా రెడ్డి
టెక్నికల్, ప్రొఫెషనల్ ఇనిస్టిట్యూట్స్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

**అర్హత ఉన్న వారికే అవకాశం**

గత ఏడాది రీసెర్చ్ కేంద్రాలున్న కాలేజీలను గుర్తించాం. అదే కాలేజీలో అర్హులైన వారిని ఎంపిక చేసి పీహెచ్‌డీ చేసే విద్యార్థిని సూపర్ వైజ్ చేసే బాధ్యత అప్పగిస్తాం. అంతిమంగా పీహెచ్‌డీ ఇచ్చేది యూనివర్సిటీనే. ఇది యూజీసీ నిబంధనలకు వ్యతిరేకం కాదు.

– ప్రొఫెసర్ కట్టా నర్సింహా రెడ్డి
వీసీ, జేఎన్‌టీయూహెచ్

## బతుకమ్మ చీరలు @ రూ.330 కోట్లు

- 21 రంగులు.. 25 డిజైన్లలో చీరలు
- 6.22 కోట్ల మీటర్ల వస్త్రం • ఆర్డర్లు ఖరారు చేసిన టీపీటీడీసీఎల్



సిరిసిల్లలో బతుకమ్మ చీరలు నేస్తున్న కార్మికుడు(ఫైల్)

సిరిసిల్ల: రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఏటా అందించే బతుకమ్మ పండుగ కానుక చీరల రంగులను, డిజైన్లను తెలంగాణ పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీపీటీడీసీఎల్) ఖరారు చేసింది. 21 రంగుల్లో 25 డిజైన్లలో బతుకమ్మ చీరలను ఆర్డర్ చేసింది. రాష్ట్రంలోని కోటి మందికి బతుకమ్మ పండగ కానుకగా ప్రభుత్వం చీరలను అందిస్తున్న సంగతి తెలిసిందే. సిరిసిల్ల నేత కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో 2017 నుంచి బతుకమ్మ పండుగకు చీరలను సారెగా అందిస్తున్నారు. గతంలో రాష్ట చేనేత సహకార సంస్థ (టెస్కో) ద్వారా ఈ చీరల ఆర్డర్లు ఇవ్వగా.. ఈసారి తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీపీటీడీసీఎల్) ద్వారా ఆర్డర్లు ఇచ్చారు.

- సిరిసిల్లలోని 139 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (మ్యాక్స్)లకు 3.70 కోట్ల మీటర్ల బట్టను (64.03 లక్షల చీరలు), 126 చిన్న తరహా పరిశ్రమల (ఎస్ఎస్ఐ)కు 1.84 కోట్ల మీటర్ల బట్టను (31.87 లక్షల చీరలు) ఆర్డర్లు ఇచ్చారు. జాకెట్ పీసుల కోసం మరో 68 లక్షల మీటర్ల బట్టను సిరిసిల్ల శివారు టెక్స్‌టైల్ పార్క్‌లోని ఆధునిక మగ్గాలకు ఇచ్చారు. మొత్తంగా 6.22 కోట్ల మీటర్ల బట్టను బతుకమ్మ చీరల ఉత్పత్తి లక్ష్యంగా ఈ ఏడాది నిర్ణయించారు. చీరలకు ఉత్పత్తి రవాణా, ప్రాసెసింగ్ ఇతర ఖర్చులకు మొత్తం రూ.330 కోట్లు కేటాయించారు. సెప్టెంబరు నెలాఖరులోగా ఈ చీరలను సిరిసిల్ల నేతన్నలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు.



**మగ్గాల సంఖ్య ఆధారంగా ఆర్డర్లు ఇస్తాం**

సిరిసిల్ల నేతన్నలకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చాము. 21 రంగుల్లో 25 డిజైన్లలో చీరలను ఉత్పత్తి చేయాలని స్పష్టం చేశాము. మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్లలోని మరమగ్గాల సంఖ్య ఆధారంగా వస్త్రోత్పత్తిదారులకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇస్తాం. గడువులోగా చీరలను ఉత్పత్తి చేసి అందించాల్సి ఉంటుంది.

– సాగర్, జౌళిశాఖ, ఏడీ



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.